ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
13-2-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 13 పేజీలు: 12 వెల: 6.50

రంగంలోకి కొత్త రాఫెల్ విమానాలు
ట్రంప్- నెతన్యాహు కీలక భేటీ
9లో

# మండలికి ఓకే అసెంబ్లీకి 'నో'



విపక్ష హోదా ఇవ్వనందుకు వైసిపి నిరసన
మండలిలో పోరాడుతాం: జగన్

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనసభలో వైసిపికి చట్టసభల నిబంధనలను అనుసరించి విపక్షహోదా ఇవ్వాల్సి ఉందని మాజీ సీఎం జగన్ అన్నారు.ఇది రాజ్యాంగబద్ధమైన అంశం కాబట్టి ఆ దిశలో ఆందోళన చేస్తున్నామన్నారు.అయితే ఈ విషయంపై ఎందుకు చట్టపరంగా వ్యవహరించాల్సిన వాళ్ళు,ఇతరులు మాట్లాడుతున్నారని ఆయన ప్రశ్నించారు.వ్యవస్థను నాశనం చేస్తున్నారు.ప్రశ్నించే అవకాశం లేకుండా సభలో మనకు విపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు.ఏపీ అసెంబ్లీలో వైసీపీకి విపక్ష హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ.. ఈసారి బడ్జెట్ సమావేశాల్లోనూ గవర్నర్ ప్రసంగం సందర్భంగా అసెంబ్లీకి హాజరైన జగన్ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. బాయ్ కాట్ చేసి వెళ్లిపోయారు. అనంతరం అసెంబ్లీ బీఏసీ సమావేశానికి కూడా జగన్ హాజరు కాలేదు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో జగన్ భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై వారితో చర్చించారు. అనంతరం కీలక నిర్ణయం ప్రక టించారు. వైఎస్సార్సీపీకి విపక్ష పార్టీ హోదా ఇవ్వనందుకు నిరసనగా ఈసారి కూడా >>2



వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు
ప్రాయోజిత పథకాలకు అదనపు నిధులు సాధించాలి
గరిష్ఠ కేటాయింపులతో ప్రణాళికలు
మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు కూడా అడగాలి

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

**విజయవాడ, ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర బడ్జెట్‌లో 2026 – 27 ఏపీలో కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేసే అంశంపై అత్యంత సమన్వయంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని ఏపీలో ఏర్పాటు చేసుకునే అంశంపై ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ అదనపు నిధులు సాధించాలని ముఖ్యమంత్రి సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గత పాలకులు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు ఖర్చు పెట్టకుండా పథకాలను నిర్వీర్యం చేశారని యుటిలిటీ సర్టిఫికెట్ల విషయంలో సమస్యలు తలెత్తాయన్నారు. ప్రభుత్వ శాఖలు అన్నీ వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్ని ఖర్చు చేయగలిగితే అదనపు నిధుల్ని కూడా డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వచ్చే బడ్జెట్‌లోగా గరిష్ట కేటాయింపులు చేసుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు చేశారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన చాలెంజ్ విధానంలోనూ మరికొన్ని నిధులు సాధించుకునేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్ ను శ్రీకాకుళం విజయనగరంవిశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వ్యాల్యూ చైన్ పరిశ్రమల్ని ఏర్పాటు చేసే ఆలోచన చేయాలన్నారు. ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులోనూ తీరప్రాంతంలో ఉన్న మూలపేట నుంచి దిగువున కృష్ణపట్నం వరకూ ప్రతిపాదన చేయాలన్నారు. కంటైనర్ మాన్యుఫాక్చరింగ్, ఎక్విప్మెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన ఏర్పాటు చేసుకునేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మెగాటెక్స్ టైల్ పార్కును పలనాడు ప్రాంతంలోనూ, స్పోర్ట్ మాన్యుఫాక్చరింగ్ హబ్ తిరుపతిలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇండియా సెమికండక్టర్ మిషన్ 2.0 లో భాగంగా సెమీ కండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టులను అమరావతిలో ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వీటితో పాటు రాజధాని ప్రాంతంలోని హెల్త్ సిటీలో బయోడిజైన్, మెడ్ టెక్ పార్క్, బయో ఫార్మా శక్తి మిషన్ లాంటి ఎకోసిస్టం వస్తుందన్నారు. మెడికల్ టూరిజం హీల్ ఇన్ ఏపీ అన్న విధానంలో అమరావతిలో ప్రాజెక్టులు >>2

# బంగ్లా ఎన్నికలు హింసాత్మకం

**ఢాకా, ఫిబ్రవరి 12:** ఏడాదిన్నర నుంచి తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ లో గురువారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ హింసాత్మక సంఘటనల మధ్య జరిగింది. ఈ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశ రాజధాని ఢాకాలో ఆయన ఓటు వేశారు. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకుంటున్నారు. 2024 ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలోని హసీనా ప్రభుత్వం పడిపోయింది. అప్పటి నుంచి బంగ్లాదేశ్ పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వస్తున్నది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. మొత్తం 299 పార్లమెంటు స్థానాలకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్ఎఇస్లామీ కూటమి మధ్యే ఉంది. విద్యార్థుల ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఈ ఎన్నికలతోపాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది. హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. హసీనా ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాదేశ్‌లో హిందువులు లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్ఎఇస్లామీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వస్తే మైనారిటీలపై దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని హిందువులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.దేశవ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, ఖుల్నా జిల్లాలో జరిగిన ఘర్షణలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేత మొహిబుజ్జమాన్ కోచీ మరణించారు.ఈ ఘటనలతో దేశంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఖుల్నాలోని అలియా మదరసా పోలింగ్ కేంద్రం వద్ద బీఎన్‌పీ, జమాత్ ఏఇస్లామీ మద్దతుదారుల మధ్య ఘర్షణజరిగింది. జమాత్‌తరఫున ప్రచారం చేస్తున్న మదరసా ప్రిన్సిపాల్‌ను మొహిబుజ్జమాన్ కోచీ అడ్డుకునే ప్రయత్నంలో ఈ మరణం సంభవించింది.



ఢాకాలో ఓటు వేసిన మహ్మద్ యూనస్



# కార్మిక సమ్మె ప్రశాంతం

నిలిచిన ఉత్పత్తిరంగ కార్యకలాపాలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన లేబర్ కోడ్‌లు, ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌తో వ్యవసాయ రంగానికి తీరని నష్టం వాటిల్లుతోందని, ఎన్డీయే ప్రభుత్వం కార్పొరేట్‌శక్తులకే అనుకూలంగా వ్యవహరిస్తోందని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 13 ట్రేడ్‌యూనియన్లు ఇచ్చిన నిరసన పిలుపు మేరకు ప్రశాంతంగా ముగిసింది. సుమారు 30 కోట్లమందికిపైగా రైతులు, కార్మికులు, ట్రేడ్‌యూనియన్ కార్యకర్తలు పాల్గొన్న ఈ సమ్మె ప్రశాంతంగానే >>2



సంక్రాంతి లక్కీ డ్రా కేసు

# అంబటికి 14 రోజులు రిమాండ్

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాల సందర్భంగా అంబటి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్ల ద్వారా పింఛనుదారుల నుంచి రూ.200 చొప్పున అక్రమంగా వసూలు చేసి, వారికి బలవంతంగా లాటరీ టికెట్లు అంటగట్టారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై జనసేన పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం మరో కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న అంబటిని, పోలీసులు పీటీ వారెంట్‌పై ఇవాళ గుంటూరు కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయమూర్తి ఎం. కుముదిని, ఆయనకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అంబటిని తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉపాధి కల్పన
విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99పైసలకు భూములు
ఎంఒయులు కుదుర్చుకొన్న కంపెనీలు చాలా ఉన్నాయి: మంత్రి లోకేష్
పరిశ్రమలకు భూకేటాయింపులపై మండలిలో వాడివేడి చర్చ



గురువారం శాసనమండలిలో బొత్స సత్యనారాయణ, మంత్రి లోకేష్

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానం ఇచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99 పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయూలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసన మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మా ట్లాడుతూ రాష్ట్రంలో 5 కంపెనీలకు 99 పైసలకు భూమి కేటా యించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్ కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం జరిగింది. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 >>2

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖ ప్రతిపాదనలు పంపామని త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధాన >>2

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?



మీడియాతో కౌన్సిల్ విపక్షనేత బొత్స

**విజయవాడ,ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** శాసనమండలిలో ప్రతిపక్ష పార్టీ అడుగుతున్న ప్రశ్నలకు కనీస సమాధానం కూడా చెప్పలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు 99 పైసలకే భూములు కేటాయిస్తున్న అంశంపై శాసనమండలిలో ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, కీలక అంశాలపై ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు.వైఎస్సార్ హయాంలోనే విశాఖపట్నంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశామని, అప్పుడే ఆదానీ డేటా సెంటర్ కూడా రాష్ట్రానికి వచ్చిందని గుర్తుచేశారు. అలాంటప్పుడు ఇప్పుడు కూటమి ప్రభుత్వం 99 పైసలకే భూములు ఇస్తామంటూ కంపెనీలకు లాలూచీ పడటం వెనుక ఏం ఉందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు వేల కోట్ల విలువైన భూములు కబ్జా చేశారన్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని అన్నారు.ఒకవైపు 5 వేల కోట్ల భూములున్నాయన్న విమర్శలు వస్తే, గీతం సంస్థ మాత్రం వెయ్యి కోట్ల భూములే తమ వద్ద ఉన్నాయని చెబుతోందని, అసలు నిజం ఏంటో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. పెన్షన్ల అంశంపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి సమాధానం లేదని, గవర్నర్ ప్రసంగం సందర్భంగా అధికారపార్టీ సభ్యులు డప్పులు కొట్టడం తప్ప ప్రజల సమస్యలపై మాట్లాడలేదని విమ ర్శించారు. ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం కింద 15 వేల రూపాయలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, వాస్తవంగా అందరికీ అందించిందా అని ప్రశ్నిస్తే మౌనం వహించిందని >>2



# చట్టసభలపై చులకన వద్దు

సభ్యులకు సూచించిన అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టసభలంటే చులకన భావం కలగకూడదని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు శాసనసభలో వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాలు రెండవ రోజుకు చేరుకున్నాయి.ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ 16వ శాసనసభ 5వ బడ్జెట్ సమావేశాల తొలిరోజే సభలో భావోద్వేగ వాతావరణం నెలకొనడం ఆవేదన కలిగించిందని స్పీకరు అన్నారు. నిన్న గవర్నర్ ప్రసంగం సమయంలో చోటుచేసుకున్న పరిణామాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ సభ్యుల ప్రవర్తన వల్ల సభా గౌరవం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. యువతకు, విద్యార్థులకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో లోకేష్ మాక్ అసెంబ్లీ అనే కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు లభించిందని, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు సైతం దీన్ని ప్రశంసించారని స్పీకర్ గుర్తుచేశారు. 'నిన్న గవర్నర్ >>2

# తెలుగు భాషపై ప్రత్యేక చర్చ జరపండి

స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చిన అధికార భాషా సంఘం అధ్యక్షుడు

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమా వేశాల సందర్భంగా ఒక రోజంతా తెలుగు భాషా అమలు తెలుగు భాషాభివృద్ధి అనే అంశంపై సభ్యులందరితో ప్రత్యేక చర్చ నిర్వహించాలని మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షులు పి. త్రివిక్రమరావు (విక్రమ్‌పూల) కోరారు. గురువారం అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో చింతకాయల అయ్యన్నపాత్రుడుని కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రివిక్రమరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ శాసనసభా పతిగా అయ్యన్నపాత్రుడు ఎంతో హుందగా, ప్రజాస్వామ్య విలువలతో సభను నడిపిస్తున్న తీరు ఒక నూతన అధ్యాయమని ప్రశంసించారు. తెలుగు భాషాభిమానిగా మాతృభాష పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషి అనన్యసామాన్యమని కొనియాడారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఒక రోజును తెలుగు భాషా అంశంపై చర్చకు కేటాయించి, సభలో సభ్యులు అందించే విలువైనసలహాలను పరిగణనలోకి తీసుకుని,వాటిని అమలుచేసేలా రాష్ట్ర >>2



గురువారం తిరువూరు నియోజకవర్గ సమస్యలపై సిఎం చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

# అన్ని సమస్యలను పరిష్కరించుకుందాం: సిఎం చంద్రబాబు

## సిఎంను కలిసిన తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** సమస్యలపై మీ తపన, ఆందోళన నాకు తెలుసు, అన్నింటిని పరిష్కరించుకుందామని సీఎం చంద్రబాబు తిరువూరు ఎంఎల్ఏ కొలకపూడి శ్రీనివాసరావుతో వ్యాఖ్యానించారు. వివాదస్పద అంశాలకు దూరంగా ఉండండి. ఏ అంశమైన తన దృష్టికి తేవాలన్నారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలు, అభివృద్ధి అవసరాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, త్వరలోనే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి, తిరువూరు నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వివరించారు. ముఖ్యంగా గంపలగూడెం మండలం వినగడప కట్టలేరు వంతెన నిర్మాణానికి అవసరమైన నిధుల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వంతెన నిర్మాణం పూర్తయితే తిరువూరు ప్రాంత ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, విద్యార్థుల ప్రయా ణాలకు, అత్యవసర సేవలకు కీలకంగా మారుతుందని ఎమ్మెల్యే వివరించారు. అలాగే నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, సాగునీరు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా సమగ్రంగా వివరించారు. ఈ అంశాలపై స్పందించిన ముఖ్యమంత్రి, తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వినగడప కట్టలేరు వంతెనతో పాటు ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు త్వరలో మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు దశలవారీగా పరిష్కరించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం భరోసా ఇచ్చారు.

# యువతకు ఉద్యోగాలే లక్ష్యం

>> పైసలకు భూములు కేటాయించాం.

**పరిశ్రమలకు భూములు కేటాయింపుపై వాడీవేడి చర్చ..**

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానం ఇచ్చారు. మంత్రి స్పందిస్తూ.. హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్ కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు గారు కేటాయించారు. వారు 21 బిల్డింగ్ ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్ లోనే ఐటీ రంగంలో లక్ష మంది పనిచేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది. వారు ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్ ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీలను నిర్మించడం జరిగింది. సుమారు లక్షా 40వేల మంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విషయంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షించడం జరుగుతుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటా యించడం జరుగుతుందన్నారు. గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చారని ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్పే ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు మేం సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమ లకు భూముల కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈ అంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడం వల్ల సమయం వృధా అవుతోందన్నారు.

**భూముల కేటాయింపు విషయంలో వైసీపీ పిల్‌పై కోర్టు మొట్టికాయలు వేసింది:** మంత్రి లోకేష్ సమాధానం సమాధానం పట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్సన్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అంటూ ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టులో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందన్నారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్ లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

**లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి:** వైసీపీ సభ్యుల అరుపులు నేపథ్యంలో మంత్రి లోకేష్ కలుగచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు వినేందుకు ఓపిక పడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు అరుస్తున్నారు. సమాధానం చెప్పాలా, వద్దా? నేడు దేశానికి వస్తున్న రూ.100 పెట్టుబడుల్లో 25.3 రూపాయలు ఏపీకి వస్తున్నాయన్నారు. వైసీపీ సభ్యులు అరుపులపై స్పందిస్తూ.. లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి. టీం 11 తయారైంది. దీనిపైనా చర్చిద్దామా? 2014 నుంచి 2019 వరకు వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా వ్యవహరించిందో చూశాం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. అమర్ రాజాను రాష్ట్రం నుంచి తరిమేశారు. ఆర్సెల్లార్ మిట్టల్ ఎక్కడికీ వెళ్లలేదు. వైసీపీ సభ్యులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. 50వేల ఐటీ ఉద్యోగాలు రావడం వల్ల సిటీలో డైరెక్ట్ గా సుమారు బిలియన్ డాలర్లు ప్రతి ఏడాది ఆ ఎకానమీకి వస్తుంది. మా లక్ష్యం 5 లక్షల ఐటీ ఉద్యోగాలు. తద్వారా 10 బిలియన్ డాలర్ల మేర ఎకనామిక్ యాక్టివిటీస్ విశాఖలో జరగాలనేది మా లక్ష్యం.

**భూముల కేటాయింపుల విషయంలో కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు:**

వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కాలేదు. బొత్స గారికి అదొక ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపు నుంచి వెళతారు. మేం చాలా పారదర్శకంగా భూ కేటాయింపులు చేశాం. వారి దగ్గర నుంచి ఏం తీసుకున్నారని ఆరోపించారు. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయంలో విమర్శించవచ్చు. నేను బాంబే హౌస్‌కు వెళ్లాను. టాటా సన్స్ ఛైర్మన్ చంద్ర గారు ఒకసారి కలవాలని చెప్పారు. నేను బాంబే హౌస్ కు వెళ్లాను. బాంబే హౌస్ లో కప్ టీ ఇచ్చారు. నన్ను విమర్శించాలనుకంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. నో ప్రాబ్లమ్. కాగ్నిజెంట్ విషయంలో కూడా నన్ను విమర్శించవచ్చు. వాళ్లు నాకు ఓ కప్ కేక్ ఇచ్చారు. దావోస్ లో వారి ఆఫీసుకు వెళ్లినప్పుడు ఆ రోజు నా పుట్టినరోజు. వారు మర్యాదపూర్వకంగా కప్ కేక్ లో క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. సింపుల్. అంతేగానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యం. మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు.

ఒక్క కియా పరిశ్రమ వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. క్లస్టర్ విధానంలో మేం ముందుకు వెళ్తున్నాం. మేం ప్రతి పరిశ్రమను గ్రౌండింగ్ చేస్తాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా నేను సిద్ధమని సవాల్ చేశారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని చెప్పారు.



గురువారం డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎమ్మెల్సీ నాగబాబు, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

# డిసిఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే బాలకృష్ణ

**విజయవాడ.ఫిబ్రవరి 12,ప్రభాతవార్తప్రతినిధి:** డిప్యూటీ సీఎం పేషీలో పవన్‌కల్యాణ్‌తో భేటీ బాలకృష్ణ అయ్యారు. అసెంబ్లీలో నందమూరి బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా పలుకరించుకున్నారు. తమ్ముడు పంచాయతీ రాజ్‌వ్యవస్థలో మంచి మార్పులు తెస్తున్నావంటూ పవన్ అభినందించారు. పవన్‌కల్యాణ్‌ను ఆయనను తన ఛాంబర్‌లోకి తీసుకొనివెళ్ళారు. ఈ సందర్భంగాబాలకృష్ణ హిందూపురం ప్రజాసమస్యలపై పవన్‌కల్యాణ్‌తో చర్చలు జరిపారు. హిందుపురంలో గ్రామీణాభివృద్ధికి సహకరించాలని పవన్‌ను కోరారు. తన నియోజ కవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పనులకు సంబంధించి పలు అంశాలను వివరిస్తూ వినతి పత్రం అందజేసారు. గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పవన్‌కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కలుసుకున్నారు.

# మండలికి ఓకే

>> అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా దూరంగా ఉండాలని జగన్ నిర్ణయించారు. అయితే అసెంబ్లీలో మాత్రమే విపక్ష హోదా ఇవ్వడం లేదు కాబట్టి ఎప్పటిలాగే ఈసారి కూడా శాసనసభకు మాత్రమే ఎమ్మెల్యేలు హాజరుకాకూడదని నిర్ణయించారు. దీంతో మండలికి మాత్రం వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు హాజరుకాబోతున్నారు. ఈ సందర్భంగా శాసనమండలిలో గట్టిగా పోరాడాలని ఎమ్మెల్సీలకు జగన్ దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారిందని, ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేస్తున్నారని జగన్ వారికి తెలిపారు. రూ.5 వేల కోట్ల విలువైన భూమి 54 ఎకరాలు గీతమ్ వర్సిటీకి ఇచ్చేశారని, ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఎవరూ ఇలా ఇచ్చుకోలేదన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోందని, అదే క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్. అన్నారు. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలని ఎమ్మెల్సీలకు సూచించారు. కళ్లు మూసి తెరిచేలోపు మూడేళ్లు గడుస్తాయని, వచ్చేది మన ప్రభుత్వమేనన్నారు. ఇప్పుడు కష్టపడి పని చేస్తున్న వారందరికీ, తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా మీకు మీ పదవులు తిరిగి వస్తాయి కూడా అన్నారు. అలాగే ఇంతకన్నా మంచి పదవులు కూడా దక్కే అవకాశం మీకు ఉందన్నారు.

# కేంద్రం నుంచి మరిన్ని నిధులు

>> చేపట్టాలన్నారు. హిందుపురంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీని ప్రతిపాదించాలన్నారు. తిరుపతిని టూరిజం డెస్టినేషన్ కింద అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన 1000 ఎలక్ట్రిక్ బస్సులను సద్వినియోగం చేసుకుని మరిన్ని ఇబస్సులను సాధించేలా ప్రణాళిక చేయాలన్నారు. కొబ్బరి, కోకో, కాజు, కాఫీ పంటలకు ఎక్కువ నిధులను సాధించుకునే అవకాశం ఉందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులను కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.



గురువారం న్యూఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్‌కు వినతిపత్రం అందచేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

# బెంగళూరు- కడప రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి

### సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్

### మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్

**విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు–కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**కడప విమానాశ్రయం నుంచి విమాన సేవల విస్తరణపైనా:** కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఎపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# వైకాంగ్రెస్ పాలనలో విశాఖకు ఒక్క కంపెనీ అయినా తెచ్చారా? : మంత్రి లోకేశ్

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిది:** రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదని వైకాపా కుట్రలు చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై శాసన మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. కంపెనీల పేరిట రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పనంగా భూములను కట్టబెట్టారంటూ వైకాపా సభ్యులు చేసిన ఆరోపణలను లోకేశ్ తిప్పికొట్టారు. క్రెడిబులిటీ ఉన్న ఐదు సంస్థలకే 99 పైసల చొప్పున భూములు కేటాయించామని, ఆధారాలు లేకుండా విమర్శలు చేస్తే సహించబోమని లోకేశ్ చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల 18 నెలల్లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఆర్సెలార్ మిత్తల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు రానుందని దీనికి భూములు కేటాయించామని మంత్రి లోకేశ్ అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు ఇవ్వడం తప్పా? అని నిలదీశారు. వైకాపా పాలనలో విశాఖకు కనీసం ఒక్క కంపెనీ అయినా తీసుకొచ్చారా అని ప్రశ్నించారు.

# కార్మిక సమ్మె ప్రశాంతం

>> ముగిసింది. ఇండో అమెరికా ట్రేడ్‌డీల్‌లో రైతులు, చిన్న వ్యాపారాలు, కార్మికుల హక్కులు, శ్రేయస్సును కాలరాచేదిగా ఉందని నాయకులు ఆరోపించారు. పార్లమెంటులో కూడా ప్రజాప్రతినిధులు, విపక్ష ఎంపిలు ప్రభుత్వం వెంటనే ఈ డీల్‌ను రద్దుచేసి ప్రధాని నరేంద్రమోడీ ట్రంప్‌నకు లొంగిపోయారంటూ నినాదాలుచేసారు. ఒకరోజు సమ్మెకారణంగా ఉత్పత్తిరంగ కార్యకలాపాలు కుంటుపడ్డాయి. మోడీ చేపట్టిన సంస్కరణల అజెండాను కార్మికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఏడాదిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎన్డీయే సర్కారు పనిచేస్తోందని ఆరోపించారు. రైతు నేత హన్నన్ మొల్లామాట్లాడుతూ ఇటీవల ట్రేడ్ ఒప్పందాలు న్యూజిలాండ్, యూరోప్, అమెరికాలతో జరిగిన ఒప్పందాలు భారత్‌లోని వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, స్థానిక మార్కెట్లలోకి అమెరికా ఉత్పత్తులు ఇకపై వెల్లువలా వచ్చిపడతాయని, దీనివల్ల దేశీయ ఉత్పత్తులకు గండం ఏర్పడుతుందని ఆరోపించారు. అమెరికాతో జరిగిన ఒప్పందం వల్ల భారత్‌లోనిసన్నచిన్నకారు రైతుల జీవనోపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. అమెరికా కారుచౌక వనయవసాయ ఉత్పత్తుల భారత్‌లోకి డంప్‌చేస్తారని, వీటివల్ల చిన్న వ్యాపారాలు, చిరువ్యాపారులకు తీరనినక్షటం ఏర్పడుటుందని ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నేత అమర్‌జీత్‌కౌర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా కూడా కీలక రాష్ట్రాల్లో ఈసమ్మె కొనసాగింది. ఆటోకార్మికులు కూడా రోడ్లపైకి వచ్చి క్యాబ్‌లు, ఆటోలను నిలిపివేసారు. కొన్ని చోట్లప్రభుత్వ పరిధిలోని ఆర్టీసీ సర్వీసులు మధ్యాహ్నం వరకూ నిలిచిపోయాయి. తదనంతరం తగుమాత్రంలోనే సర్వీసులను నడపాల్సి వచ్చింది. దేశవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు.

# విద్యాసంస్థల్లో వసతుల ప్రతిపాదనలు

>> మిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాలను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా వైకాపా హయాంలో టెంబర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వం హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# భారత ఆర్థిక వ్యవస్థకు బడ్జెట్ ఊతం

## రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** పెరుగుతున్న వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం కలిసి సాధించబడుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు 2026-27 కేంద్ర బడ్జెట్ ఊతమిస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం రాజ్యసభలో విత్త మంత్రి మాట్లాడుతూ, ఇదొక 'గోల్డిలాక్స్ మూమెంట్' ఇది అవకాశం కాదు, నిరంతర ప్రయత్నం, జాగ్రత్తగా ప్రణాళిక, సకాలంలో విధాన చర్య ఫలితంగా ఉందని అన్నారు. "జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన మొదటి ముందస్తు అంచనాల ప్రకారం, భారతదేశ వాస్తవ జిడిపి వృద్ధి 2025-26 సంవత్సరానికి 7.4 శాతంగా అంచనా వేయబడింది, అయితే నామమాత్రపు వృద్ధి దాదాపు 8 శాతంగా అంచనా వేయబడింది" అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. "అదే సమయంలో, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం దాదాపు 2 శాతానికి తగ్గిపోయింది. నియంత్రణలో ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలో ఒక ప్రధాన సూత్రంగా మిగిలిపోయిందని ఆర్థిక మంత్రి సీతారామన్ పునరుద్ఘాటించారు. "బడ్జెట్ దేశీయ ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించడం, ఇంధన భద్రతను నిర్ధారించడంపై దృష్టి పెడుతుంది, అదే సమయంలో పౌరులు వారి స్వంత జీవితాలలో స్వావలంబన చెందడానికి కూడా సహాయపడుతుంది" అని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. "జీవన సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఉపాధిని సృష్టించడం, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, గృహ కొనుగోలు శక్తిని పెంచడం లక్ష్యంగా ఉన్న చర్యలు ఈ విధానంలో భాగం" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. మానవ మూలధనాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలను వివరిస్తూ, రాబోయే ఐదు సంవత్సరాలలో ఒక లక్ష అనుబంధ ఆరోగ్య నిపుణులను సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆర్థిక మంత్రి అన్నారు. "ప్రస్తుత సంవత్సరంలో దీని కోసం రూ.1,000 కోట్లు వెచ్చిస్తాం. ఈ చర్య ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తుంది. వైద్య పర్యాటక వృద్ధికి తోడ్పడుతుంది" అని మంత్రి పేర్కొన్నారు. ఉన్నత స్థాయి విద్య నుండి ఉపాధి, సంస్థ స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. 2047 నాటికి ప్రపంచ సేవల మార్కెట్‌లో 10 శాతం వాటాను ఆక్రమించాలనే లక్ష్యంతో, సేవల రంగానికి భారతదేశ యువతను సిద్ధం చేయడంపై ఈ కమిటీ దృష్టి సారిస్తుందని వివరించారు.

# ప్రత్యేక చర్చ జరపండి

>> ప్రభుత్వానికి నివేదించాలని ఆయన స్పీకర్‌ను కోరారు. అదేవిధంగా, మీ నేతృత్వంలో సాగే సభా కార్యక్రమాల్లో ప్రతి సభ్యుడూ తప్పనిసరిగా తెలుగు మాట్లాడేలా స్థిర నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# చట్టసభలపై చులకన వద్దు

>> ప్రసంగిస్తున్నప్పుడు సభలో జరిగిన దృశ్యాలు నన్ను కలచివేశాయి. సభ్యులు నినాదాలు చేస్తూ, కాగితాలు చింపి వేయడం వంటి చర్యలు అత్యంత బాధాకరం' అని స్పీకర్ అన్నారు. వేలాది మంది పోటీ పడితే కేవలం 175 మందికి మాత్రమే దక్కే అరుదైన గౌరవం ఈ సభలో సభ్యులుగా ఉండటం అని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 200లకు పైగా విద్యాసంస్థల నుండి విద్యార్థులు అసెంబ్లీని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని స్పీకర్ తెలిపారు. "మనం చేసే పనులను చూసి ఆ పసిపిల్లలు ఏం నేర్చుకుంటారు? చట్టసభలంటే వారికి చులకన భావం ఏర్పడితే దాన్ని మనం మళ్ళీ మార్చలేము" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సభా గౌరవాన్ని పెంచలేకపోయినా పర్వాలేదు కానీ, దిగజార్చే హక్కు మాత్రం ఎవరికీ లేదని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజలు మన ప్రతి కదలికను గమనిస్తున్నారని, సభ్యులందరూ ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరుతూ స్పీకర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# విపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పలేరా?

>> చెప్పారు. తల్లికి వందనం డబ్బులు పూర్తిగా తల్లుల ఖాతాల్లో జమ కాలేదని, చాలా మంది ఖాతాల్లో ఏడెనిమిది వేల రూపాయలే వచ్చాయని పేర్కొన్నారు. తాము చెప్పిన విషయాలు అవాస్తవమని ప్రభుత్వం నిరూపిస్తే తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. 15 సంవత్సరాల పాటు తాను కూడా మంత్రిగా పనిచేశానని, వివరాలు లేకుండా ఏ అంశాన్నీ ప్రతిపక్షం ప్రశ్నించదని అన్నారు. ప్రభుత్వం కావాలంటే అధికారులతో విచారణ చేయించుకుని తాము చెప్పింది అసత్యమని నిరూపించాలని సవాల్ విసిరారు.

ఈ సమావేశాలు ముగిసేలోపు తల్లికి వందనం బకాయిలను పూర్తిగా చెల్లించాలని, ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలను కనీసం పరిగణలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. కొత్తగా ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని, గతంలో వైసిపి పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పెన్షన్లు మంజూరు చేశామని గుర్తుచేశారు. శాసనమండలిలో తాను లేవనెత్తిన ప్రతి అంశానికి కట్టుబడి ఉన్నానని ఆయన సమాధానం చెప్పారు.

## వారం - వర్జ్యం

13-02-2026, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
ఏకాదశి మ.2.23
మూల సా.4.09
వర్జ్యం : రా.2.35-4.19
దు.ఉ.8.54-9.40
2) మ.12.45-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ విషయములో ఇతరుల జోక్యము అధికమౌతుంది. పోటీ పరీక్షలలో పాల్గొంటారు. ప్రతిష్టను నిలబెట్టుకుంటారు.

**వృషభం:** ఓర్పు బాగా అవసరము. విదేశీ వస్తువులు ఆకర్షణల నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి.

**మిథునం:** చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించగలుగుతారు. ఋణయత్నము ఫలిస్తుంది. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు. వస్త్రలాభం.

**సింహం:** విలువైన పత్రములు డాక్యుమెంట్స్ మొదలైన వాటితో జాగ్రత్త అవసరం. విదేశీయానయత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** విలువైన వస్తువుల కొనుగోలు విషయాలలో తగిన శ్రద్ధ చూపడం చెప్పదగినది. శుభవార్తలు అందుకుంటారు.

**తుల :** మిమ్మలను మోసం చేసే ప్రయత్నాలు ఫలించవు. సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** నేర్పుతో ముఖ్యులవద్ద గుర్తింపు పొందుతారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. వస్తు కొనుగోలు.

**ధనుస్సు:** కొంతమేర జాగ్రత్తలు అవసరం. భాగస్వామ్య వ్యాపారాలలో జాగ్రత్తలు అవసరం. సోదరుల కలయిక.

**మకరం:** పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. కోర్టు కేసుల నుండి బయటపడతారు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** ఆత్మీయవర్గానికి ధన సహాయం చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**మీనం:** విధి నిర్వహణలో పై అధికారుల ప్రశంసలు అందుకుంటారు. వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

సార్వత్రిక సమ్మెతో

# తిరుపతిలో కదం తొక్కిన కార్మికులు




**తిరుపతి,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా తిరుపతిలో కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. ఈ సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు గురువారం ఉదయం అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అక్కడనుండి రైల్వే స్టేషన్ ,కర్నాలవీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు మీదుగా పాత మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను రక్షి ంచాలని... నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని.. మోడీ నిరంకుశ విధానాలపై కార్మికులు నినదించారు. బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రకాష్ బాబు మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు బ్రిటిష్ పాలకులు ఆమోదించిన కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ కాలరాస్తున్నారని విమర్శించారు. 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోర్టులుగా మార్చడం దారుణం అన్నారు. మోడీ అనుసరి స్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు సార్వత్రిక సమ్మెలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మికులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె నారాయణ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే దేశంలో మొట్టమొదటిసారిగా పాండిచ్చేరిలో కార్మిక నాయకుడు సుబ్బయ్య నేతృత్వంలో ఎనిమిది గంటల పని విధానానికి పోరాడి సాధించారని అన్నారు.

నేడు రైతాంగం దివాలా తీస్తోందని రైతులు కార్మికులను కేంద్రం కట్టు బానిసలుగా చూస్తోందని విమర్శించారు. రాజ్యాం గాన్ని అంచలంచలుగా తగ్గించి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో గాంధీని తొలగించారని, స్వాతంత్ర సమరయోధుల పేర్లు కనబడకుండా చేసి ఘాడ్సే లాంటి వారిని తెర ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. డేరా బాబా లాంటివారు అరెస్టు అయితే వెంటనే బెయిల్ మంజూరు అవుతుందని..

వరవరరావు లాంటివారు అరెస్టు అయితే బెయిల్ రాదని ఎద్దేవా చేశారు. సిఐటి యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికృష్ణ ,,ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ , మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ,ఏఐటీయూసీ నాయకులు ఎన్ డి. రవి, శివ, సిపిఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు నాయకులు జయచంద్ర, వేణుగోపాల్, ఐఎఫ్టియు నాయకులు వెంకటరత్నం, ఐ ఎన్ టి యు సి నాయకులు రత్నకుమార్, వైయస్సార్సీపి టి యు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరిట బెదరింపు లేఖలపై కేసు నమోదు

**గుంటూరు ఫిబ్రవరి 12 ప్రభాత వార్త ప్రతినిధి :** ఏపీలో నలుగురు మంత్రులకు మావోయిస్టుల పేరిట బెదిరింపు లేఖలు రావడం తీవ్ర కలకలం రేపింది. మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్‌కు ఈ లేఖలు వచ్చాయి.మీ జీవితం ప్రమాదంలో వుందని, మీతోపాటు మీ కుటుంబ సభ్యుల పైన త్వరలోనే దాడి జరుగుతుందని, 7981777325 ఫోన్ నంబర్ ఈ లేఖల్లో ఉంది. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం చిరునామాతో లేఖలు పంపారు. ఈ అంశంపై ఏపీ అసెంబ్లీ లాబీ వద్ద బుధవారం మంత్రి కందుల దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ.. తనతోపాటు ముగ్గురు మంత్రులకు పోస్టు ద్వారా లేఖలు వచ్చినట్టు చెప్పారు. మావోయిస్టుల పేరిట వచ్చిన లేఖలు చూసి కుటుంబసభ్యులు ఆందోళన చెందినట్టు వెల్లడించారు. వ్యక్తిగతంగా, శాఖపరంగా తాము ఎలాంటి తప్పులు చేయలేదని పేర్కొన్నారు. ఎవరో ఉద్దేశపూర్వకంగానే ఈ లేఖలు రాసి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అయితే ఈ బెదిరింపు లేఖపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో మంత్రి దుర్గేశ్ కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదు పై తుళ్ళూరు పోలీసులు 37/2026 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో మంత్రులకు బెదిరింపు లేఖలు రావడం చర్చనీయాంశమైంది.



# దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయొద్దు: సిపిఐ నారాయణ

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీజరిగిన మాట వాస్తవమేనని, ఆ దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఐ జాతీయనేత డాక్టర్ కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పాపంలో తప్పుచేసిన అధికారులను, పాత ఇఒను వదిలేయకూడదని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే అధికార, ప్రతిపక్షపార్టీలు లడ్డూ విషయంపై రాద్ధాంతం చేస్తున్నాయని, దేవుడిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ లబ్ధికోసం కోట్లాదిమంది భక్తులను మనోవేదనకు గురిచేయొద్దని ఆయన కోరారు. ఇందుకు సంబంధించి ఈ కేసులో సుప్రీంకోర్టు విచారణ చేస్తోందని, ఈ సమయంలో రాజకీయ నేతలు లడ్డూపై మాట్లాడటం ఆపేయాలని సూచించారు. ఎవరిరాజకీయాల కోసం వాళ్ళు కావాలంటే కొట్టుకోండని, అయితే దేవుడిని మాత్రం లాగొద్దని ,లడ్డూ వివాదంపై అనవసర చర్చ ఆపి భక్తుల మనోభావాలను కాపాడండి అని నారాయణ ఘాటుగా స్పందించారు. కల్తీ ప్రసాదంతో సిఎం చంద్రబాబునాయుడు స్వామి ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గత ఐదేళ్ళలో రసాయనాలతో తయారైన కల్తీ నెయ్యితో లడ్డూల తయారుచేయించారని ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టిడిపి ఎమ్మెల్యే కొలకపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు

**విజయవాడ ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# తిరుమల సమాచారం

## తిరుమలనుండి శ్రీనివాసమంగాపురానికి లక్ష్మీకాసులహారం




**తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామిబ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి గరుడ సేవలో స్వామివారికి అలంకరించేందుకు లక్ష్మీకాసుల హారం ఊరేగింపు జరిగింది. గురువారం మధ్యాహ్నం శ్రీవారి లక్ష్మీకాసులహారం శోభాయాత్ర టిటిడి పరిపాలనా భవనం వద్ద నుండి వైభవంగా ప్రారంభమైంది. టిటిడి అదనపు ఇఒ తలపై కాసులహారం పెట్టుకుని తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, టిటిడి జెఇఒలు వి. వీరబ్రహ్మాం, డాక్టర్ ఎ. శరత్, సివిఎస్ఒ కే. వి. మురళీకృష్ణ పాల్గొన్నారు. టిటిడి స్థానిక ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న క్రమంలో తిరుమల శ్రీవారి ఆలయం నుంచి గరుడసేవకుకల్యాణ వేంకటేశ్వరస్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించేందుకు ఊరేగింపుగా తీసుకెళుతున్నట్టు తెలిపారు.టిటిడి నుండి దాదాపు 6.40 కోట్లు రూపాయలు విలువగల నాలుగుకిలోల డైమండ్ మోపుగల ఆరు పేటల బంగారు యజ్ఞోపవీతము స్వామి వారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, పనబాక లక్ష్మీ, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఇఒవరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికార నందివాహనంపై సోమస్కందుడు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రి అధికార నందివాహనంపై కపిలేశ్వరుడు భక్తులకు అభయమిచ్చాడు. ఆద్యంత రహితుడైన శివదేవుడు ఐశ్వర్యసూచికమైన నందిని అధిష్టించినపుడు దర్శనం చేసుకోవడం భక్తులకు పుణ్యం. ఆలయ మాఢ పురవీధుల్లో భక్తుల భజనలు, కోలాటలు ముందు వాహనసేవ జరిగింది. గురువారం ఉదయం బ్రహ్మోత్సవాల్లో సోమస్కంధమూర్తి బంగారుతిరుచ్చిపై కామాక్షి అమ్మవారితో కలసి ఊరేగారు.

## ఎస్వీగోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌ల్లో ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు దాత 10లక్షలు రూపాయలు విరాళం అందించారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరి ధర్ కుమార్ కుమారుడు కుప్పాల నీలేశ్ కుమార్ 10,00,116 రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

## శ్రీవారి ఆశీస్సులకు ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి గురువారం రాత్రి తిరుమలకు వచ్చారు. ఆయనకు వసతికల్పన విభాగం ఓఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు. నేటి ఉదయం దేవుని దర్శనం చేసుకోనున్నారు.

## తిరుమలలో తెలంగాణ డిసిఎం భట్టి - నేటి ఉదయం శ్రీవారి దర్శనం



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. పద్మావతి అతిథిగృహం వద్ద వసతికల్పన విభాగం ఓఎస్‌డి సత్రానాయక్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి తిరుమలలోనే బసచేస్తున్న భట్టి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు. తెలంగాణాలో ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించాలని, తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని కాంగ్రెస్ ప్రభుత్వానికి కలగజేయాలని వేడుకోనున్నారు.

## శ్రీవారి ఆశీస్సులు కోరిన తమిళనాడు మాజీ సిఎం పళనిస్వామి



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తమిళనాట త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు ముందు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సు లందుకునేందుకు గురువారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలోని వకుళమాత విశ్రాంతి భవనం వద్ద పద్మావతి వసతికల్పన విభాగం అధికారులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేసి నేటి ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

# శ్రీశైల మల్లన్న చెంత భక్త జనసందోహం

# నల్లమల్ల నడకదారులన్నీ శివ నామస్మరణం



నడక దారుల్లో వస్తున్న భక్తులు

**శ్రీశైలంప్రాజెక్టు,ఫిబ్రవరి12,ప్రభాతవార్త** శివ నామస్మరణం నల్లమల్ల నడక మార్గం అంతా మారుమ్రోగుతుంది.ఓం నమ:శివయా,ఓం నమ:శివయా అంటూ జనసంద్రం శ్రీశైలం మల్లన్న చెంతకు తండోపా తండాలుగా భక్త జనసందోహం తరలివస్తున్నారు.భక్తి పారవశ్యంతో అలరారుతోంది.శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను కనువిందు చేసే విధంగా పుష్పాలతో ముస్తాబు చేసారు.చికటి పడితే మల్లన్న క్షేత్రం విధ్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలుపుతుంది.నల్లమల్ల నడకదారులన్ని శివ నామస్మరణంతో ప్రజ్వరిల్లు తున్నాయి.ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.హారహార మహదేవా శంభో శంకరా అన్న నినాదంతో పరుగుపరుగున క్షేత్రంకు చేరుకుంటున్నారు.నడక దారి మార్గలన్ని భక్తుల కోలహాలంతో కనువిందు చేస్తున్నాయి.ఈ నడక దారులన్ని దాతలచే అన్నప్రసాద వితరణ జరుగుతుంటే,దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన వైద్యశిబిరాలు,ఉచిత మంచీనీరు,తదితర సౌకర్యాలను ఏర్పాటు చేసింది.మండుటేండను సైతం లెక్కచేయకుండా వెంకటాపురం నుండి నట్టడవి మొట్ల మార్గన మల్లన్నను మనస్సులో స్మరించుకుంటూ కైలాసద్వారం వద్దకు చేరుకుంటున్నారు.అక్కడికి చేరుకున్న భక్తులకు సేద తీరేందుకు చలువ పందిళ్లు,అన్నప్రసాద వితరణ,మంచినీటి సౌకర్యం,వైద్య శిబిరాలు,అత్యవసర సమయాలకు అంబులేన్స్‌లు తదితర వంటివి ఏర్పాట్లు గావించారు.ఈ నడక దారులన్ని చిన్న,పెద్ద,ముసలి,ముతక అనే తేడా లేకుండా మల్లన్న నీ దర్శన భాగ్యం కోరకు తరలివస్తున్నామని నీ చెంతకు చేరుకోగానే మమ్మల్ని పిల్లపాపాలతో చల్లగా దీవించుస్వామి అంటూ వేడుకుంటున్నారు.మల్లన్న వద్దకు చేరుకున్న భక్తాదులకు సలక సౌకర్యాలను ఏర్పాటు చేసి అనువైన దర్శన బాగ్యం కల్పించడం దేవస్థానం తీసుకోంది.శ్రీశైలక్షేత్రం నలుచేరుగుల భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి.శివ మాలలో వచ్చిన స్వాములు శివదీక్ష శిబిరాలకు చేరుకోని ఇరుముడిని సమర్పిస్తున్నారు.శివస్వాములకు తగిన సమయంలో దర్శనం కల్పిస్తుండడంతో వారు పునితులౌవుతున్నారు. ఈక్రమంలోనే మరికొందరు భక్తులు పాతళగంగకు చేరుకోని పుణ్యస్నానాలు అచరించి తమ మ్రొక్కులను తీర్చుకుంటున్నారు.దర్శనం క్యూలై న్లన్ని భక్త సంద్రంతో కిటకిటాలాడు తున్నాయి.

# రసవత్తరంగా సాగిన ప్రశ్నోత్తరాలు

## పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటి ప్రతిపాదన లేదన్న మంత్రి లోకేష్

**విజయవాడ.ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం రెండో రోజు ప్రారంభమయ్యాయి. సభలో పలు ఆసక్తికర అంశాలు చోటు చేసుకున్నాయి.సభ మొదలైన వెంటనే స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రశ్నోత్తరాలను చేపట్టారు.ఈ కార్యక్రమం రసవత్తరంగా సాగింది. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. ఒంగోలు ఐఐటీ తాత్కాలిక క్యాంపస్ వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇడుపులపాయ, ఒంగోలు మధ్య విద్యార్థులు తిరగాల్సి వస్తోందని, ఇది తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఎమ్మెల్యే సింధూర రెడ్డి ప్రశ్నకు మంత్రి నారా లోకేశ్ సమాధానం ఇచ్చారు. పుట్టపర్తిలో ఐఐటీ ఏర్పాటు ప్రతిపాదన లేదని మంత్రి స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సభలో ప్రస్తావించారు. సరైన అనుమతులు లేకుండానే కొందరు కాలేజీలు పెడుతున్నారని ఎమ్మెల్యే బత్తుల ఆరోపించారు. దీనిపై మంత్రి లోకేశ్ సమాధామిస్తూ.. అక్రమాలపై వివరాలు తెలియజేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏయే కాలేజీలకు అనుమతులు ఇచ్చారనే దానిపై తన దృష్టికి తీసుకురావాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పుత్తూరు పురపాలక సంస్థ చైర్మన్‌పై తప్పుడు కుల ధ్రువీకరణ ఆరోపణలకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. పుత్తూరు పురపాలక సంస్థ చైర్మన్‌ను ఇప్పటికే తొలగించినట్లు మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భాను ప్రకాశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో స్థానిక ఎన్నికలు ఎలా జరిగాయో అదరికీ తెలుసని.. తప్పుడు సర్టిఫికెట్లతో పదవులు పొందారని తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక వ్యవస్థలను కూడా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రిజర్వ్ స్థానాలను కూడా గత ప్రభుత్వం కాజేసిందని ఆరోపిస్తూ.. దీనిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటారా అని ఎమ్మెల్యే భాను ప్రకాశ్ ప్రశ్నించారు.దీనిపై మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. జీవో 135లో అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. సభ్యులు అడిగినట్లు అదనపు చర్యలు ఏమి తీసుకోవచ్చో పరిశీలిస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. విజయవాడలోని సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని పాయకాపురం ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ ఇంటర్మీడియట్ కాలేజీని డిగ్రీ కాలేజీ వరకు అప్ గ్రేడ్ చేయాలి.రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇక్కడే మొదటిసారి ప్రవేశ పెట్టడం జరిగింది. సుమారు రూ.15కోట్ల వ్యయంతో అదనపు బిల్డింగ్ నిర్మాణం ఖర్చు చేయడం ద్వారా డిగ్రీ కాలేజి పూర్తి అవుతుంది. ఎందుకంటే అనేకమంది పేదలు, ఆటో కార్మికులు,తాపీ కూలీలు ఈ నియోజవర్గంలో ఉన్నారు. ఇక్కడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లేదు.ఆడపిల్లలు డిగ్రీ కాలేజీలో చదువుకోసం నగరంలోని వేరొక ప్రాంతాలకు వెళ్ళవలసి వస్తున్నది.చాలా ఇబ్బందులు పడుతున్నారు.అలాగే ఇంటర్మీడియట్ కాలేజీ విద్యార్థులు ఆడుకోవడానికి, కాలేజీ చుట్టూతా ప్రహరీ గోడ,మిగిలిన వాటి నిమిత్తం మంత్రి లోకేష్ 20లక్షలు కేటాయించగా, సంవత్సరం పొడువునా ఆ గోడ నిర్మాణం జరిగి ఇటీవల పూర్తి చేశారు.ప్రక్కన బీసీ సంక్షేమ హాస్టల్ ఉంది.హాస్టల్కు కూడా నిధులు కేటాయించాలి. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తీవ్రంగా నెలకొన్న సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ శాసనసభలో జీరో అవర్ సందర్భంగా గళం విప్పారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ పరిధిలోని వత్సవాయి, వీర్లపాడు, నందిగామ మండలాలకు చెందిన వేలాది ఎకరాల భూములు పూర్తిగా ఈ కాల్వపైనే ఆధారపడి ఉన్నాయని, అయితే అవసరమైన స్థాయిలో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. బోనకల్లు బ్రాంచ్ కాల్వ సామర్థం 1350 క్యూసెక్కులు కాగా,

ప్రస్తుతం కేవలం 900 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో బోనకల్లు మం డలం దాటిన తర్వాత కాల్వలో నీరు ముందుకు వెళ్లడం లేదని, వత్సవాయి మండలానికి 30 క్యూసెక్కులకు మించి నీరు రావడం లేదని తెలిపారు.

# రాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం ప్రాజెక్టు ఫిబ్రవరి 12, ప్రభాత వార్త.** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం నాడు సాయంకాలం రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి శ్రీస్వామిఅమ్మ వార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమంలో దేవదాయ కమిషనరు, కె. రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ఎస్.ఎస్. చంద్రశేఖర ఆజాద్ , ధర్మకర్తల అధ్యక్షులు పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు వారు పలువురు ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమములో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, వస్త్రాలకు పూజాదికాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మంత్రి మరియు స్థానిక శాసనసభ్యుల మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి ప్రదక్షిణ పూర్వకంగా స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా ఎంతో చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైలక్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాలలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేవారని ప్రతీతి. ఈ సంప్రదాయాన్ని అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి మరియు దసరా మహోత్సవాలలోనూ శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అనవాయితీగా సమర్పిస్తోంది.

# ఎమ్మెల్యేలతో మంత్రి లోకేష్ డిన్నర్ మీటింగ్‌లు

**విజయవాడ,ఫిబ్రవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** పార్టీ బలోపేతం విషయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ వినూత్న పంథా ఎంచుకున్నారు. పార్టీని గ్రౌండ్ లెవల్ నుంచి బలోపేతం చేసేందుకు సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ..ఎమ్మెల్యేలు, క్యాడర్‌కు మరింత దగ్గరయ్యేలా డిన్నర్ మీటింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా..ఆత్మీయ వాతావరణంలో ప్రతి రోజూ ఏడుగురు ఎమ్మెల్యేలతో భోజనం చేస్తూ..వారి మనోగతాలు తెలుసుకుంటున్నారు. ఈ నిర్ణయం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా నియోజకవర్గాల అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యేలను ఆరా తీస్తున్నారు నారా లోకేష్. జిల్లాల వారీగా ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తూ, వారి వ్యక్తిగత యోగక్షేమాలతో పాటు స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఉంటే వెంటనే పరిష్కరించేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. కేవలం ఆఫీసు గోడల మధ్య కాకుండా, డైనింగ్ టేబుల్‌పై సాగే చర్చల వల్ల ఎమ్మెల్యేలతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పడుతుందని లోకేష్ భావిస్తున్నారు. మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిపై లోకేష్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అనుభవం లేక కొంతమంది చేస్తున్న చిన్నపాటి పొరపాట్లను సరిదిద్దేందుకు ఈ వేదికను వాడుకుంటున్నారు. వార్నింగ్, గదమాయింపులు కాకుండా.. ఓ ఫ్రెండ్‌లా, ఓ మెంటార్‌లా పాలనపై అవగాహన కల్పిస్తున్నారు. హైకమాండ్‌కు, యువ ఎమ్మెల్యేలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంచడం ద్వారా పార్టీకి క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని అందించడమే ఈ సమావేశాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. టెక్నాలజీని వాడుకుంటూ డాష్ బోర్డుల ద్వారా డెవలప్‌మెంట్‌ను పర్యవేక్షించడమే కాదు..క్షేత్రస్థాయిలో మనుషులతో మమేకమవ్వడం తన శైలి అని లోకేష్ నిరూపిస్తున్నారు. సీనియర్లకు సముచిత గౌరవం ఇస్తూనే, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్న తీరు పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని కలిగిస్తోంది. ఈ డిన్నర్ మీటింగ్స్ ద్వారా ఆయన వేస్తున్న అడుగులు అటు పార్టీ ఐక్యతను, ఇటు ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# స్వామి ఆశీస్సులందుకున్న సినీదర్శకుడు రాఘవేంద్రరావు



**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంక టేశ్వరస్వామి ఆశీస్సు లు అందు కున్నట్లు సినీదర్శకుడు రాఘవేంద్రరావు తెలిపారు. ఇష్టదైవం దర్శనం చేసుకోవడం మనసు ఆనందంగా ఉందన్నారు. గురువారం ఉదయం ఆయన అనుచరులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సు లందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కాలంచెల్లిన భవనాలపై నిర్లక్ష్యమేనా! - టెండర్ స్థాయికి చేరినా జాప్యమే

**తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలలో పాతబడిన,కాలంచెల్లిచన వసతి గృహాల భవనాలపై టిటిడి నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎందుకనే విమర్శలు భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే తిరుమలలో పురాతన కాటేజీలను గుర్తించిన టిటిడి అధికారులు వాటి స్థానంలో కొత్తవి అధునాతనంగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్దం చేశారు. అయితే అప్పట్లో టిటిడి బోర్డు లేకపోవడంతో అధికారులు దాతల సహకారంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని భావించారు. మళ్ళీ ఆ ప్రతిపాదనలు ఆచరణకు రాలేదు. వసతి కల్పన విభాగం అధి కారులు కూడా తిర ుమలలో భక్తులకు ప్రయోజనం లేని కాటేజీలను గుర్తించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు ప్రకటన
నెం. 197 నుండి 200/2025-26, తేది: 10.02.2026
కార్యపాలక ఇంజనీరు, (గ్రా.నీ.స (ప్రా) విభాగం, పొదిలి పరిధిలో PMAGY & JJM క్రింద 4 పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 4 పనులకు అంచనా విలువ: రూ.47.00 లక్షలు. టెండర్లు తేది: 17.02.2026 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in నందు చూడగలరు. ఫోన్: 9100121663.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స (ప్రా) విభాగం, పొదిలి
DIPR.No.19066/CL/Advt/1/1/2022-23, తేది: 12.02.2026

వార్త

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.

-అబ్రహం లింకన్

# అవినీతిపై అదుపేది?

ఆయా ప్రపంచ దేశాల అవినీతిని లెక్కగట్టిహెచ్చరించే ఏకైక సంస్థ ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ ఈ ఏడాది కూడా తన నివేదికను విడుదల చేసింది. అందులో మన దేశానిది 91వ స్థానం వచ్చింది. కానీ తాజా లెక్కలలో 91ర్యాంకులో ఉన్నాం. గత ఏడాది నివేదికతో పోల్చి చూసుకుంటే ఈసారి కాస్త మెరుగైన పరిస్థితి కనపడుతోంది. 2025 సంవత్సరానికి గాను భారత్ మాల్దీవులు, మొరాకో, ట్యునీషియాతో సమాన స్థాయిలో 39 స్కోరుతో 91వ స్థానానికి ఎదిగింది. గత ఏడాదితో పోలిస్తే 1పాయింట్ మెరుగు పడిందన్నమాట. ప్రపంచవ్యాప్తంగా వీటిపరిస్థితి చూస్తే ఆందోళనకరమే. అవినీతికి సంబంధించి ప్రపంచ దేశాల సగటు స్కోరు దశాబ్ద కాలంలో 42కి పడిపోయింది. మూడింట రెండు వంతుల స్కోర్ 50లోపలే ఉంది. ఇదే మరింత ఆందోళనకర పరిస్థితులను సూచిస్తోంది. లంచాలు తీసుకోవడం, అంతే నేరమైన విషయాన్నిభారత దేశ చట్టాలు ఎంత చెప్పినా ప్రభుత్వాధికారులు ఎవరూ పట్టించుకోకపోవడమే భారత దేశ దౌర్భాగ్యం. ఇటీవల కాలంలో వారికి భయం, భక్తి లోపించింది. ఉద్యోగంలో చేరిన వెంటనే బల్లకింద చేతులు పెట్టేస్తున్నారు. ప్రభుత్వాధికారుల తమకు వీలైన పనులు చేయించుకోవడానికి వారికి ఇచ్చేది లంచం. మరో మంచి మాట చెప్పలేము. అధికారిని ఏ విధంగా లోబరచుకొని తమ ప్రయోజనాలుకాపాడుకోవాలనుకున్నా, లంచం ఆశ చూపేవారు, అవినీతిని తప్పు పట్టే వారున్నా, అవినీతి నిరోధక శాఖ అవినీతిపరులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా సరే వారి గమనంమారదు. ఎప్పటికప్పుడే అనే ధోరణిలో మార్పు చెందలేకపోతున్నారు. దులిపేసుకుని మళ్లీ కొత్తప్రయత్నం. కోట్లాది రూపాయలు సంపాదించినా ఇంకా ఇంకా కావాలనే తాపత్రయ పడతారు. సాధారణంగా రెవెన్యూ శాఖను అతి అవినీతి మయమైన శాఖగా భావిస్తుంటారు. కానీ దాదాపుప్రభుత్వ శాఖలు అన్నిటిలోనూ లంచావతారులున్నారనే అపప్రధ ఉందనే ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లో అవినీతి పెచ్చుపెరిగిపోయింది. వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు చేయని ప్రయత్నాలు లేవు. జీరో పాయింట్లుంటేనే అత్యధిక అవినీతి ఉన్నట్లు లెక్క. ప్రభుత్వ పాలనలోఅవినీతి, బంధు ప్రీతి బాగా పాతుకుపోయిందనేది అందరికీ తెలిసిందే. పలు దేశాల్లో పెచ్చుమీరిన అవినీతిపై యువత ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయా ప్రభుత్వాల మీద ఎదురు తిరిగిన సందర్భాలు మనకు విదితమే. ఇదే జాబితాలో 89 స్కోరుతో డెన్మార్క్ అతి తక్కువ అవినీతి ఉన్న దేశంగా నిలిచింది. ఫిన్లాండ్, సింగపూర్, న్యూజిలాండ్, నార్వే, స్వీడన్, స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, జర్మనీతో మొదటి టెన్‌లోఉన్నాయి. అవినీతి సమస్య వల్ల అనేక దేశాలు రాజకీయ ఆర్థిక సంక్షోభాలు బారిన పడ్డాయి. అవినీతి అక్రమార్జనలకు సంబంధించిన విశేషాలు అప్పట్లో పనామాపత్రాలు బయటిపెట్టి సంచలనం సృష్టించాయి. అక్రమ మార్గంలో కూడపెట్టిన లక్షలాది కోట్ల ధనాన్ని ఇతర దేశాలకు తరలించిన తీరు మనకు తెలిసిందే. అవినీతి మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అమెరికా, ఫ్రాన్స్ దేశాలు ఒక ప్రణాళికతో ముందుకు నడుస్తున్నాయి. కాగా అవినీతి వ్యతిరేకంగా దేశాల్ని కలిసికట్టుగా పోరాడాలనే స్ఫూర్తి ఎక్కడా లేకపోయింది. భారత దేశం విషయానికి వస్తే ప్రభుత్వవిభాగాల్లోఊడలు పెంచుకున్న అవినీతికి అడ్డుకట్ట వేయడం చాలా కష్టం అవుతుంది. ప్రభుత్వ విభాగాల్లో అధికారులు ఎన్ని విధాలుగా అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నారో తేటతెల్లమే. అలాంటి అవినీతిపరులు సస్పెన్షన్ అవుతారు. ఆ తర్వాత మళ్లీ రాజకీయ ప్రాబల్యంతో తిరుగుతారు. ఇవన్నీఎక్కడికి దారితీస్తాయి? అవినీతిని నిరోధించే మూల సూత్రాలు కూడా పక్కనపెట్టి వారిని అందలం ఎక్కిస్తున్నారు. అదే వ్యవస్థలోని లోపం. ప్రజాధనాన్ని సొంత ఆస్తిగా మెక్కేసే అధికారులకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అందుకు బాధ్యులైన వారు కూడా గతంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించేవారు. భయపడేవారు. ఇప్పుడు భయపడే పరిస్థితి ఏమి లేదు. స్వాతంత్ర్యం వచ్చిన వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు ప్రధానమైన కుంభకోణాల్లో దాదాపు 100లక్షల కోట్ల ప్రజాధనం కొల్లగొట్టినట్లు ఒక అంచనా. ప్రధానంగా రాజకీయ పదవుల్లో ఉన్నవారే అవినీతికి పాల్పడుతుంటే వారు శాసనాలు ఏమి చేయగలరు, వాటిని అమలుపరిచే విషయంలో ఏ విధంగా సహాయ పడగలరు అన్న విషయాలన్నీ తెరమీద అందరికీ తెలిసిన విషయమే ఇలాంటి పరిస్థితులు అవినీతిని ఎండగట్టే స్థితిలోఉండవు. అవినీతిపరులను కఠినంగా శిక్షించే చట్టాలు లేకపోవడం ఒక వెనుకబాటు. అవినీతి అవగాహన సూచిక 2025ప్రకారం, ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ అవినీతి తీవ్రమైన ముప్పుగా ఉంది. ప్రభుత్వరంగ అవినీతి స్థాయిల ఆధారంగా ప్రపంచ వ్యాప్తంగా 182 దేశాలను ర్యాంక్ చేస్తుంది. ఫలితాలు '0' అత్యంత అవినీతి, నుండి 100 రాంక్ అనగానే అవినీతి రహితమని ఇక్కడ అర్థం. 2012 నుండి 31దేశాలు తమ అవినీతి స్థాయిలను గణనీయంగా తగ్గించుకున్నప్పటికీ, మిగిలినవి సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయి. ప్రపంచ సగటు 42కొత్త కనిష్ట స్థాయికి పడిపోయింది. అయితే మూడింట రెండువంతుల కంటే ఎక్కువ దేశాలు 50 కంటే తక్కువ స్కోరు సాధించాయి. ప్రజా ప్రతినిధులు కూడా సుపరిపాలన అందించడంకన్నా తమ సొంత ప్రయోజనాలు కాపాడేందుకే కాలంవెచ్చిస్తున్నారని అనిపిస్తోంది. అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కంకణం కట్టుకున్ననాడే దేశం సుభిక్షంగాఉంటుంది. ప్రధానంగా ఈదేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి ముందుగారాజకీయ అవినీతిని నిర్మూలించగలిగితేనే సాధ్యమౌతుంది.

ఒకే భాషను శాస్త్రీయంగా అభ్యసిస్తే మిగతా భాషలు సులభతరం అవుతాయి.



మహాత్మాగాంధీ

జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.



స్వామి వివేకానంద

# విద్యాభివృద్ధి లేని వికసిత్ భారత్ సాధ్యమేనా?

*దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తరగతులు, భారీ డ్రాప్ అవుట్‌లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి.*

టి. నాగరాజు

వికసిత్ భారత్ నినాదంతో యూనియన్ బడ్జెట్ 2026 మౌలిక సదుపాయాలు, డిజిటలైజేషన్, తయారీ రంగం, ప్రపంచ పోటీతత్వం వంటి పదాలతో ప్రజల నమ్మకాన్ని పొందే ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజా విద్యా కోణంలో పరిశీలిస్తే, ఈ బడ్జెట్‌లో విద్యకు తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తుంది. నేడు భారత్ అభివృద్ధి కథ ముందుకు సాగుతున్నప్పటికీ, విద్యను సామాజిక హక్కుగా లేదా మౌలిక ప్రజావనరుగా చూడడంలో విఫలమవుతోంది. భారత జిడిపి పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నా, ఆ వృద్ధికి అనుగుణంగా విద్యపై ఖర్చుపెరగడం లేదు. విద్య వ్యయంపై నామమాత్రపు పెరుగుదలను ప్రభుత్వం చూపిస్తోంది. కానీ ద్రవ్యోల్బణం, నమోదు పెరుగుదల, వ్యవస్థాపక ఖర్చులు లెక్కలోకి తీసుకుంటే, ఈసంఖ్యలు తప్పుదారిపట్టించేవే. 2026-27 బడ్జెట్‌లో విద్య మంత్రిత్వ శాఖకు కేటాయింపు చేసినది రూ.1,39,289 కోట్లు కాగా, 2025-26లో ఇది రూ. 1,28,650 కోట్లు. నామమాత్రంగా పెరుగుదలఉన్నా, వాస్తవ (ద్రవ్యోల్బణ సర్దుబాటు చేసిన) వ్యయం స్థిరంగా ఉంది. మొత్తం జిడిపిలో విద్య ఖర్చు సుమారు 3-4శాతం మాత్రమే ఉంది. ఇది జాతీయ విద్యా విధానం (ఎనఈపి) సూచించిన 6శాతం లక్ష్యానికి చాలా తక్కువ. కేంద్ర ప్రభుత్వ కేటాయింపు కేవలం జిడిపిలో 0.3 శాతం మాత్రమే. మొత్తం అంచనా ఖర్చు రూ. 53.5 లక్షల కోట్లలో విద్య వాటా సుమారు 2.6 శాతం మాత్రమే. అనుపాతంగా చూస్తే, జిడిపి పెరుగుతున్నప్పటికీ విద్యకు ప్రాధాన్యం తగ్గుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే ఈ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. జపాన్, చైనా, యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలు తమ జిడిపిలో 6 శాతం లేదా అంతకంటే ఎక్కువను విద్యపై ఖర్చుచేస్తున్నాయి. ఆర్థికబలం, ఆవిష్కరణలు, సామాజిక స్థిరత్వానికి ప్రజా పెట్టుబడి కీలకమని అవి గుర్తించాయి. కానీ భారతదేశం విద్యకు తగిన పెట్టుబడి లేకుండా ప్రపంచ శక్తిగా మారాలనే ఆశయం బలహీనమైన పునాదిపై నిలబడి ఉంది. ఈ నిర్లక్ష్యం ప్రభావం నేల మీద ఇప్పటికే కనిపిస్తోంది. 2014-15లో 11,07,101 ఉన్న ప్రభుత్వ పాఠశాలలు 2023-24 నాటికి 10,17,660కు తగ్గాయి. గత దశాబ్దంలో 89,441 ప్రభుత్వ పాఠశాలలు మూసివేయబడ్డాయి. 'సమర్థత' పేరుతో తీసుకున్న నిర్ణయాలు గ్రామీణ, గిరిజన, అంచున ఉన్నవర్గాలపై తీవ్ర ప్రభావం చూపాయి. పిల్లలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. చదువు మానేయాల్సి వస్తోంది. పాఠశాలల మూసివేత లేదా విలీనం అనే సంక్షోభంపై బడ్జెట్ 2026 మౌనం వహిస్తుంది. బడ్జెట్ 2026లో అత్యంత పెద్దలోపం, భారీ స్థాయిలో ఉపాధ్యాయ నియామకాల లేమి. ప్రపంచంలో అతిపెద్ద విద్యా వ్యవస్థలలో ఒకటైన భారత్‌లో ఉపాధ్యాయుల కొరత తీవ్రమైంది. 33లక్షల మంది విద్యార్థులు ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న పాఠశాలల్లో చదువు తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో నేర్చుకునే నాణ్యత మెరుగ వుతుందని ఆశించడం వాస్తవాలకు విరుద్ధం. డిజిటల్ ప్లాట్ ఫామ్‌లు, పాఠ్యాంశాలలో మార్పులు లాంటి చర్యలు శిక్షణ పొందిన, భద్రతకల్గిన, తగిన వేతనం పొందే ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రత్యామ్నాయంకావు. ప్రభుత్వ విద్యాసంస్థలలో తగిన పెట్టుబడి లేకపోవడం వల్ల డ్రాప్ అవుట్‌లు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు 65.7 లక్షల మంది పిల్లలు పాఠశాల వ్యవస్థ నుంచి బయటకువచ్చారు. వీరిలోదాదాపు సగం మంది బాలికలే. ఇది పేదరికం, పాఠశాల మూసివేతలు, మాధ్యమిక పాఠశాలల కొరత, అసురక్షిత ప్రయాణం, ప్రజా మద్దతు లేకపోవటం వంటి అంశాలతో సంబంధం కలిగి ఉన్నాయి. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు బడ్జెట్



2026లో పునర్నమోదు, వారిని స్థిరంగా చేయడం నిలుపుదల, సామాజిక మద్దతుకు సమగ్ర వ్యూహం ఈ బడ్జెట్‌లో లేదు. ఈ బడ్జెట్ ప్రభుత్వ విద్యా సంస్థలను బలపరచడం బదులు, ఎన్ఈపికి అనుసంధానమైన అంశాలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది అకాడెమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఎబిసి), నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సిఆర్‌ఎఫ్), అపార్, పరఖ్, పిఎమ్ శ్రీ, దీక్ష వంటి పథకాలు. అదేవిధంగా పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్య (పిపిపి)మోడల్‌ను విద్యలో ముందుకు తీసుకువస్తోంది. ఇది సామర్థ్యం, ఆవిష్కరణ పేరుతో ప్రభుత్వ విద్యాసంస్థలను వాణిజ్యపరంగా మార్చి, ఖర్చును విద్యార్థులు, వారి కుటుంబాలపై మోపి, ప్రభుత్వ విద్యను ప్రైవేట్ లాభాలకు తలుపులు బార్లా తెరుస్తోంది. ఉన్నత విద్యలో అంతర్జాతీయీకరణ, పరిశ్రమ విద్యాసంస్థల భాగస్వామ్యం, వికసిత భారత్ శిక్షా అధిష్టాన్ (విబిఎస్ఎ)బిల్లుతో తీవ్రమైన కేంద్రీకరణ ద్వారా నియంత్రణ వ్యవస్థ ప్రతిపాదన ఇవన్నీ అధిక కేంద్రీకరణను, మార్కెట్ దృక్పథాన్ని సూచిస్తున్నాయి. ప్రజా పెట్టుబడికి బదులు నియంత్రణ పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజాస్వామ్య నియంత్రణను, సంస్థాగత స్వతంత్రతను బలహీనపరుస్తున్నాయి. అంతిమంగా చూస్తే, ప్రస్తుత విధానాల కింద రూపొందుతున్న విద్యా వ్యవస్థ అత్యంత సాధనోపయోగంగా ఉంది. ఇది కొద్దిమంది అత్యంత నైపుణ్యం గల ఎలైట్‌వర్గాన్ని తయారు చేయడమే కాకుండా, అస్థిర కార్మిక మార్కెట్‌కు సరిపోయే అర్ధనైపుణ్యం గల పెద్ద సంఖ్యలో కార్మికులను సృష్టిస్తోంది. అదేసమయంలో, అర్ధశిక్షణ పొందిన డ్రాప్ అవుట్‌ల పెద్దసమూహం ఏర్పడుతోంది. ఇది యాదృచ్ఛికం కాదు. దీర్ఘకాలిక తక్కువ పెట్టుబడి ప్రైవేటీకరణ ఫలితం. ఈ బడ్జెట్ పూర్తిగా అభివృద్ధి రహితమైనది. మైనారిటీలు, చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలపై ప్రత్యేక దృష్టిలేదు. ప్రవేశాలు నైపుణ్యం, నేర్చుకునే పద్ధతుల్లో ఉన్న అసమానతలను పట్టించుకోవడం లేదు. సామాజిక నిర్మాణాత్మక అసమానతలను పట్టించుకోకుండా జాతీయ విధానమని చెప్పుకోవడం ప్రజాస్వామ్యంగా చెప్పలేం. ఈ నిర్లక్ష్యం పాఠశాలలు, విశ్వవిద్యాలయాలకే పరిమితం కాదు. మధ్యాహ్న భోజన పథకం వంటి పునాది సంక్షేమ విద్యా వ్యవస్థలకూ విస్తరించింది. అంగన్‌వాడి పోషణ్ 2.0కు 2026-27లో కేటాయింపు రూ.23,100 కోట్లు మాత్రమే (గత సంవత్సరం రూ.21,960 కోట్లు). పోషకాహార ఖర్చు ప్రమాణాలు పెరుగుతాయని హామీ ఇచ్చినా, ఇది రోజుకు ఒక్కో పిల్లకు కేవలం 38 పైసల పెరుగుదల మాత్రమే. 3.38 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీరు లేదు, 4.61 లక్షలకు మరుగుదొడ్లు లేవు. గత నాలుగేళ్లలో కేవలం 60,000 కేంద్రాలే అభివృద్ధి చేయబడ్డాయి. ఇది బాల్యవిద్య, పోషణ పునాదినే దెబ్బతీస్తోంది. మొత్తంగా చూస్తే, బడ్జెట్ 2026 విద్యను సామాజిక హక్కుగా కాకుండా మార్కెట్ ఆధారిత సేవగా మార్చుతోంది. నైపుణ్యాలు, క్రెడిట్లు, ఉద్యోగయోగ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రజా పెట్టుబడి, ఉపాధ్యాయ నియామకాలు, సామాజిక రక్షణను పక్కన పెడుతోంది. ఇవన్నీ పేదరికం, ప్రాంతీయ అసమతుల్యత, లింగవివక్ష, రాష్ట్ర ఉపసంహారణ వల్ల ఏర్పడిన నిర్మాణాత్మక అసమానతలపై తాత్కాలికం మాత్రమే. దేశంలో ఉన్నత విద్యను అభివృద్ధి చేయకపోవడంతో విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, జార్జియా, చైనా, యు.కె. లాంటి దేశాలు వలసలుపోతున్నారు. దీని గురించి కనీస ప్రస్తావన బడ్జెట్లో లేదు. విద్యావేత్తలు, మేధావులు గత అనేక సంవత్సరాలు నుండి కోరుతున్నట్లు జి.డి.పి.లో 6 శాతం నిధులు కేటాయింపు కూడా లేదు. సంకుచితమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు, ఒక్క ఉపాధ్యాయుడే ఉన్న తరగతులు, భారీ డ్రాప్ అవుట్‌లు, వాణిజ్యీకరించిన సంస్థలు, పెరుగుతున్న సామాజిక విభేదాలపై అభివృద్ధి చెందిన భారత్ నిర్మించలేం. వికసిత భారత్ నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఉండాలంటే, ప్రజా విద్యను మళ్లీ సార్వత్రిక హక్కుగా గుర్తించి జాతీయ ప్రాధాన్యతగా పెట్టాలి. లేకపోతే, భారత వృద్ధి విస్తృతంగా కనిపించినా పునాదులు బలహీనంగానే ఉంటాయి. •

# ఆహార దుర్వినియోగాన్ని నివారించాలి

డాక్టర్. వై. సంజీవ కుమార్

మనిషి మనుగడకు ప్రాణవాయువు ఎంత అవసరమో, ఆహారం అంతే అవసరం. అలాంటి ఆహారాన్ని నిర్లక్ష్యంగా వృథా చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. నేడు ఆహారాన్ని వృధా చేసే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఒకవైపు ఆహారం చెత్తబుట్టల్లో పడిపోతుంటే, మరోవైపు ఒక్కపూట భోజనం కోసం ఆశగా ఎదురుచూస్తూ జీవిస్తున్న అభాగ్యులు ఎందరో ఉన్నారు. ఆకలి బాధ తాళలేక మరణించిన వాళ్లు ఎందరో ఉన్నారు. ఆకలి కేవలం శరీరబాధనే కాదు అంతరాత్మను క్షోభపెట్టె బాధ. ఆకలితో జీవించడం అత్యంత దుర్భరమైన అనుభవం. ఆకలిబాధను అనుభవించినవారికే ఆ కష్టం విలువ తెలుస్తుంది. అవసరానికి మించి ఆహారం వండటం, ఫంక్షన్లకు వెళ్లి ఆకలి లేకున్నా ఎక్కువగా తీసుకుని పూర్తిగా తినకుండా వదిలేయడం వంటి చర్యలు చిన్న తప్పుగా భావించవచ్చు. కానీ బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుంది. నేటి ఆధునిక పోకడల్లో మనిషి విలువలకన్నా ఆడంబరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. స్తోమతకు మించి శుభకార్యాలు చేయడం ఒక ఫ్యాషన్‌లా మారిపోయింది. వాళ్లు ఇలా చేసారు.. వీళ్లు అలా చేసారు అనే పోలికలతో, పోటీ భావనతో, గ్రాండ్‌గా చేయకపోతే ఎవ్వరో ఏదో అనుకుంటారు అనే విపరీత ధోరణిలతో చిన్న శుభకార్యమా.. పెద్ద శుభకార్యమా అనే తేడా లేకుండా అనేక రకాల వంటకాలు సిద్ధం చేస్తున్నారు. పది మంది తినే కార్యక్రమానికి ఇరవై రకాల వంటకాలు, వంద మంది తినే కార్యక్రమానికి ముప్పై రకాల వంటకాలను, మరికొందరి మరిన్ని ఎక్కువ రకాల వంటలను చేయి



స్తున్నారు. ఒక్కో వంటకం రుచి చూడటానికి తీసుకుని సగం సగం తిని మిగతాదంతా చెత్తబుట్టలో వేయడం ఇప్పుడొక సాధారణ దృశ్యంగా మారిపోయింది. ఆహారాన్ని వృధా చేస్తున్నాము అనేది తప్పు అని ఎవ్వరికి అనిపించడం లేదు. కానీ ఆ చెత్తబుట్టలో పడుతున్న ప్రతి గింజ వెనుక ఒక రైతు చెమట ఉంది. శుభకార్యం చేసే కుటుంబం కష్టం ఉంది. ఒక ఆకలితో ఉన్న మనిషి ఆశ ఉంది. పోటీ పడాల్సింది ఆడంబరాల్లో కాదు, మంచి పనుల్లో పడాలి. ఎవరి శుభకార్యం ఎంత గొప్పగా జరిగిందోకాకుండా, ఎంత మంచిగా నిర్వహించామా, ఎంతమందికి ఉపయోగపడిందో అనేదే అసలైన గొప్పతనం. మంచి మార్పులను ఎప్పటికప్పుడు మనిషి అలవాటు చేసుకోవాలి, ఆచరణలో కొనసాగాలి, ఆహారాన్ని వృధా చేయకపోవడం కూడా ఒక గొప్ప సంపాదనే. శుభకార్యాలు, ఇతర వేడుకలు నిర్వహిస్తున్నప్పుడు సమీపంలోని ఆశ్రమాలు, అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆహ్వానించి వారికిఆహారం అందిస్తే, వారి ఆకలిని తీర్చడమే కాకుండా ఒకఅపూర్వమైన సంతృప్తి, ఆనందం లభిస్తుంది. ఆహారంపట్ల అందరూబాధ్యతగా ప్రవర్తించే అలవాట్లు చేసుకుంటే, నేటిచిన్నారులు ఆ అలవాట్లను అనుసరిస్తారు, బాధ్యతతో కూడిన నడవడికతో ఆహారాన్ని దుర్వినియోగం చేయకూడదనే మంచి అలవాట్లను నేర్చుకుంటారు, దాని ద్వారా భవిష్యత్తులో వారు ఆహారాన్ని గౌరవించే, వృధాచేయని బాధ్యతాయుతమైన పౌరులుగా మారుతారు. ఆహారాన్ని గౌరవిద్దాం, ఆకలిని తగ్గిద్దాం. •

# ప్రజావాక్కు



### ప్రతిపక్షాల మధ్య సమన్వయం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో పార్లమెంటు అత్యున్నతమైన శాసనసభ. ప్రజల సమస్యలను చర్చించి, పరిష్కారమార్గాలను అన్వేషించాల్సిన ఈ వేదిక నేడు నిరంతర అంతరాయాలకు నిలయంగా మారుతోంది. అధికార, ప్రతిపక్షాల మధ్య సమన్వయం లోపించడం వల్ల పార్లమెంటు విలువైన సమయం వృథా అవుతోంది. దీనివల్ల దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే అనేక కీలకబిల్లులు ఆమోదం పొందకుండా పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. సభలో నిరసనలు తెలపడం ప్రతిపక్షాల హక్కు అయినప్పటికీ, అది సభా సమయాన్ని పూర్తిగా హరించేలా ఉండకూడదు. ప్రతి నిమిషం పార్లమెంటునిర్వహణకు ప్రజాధనంభారీగా వెచ్చించబడుతోంది. అధికార పక్షంప్రతిపక్షాల విమర్శలనుఓర్పుతో వినాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### రాఫెల్ కొనుగోళ్లు

ఫ్రాన్స్ నుండి రాఫెల్ యుద్ధవిమానాలు కొనుగోలు చేయడంకోసం3లక్షల కోట్లవిలువైన ఒప్పందం జరగడం గొప్ప పరిణామం అయితే ఇందులో ప్రత్యేకత ఏమిటి? స్వదేశీయంగానాగపూర్‌లోను, హైదరాబాద్‌లో రాఫెల్ విమానాల భాగాలు తయారు అవుతున్నాయి. ఇది స్వదేశీయంగా తయారు కావడమే కదా చారిత్రక నేపథ్యాల నుండి చుస్తే భారత రాజ్యాంగంలో స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంలాంటి గుణాలను మనంఫ్రాన్స్ నుండే తీసుకున్నాం. ఇప్పుడు భారత రక్షణ వ్యవస్థకు ఆయువు పట్టులాంటి రాఫెల్ విమానాన్ని అందించడం అందులో 18 ఫ్రాన్స్‌లో 96స్వదేశీయంగా తయారు కావడం ఆహ్వానించదగిన విషయం.

- భారత అవినాష్, జనగామ

### హామీలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వచ్చాక తప్పకనెరవేర్చాలి. ఎన్నికల సమయంలో మానిఫెస్టోనుఎన్నికల సంఘం నిర్ధారించాలి. హామీలు నెరవేర్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చని ప్రభుత్వం పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. అలాగే ప్రభుత్వం ఏర్పడ్డాక బడ్జెట్‌నిధులను ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలి.

- డి చాంద్ బాషా, కర్నూలు

### మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమ మేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటా విశ్లేషణ ఇలాంటి అనేకరంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుత వేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజ మేధస్సును భర్తీ చేయగలదనే అపోహ మరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలు వేగాన్ని, ఖచ్చితత్వాన్ని అందించగలిగినా, భావోద్వేగం, నైతికత, సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమమేధస్సు అతిపెద్దశక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు, పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాలవరకు అన్ని రంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది. వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించడం, ట్రాఫిక్ నియంత్రణ, లాజిస్టిక్స్‌లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులు ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

-కె.రామారావు, నల్గొండ జిల్లా

### నిబంధనలను పాటించాలి

వైద్యుల ప్రెస్క్రిప్షన్ చీటీలేకుండా మందులు కొనడం, అమ్మడం రెండూ నేరమేకానీ, తెలంగాణలో అన్నిజిల్లాల్లో మెడికల్ షాప్స్ ఈ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ధనార్జనే ధ్యేయంగాప్రజలఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్‌లేకుండానే మందులు అమ్మి సొమ్ము చేసుకొంటున్నారు. ఒక్కొక్క మందుల షాప్‌లో ఫార్మాసిస్ట్ లేదు. పర్యవేక్షణ లేదు. నిబంధనల ప్రకారం ప్రతి మందుల దుకాణంలో అర్హత పొందిన ఫార్మాసిస్ట్ తప్పనిసరిగా ఉండాలి. జీఎస్టీ, కంప్యూటరైజ్డ్ బిల్లులు ఇవ్వకపోవడంవంటి ఉల్లంఘనలు సర్వసాధారణం. మెడికల్‌షాప్స్ వారు విధిగా నిబంధనలు పాటించాలి.

-పి. జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

### అవినీతికి అంతం లేదా?

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి తారాస్థాయికి చేరింది. ప్రతిరోజు ఏదో ఒకప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారుతుంది. సుమారు 1000 మంది అధికారులు ఏసీబీకి చిక్కారు. లంచం లేనిదే కార్యాలయాల్లో ఫైలు కదలని పరిస్థితి ఉంది. ఏసీబీ అధికారులు ఎన్ని దాడులు చేసిన లంచగొండి అధికారుల ప్రవర్తనలో మార్పుడం రావడంలేదు. ఏసీబీ అధికారులు మరిన్ని దాడులు చేసి లంచగొండిల భరతం పట్టాలి.


-సి. సతీష్, భూపాలపల్లి జిల్లా

# ఏఐ పునాదులు బలపడితేనే దేశ భవిష్యత్తు!

ముద్దం నరసింహస్వామి

ప్రతి దేశంలో కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తూ జనజీవనాన్ని ప్రభావితం చేస్తోంది. జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్, ఆరోగ్య సంరక్షణ, వ్యాధి నిర్ధారణ, రిటైల్, ఫైనాన్స్, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో ఏఐ విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. అయితే ఈ వేగంలో భారత్ క్రియాశీలంగా ఉన్నప్పటికీ, గ్లోబల్ పోటీలో ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేకపోతోంది. పెట్టుబడుల కొరత, మౌలిక వసతుల లేమి, నిపుణ మానవ వనరుల లోపం వంటి అంశాలు దేశీయ ఏఐ వృద్ధికి ప్రధాన అడ్డంకులుగా మారుతున్నాయి. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన తాజా ఏఐ నివేదిక ప్రకారం, 2013-2024 మధ్య కాలంలో కృత్రిమ మేధ రంగంలో అమెరికా సుమారు 47 వేల కోట్ల డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించగా, చైనా దాదాపు 12వేల కోట్ల డాలర్లు సమీకరించింది. అదే సమయంలో భారత్ కేవలం 1,100కోట్ల డాలర్ల పెట్టుబడులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఇది ప్రపంచంలో డేటా ఉత్పత్తిలో భారత్ వాటా సుమారు 20 శాతం ఉన్నప్పటికీ, డేటా నిల్వ సామర్థ్యం కేవలం 3శాతానికి పరిమితమవుతుండటం గమనార్హం. ఈ అసమతుల్యత ఏఐ ఆధారిత పరిశోధనలు, ఉత్పత్తుల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏఐ మోడళ్ల శిక్షణకు కీలకమైన జీపీయూల అందుబాటులో లేకపోవడం భారత్‌కు పెద్ద సమస్యగా మారింది. తాజా ఆర్థిక సర్వే కూడా ఇదే అంశంపై హెచ్చరించింది. జీపీయూల కొరత కారణంగా పరిశోధనల వేగం మందగించడం, ఖర్చులు పెరగడం జరుగుతోంది. మరోవైపు, సెమీ కండక్టర్ చిప్‌ల కోసం విదేశాలపై ఆధారపడటం దేశీయ ఏఐ ఎకోసిస్టమ్‌ను మరింత బలహీనపరుస్తోంది. దేశీయంగా నిధులు, మౌలిక వసతులు, మార్కెట్ యాక్సెస్ సరిగా లభించకపోవడంతో భారతీయ ఏఐ స్టార్టప్‌లు అమెరికా వైపు చూస్తున్నాయి. వందకు పైగా ఏఐ సంస్థలు ఇప్పటికే యూఎస్‌కు తరలివెళ్లడం లేదా అక్కడ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ప్రయత్నించడం భారత్‌కు హెచ్చరికగా భావించాలి. ఇది బ్రెయిన్ డ్రెయిన్ మాత్రమే కాదు, ఇన్నోవేషన్ డ్రెయిన్ కూడా. అంచనాల ప్రకారం, వచ్చే ఏడాది కల్లా భారత్‌లో ఏఐ రంగంలో 23 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఉన్నత విద్య వ్యవస్థను తక్షణమే సంస్కరించుకోకపోతే, దాదాపు 10 లక్షల ఏఐఉద్యోగాలు నిపుణుల లేమితో ఖాళీగానే మిగిలి

కోర్సులు కొద్ది అగ్రశ్రేణి విద్యాసంస్థలకే పరిమితమయ్యాయి. అధిక శాతం ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలల్లో ఏఐ విభాగాలు, ప్రాక్టికల్ ఓరియెంటెడ్ పాఠ్యప్రణాళికలు లేవు. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఆధునిక మౌలిక వసతులనువేగంగా అభివృద్ధి చేయడం అత్యవసరం. ఏఐ మిషన్ కింద భారీ స్థాయిలో జీపీయూలను అందుబాటులోకి తీసుకురావాలి. విశాఖపట్నంలో ఏఐ హబ్, డేటా సెంటర్, అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు వంటి ప్రణాళికలు మౌలిక




వసతుల పరంగా సానుకూల సంకేతాలే. అయితే ఇవి కేవలం ప్రారంభ దశకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించాలి. తాజా అంతర్జాతీయ అధ్యయనాలు సూచిస్తున్న మరో కీలక అంశం స్వదేశీ ఏఐ మోడళ్ల అభివృద్ధి. విదేశీ మోడళ్లపై ఆధారపడటం డేటా భద్రత, వ్యయభారం, వ్యూహాత్మక స్వతంత్రతపై ప్రభావం చూపుతుంది. కాబట్టి ఇండియా తన భాషలు, అవసరాలు, సామాజిక వాస్తవాలకు అనుగుణంగా సొంత లాంగ్వేజ్ మోడళ్లు, అప్లికేషన్లు అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కేవలం టెక్నాలజీ రంగానికే పరిమితం కాకుండా, దేశాల ఆర్థిక భద్రత, జాతీయ భద్రత, సామాజిక సమానత్వానికి కేంద్ర బిందువుగా మారుతోంది. అమెరికా, చైనా వంటి దేశాలు ఏఐని స్ట్రాటజిక్ నేషనల్ అసెట్‌గా పరిగణిస్తూ భారీ ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులతో ముందుకెళ్తున్నాయి. భారత్ కూడా ఈమార్గంలో అడుగులు వేస్తున్నప్పటికీ, అవి ఇంకా చెల్లాచెదురుగా ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్టాన్‌ఫర్డ్ ఏఐ ఇండెక్స్ రిపోర్ట్ ప్రకారం, అమెరికాలో మొత్తం ఏఐ పెట్టుబడుల్లో ప్రభుత్వ వాటా 30 శాతం దాటింది. చైనాలో అయితే ఇది ఇంకా ఎక్కువ. భారత్‌లో మాత్రం ఏఐ పెట్టుబడులు ఎక్కువగా ప్రైవేట్ రంగానికే పరిమితమవుతున్నాయి. దీని ఫలితంగా దీర్ఘకాలిక పరిశోధనలు, ఫౌండేషన్ మోడళ్ల అభివృద్ధి వంటి ఖరీదైన కార్యక్రమాలకు అవసరమైన స్థిర నిధులు అందడం లేదు. ప్రభుత్వం ముందుగా తీసుకోవాల్సిన కీలక నిర్ణయం జాతీయ ఏఐ ఫండింగ్ మోడల్. రక్షణ, అంతరిక్ష రంగాల మాదిరిగానే ఏఐకూ ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలి. ఏఐ పరిశోధనల కోసం ఐఐటీలు, ఐఐఎస్సీ, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నేషనల్ ఏఐ ల్యాబ్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇవి కేవలం అకడమిక్ పరిశోధనకే కాకుండా, స్టార్టప్‌లకు ఓపెన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా పనిచేయాలి. మరో కీలక అంశం డేటా పాలసీ. ప్రపంచ డేటాలో ఐదవ వంతు భారత్‌నుంచి ఉత్పత్తి అవుతున్నప్పటికీ, ఆ డేటా ఆధారంగా విలువ సృష్టించుకుంటున్నవి ఎక్కువగా విదేశీ సంస్థలే. దేశీయంగా సురక్షితమైన డేటా షేరింగ్ ఫ్రేమ్‌వర్క్, పబ్లిక్ డేటా రిపోజిటరీలు ఏర్పాటు చేస్తే హెల్త్‌టెక్, అగ్రిటెక్, ఎడ్యుటెక్ రంగాల్లో దేశీయ ఏఐ మోడళ్ల అభివృద్ధికి ఊతంలభిస్తుంది. విద్యారంగంలో సంస్కరణలు మరింత అత్యవసరం. ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌ను ఎలక్టివ్‌లుగా కాకుండా కోర్ సబ్జెక్టులుగా ప్రవేశపెట్టాలి. పరిశ్రమలతో కలిసి లైవ్ ప్రాజెక్ట్స్, అప్రెంటిస్‌షిప్స్ తప్పనిసరి చేస్తేనే నైపుణ్యలోపం తగ్గుతుంది. ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం, సరైన స్కిల్ అప్‌గ్రేడేషన్ జరిగితే భారత్ ఏఐ ద్వారా జీడీపీకి అదనంగా 7-8 శాతం వృద్ధిని సాధించగలదు. చివరగా, ప్రవాస భారతీయ ఏఐ నిపుణులను తిరిగి రప్పించేలా ప్రత్యేక ప్రోత్సాహక విధానాలు అవసరం. పన్నురాయితీలు, రీసెర్చ్ గ్రాంట్లు, స్టార్టప్ ఫ్రీడమ్ కల్పిస్తే భారత్ బ్రెయిన్ డ్రెయిన్‌ను బ్రెయిన్ గెయిన్‌గా మార్చగలదు. ఏఐ యుగంలో వెనుకబడితే, అది కేవలం ఒక టెక్నాలజీ లోటు కాదు భవిష్యత్ అవకాశాల కోల్పోవడమే. కాబట్టి ఇప్పుడే సమగ్ర జాతీయ వ్యూహంతో ముందుకెళ్లాల్సిన సమయం వచ్చింది. ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, బలమైన మౌలికవసతులు, సమగ్ర విద్యా సంస్కరణలు, పరిశోధనలకు ప్రోత్సాహం కలిసొస్తే ఏఐ పందెంలో అగ్రదేశాలకు దీటుగా భారత్ దూసుకుపోవడం అసాధ్యం కాదు. ఇప్పుడే పునాదులు బలపరచుకోకపోతే, రేపటి అవకాశాలు విదేశాలకే జారిపోతాయన్న సత్యాన్ని విధాన నిర్ణయకర్తలు గ్రహించాల్సిన సమయం ఇదే. •

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

ong-5_ong-5.qxd 2/12/2026 10:42 PM Page 1



ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏపీఎస్ఆర్టీసీ ప్రకాశం మార్కాపురం రీజియన్‌లోని అన్ని డిపోల నుండి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ప్రజా రవాణా వ్యవస్థ అధికారి జె. సత్యనారాయణ తెలిపారు. రీజియన్ కార్యాలయం నందు గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రత్యేక బస్సుల యొక్క వివరాలను వెల్లడించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఏడు డిపోల నుంచి శ్రీశైలం, కోటప్పకొండ, మొగిలిచర్ల, భైరవకోన క్షేత్రాలకు బస్సులను నడపనున్నట్లు ఆయన తెలియజేశారు. శ్రీశైలం కు 140 బస్సులు, కోటప్పకొండకు 78 బస్సులు, మొగిలిచర్లకు 25 బస్సులు, భైరవకోనకు 25 బస్సులు, త్రిపురాంతకం కు 25 ప్రత్యేక బస్సులను నడపడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన స్త్రీ శక్తి పథకాన్ని ప్రత్యేక బస్సుల్లో కూడా అమలు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.పాకాల బీచ్ నందు ప్రభుత్వం నిర్వహిస్తున్న బీచ్ ఫెస్టివల్ కు అద్దంకి,ఒంగోలు,కందుకూరు, పొదిలి,కనిగిరి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక బస్సులను 14,15 తేదీల్లో నడపడం జరుగుతుందని రీజియన్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు.

## జిల్లాలో ఐరన్ ఓర్ త్రవ్వకాలకు జిందాల్ సంస్థకు భూ కేటాయింపుపై సర్వే చేపట్టాలి

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



జిల్లాలో ఐరన్ ఓర్ తవ్వకాలకు జిందాల్ సంస్థకు భూములు కేటాయించడానికి సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్ లో జిందాల్ సంస్థకు ఐరన్ ఓర్ తవ్వకాలకు భూము ల కేటాయింపుపై జిల్లా కలెక్టర్ జిందాల్ సంస్థ ప్రతినిధులు, అధికారులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వలేటివారిపాలెం మరియు లింగసముద్రం మండలాలలో జిందాల్ సంస్థ ఐరన్ ఓర్ త్రవ్వకాలకు ప్రభుత్వం అనుమ తులు మంజూరు చేసినది ఆయన చెప్పారు. ఐరన్ ఓర్ త్రవ్వకాలకు వలేటి వారిపాలెం మండలం మరియు లింగసము ద్రం మండలాలలో 5000 ఎకరాల భూములు కావసి ఉందని ఆయిన చెప్పారు. అద్దంకివారిపాలెం మరియు లక్ష్మక్కపల్లి గ్రామాలలో 1340 హెక్టార్లలో అటవీ భూములు ఉన్నాయ ని వాటినిమార్పిడి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధి కారులకు చెప్పారు. ఐరన్ ఓర్ బ్లాక్స్ వద్ద మొక్కలు నాటడానికి మరో 1500 ఎకరాలు భూములు అవసరం అని చెప్పారు. ఈ సమావేశంలో గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి వినోద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇ.ఇ విజయ మోహన్, జిందాల్ సంస్థ ప్రతి నిధులు కిరణ్, లింగసముద్రం తాసిల్దార్ హుస్సేన్, వలేటివారిపాలెం తాసిల్దార్ హనుమా యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో సత్య సాయి జ్యోతి యాత్ర

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




సత్యసాయి బాబా వారి 100 వ పుట్టినరోజు సందర్భంగా మన రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ పుట్టపర్తిలో జ్యోతిని వెలిగించి భారతదేశపు యాత్రగా జ్యోతిని పంపించినారు భారతదేశం అంతా పర్యటించిన జ్యోతి 12 గురువారం ఉదయం10 గంటలకు ఒంగోలు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి మందిరంలో జ్యోతి కార్యక్రమం నిర్వహించి అనంతరం బాబా భక్తులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీ కార్యక్రమాన్ని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత చేతుల మీదుగా ప్రారంభించారు నగరంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు జిల్లా అధ్యక్షులు టి రామిరెడ్డి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు సిద్ధ వెంకట సాయిబాబు పి చంద్రశేఖర్ రెడ్డి ఎంవిఆర్‌కె ప్రసాద్ పి సాయి కృష్ణ కృష్ణ గీత రాజేశ్వరి పుష్పలత బాల పద్మావతి విద్యార్థులు మంగమూరు రోడ్ లోని మందిరానికి చేరుకొని బాబా వారికి ప్రత్యేక హారతులు ఇచ్చిన అనంతరం జ్యోతిని నెల్లూరు జిల్లా వారికి అప్పగించారు స్వామి వారి ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె

**ఉలవపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**




కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సీఐటీయూ ఉలవపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. తాసిల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులు,కార్మికులు,రైతులు వ్యవసాయకూలీలు ఎవరూ సుభిక్షంగా లేరని అన్నారు.ఈ ప్రభుత్వం కార్పొరేట్ల మెప్పుకోసం 4లేబర్ కోడ్ లను తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కరేడు ప్రాంతంలో భూసేకరణ పేరుతో 3పంటలు పండే భూములను ఇండోసోల్ వంటి కార్పోరేట్లకు దోచిపెడుతుందన్నారు.ఉపాధి హామీపథకాన్ని నిర్వీర్యంచేసి కూలీల పొట్టకొట్టే చర్యలకు పూనుకుంటున్నారని విమర్శించారు. అంగన్వాడీలకు, ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. సిపిఎం నాయకులు కుంచాల అనిల్ కుమార్ మాట్లాడుతూ కార్మికులు చేసే న్యాయమైన సమ్మెకు సిపిఎం తరపున తమ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వినాయకుడి గుడి వరకు ర్యాలీగా వెళ్ళి మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఆదేల సత్యనారాయణ, ఆటో వర్కర్స్ నాయకులు ఎస్.డి జహీర్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ఉలవపాడు ప్రాజెక్టు లీడర్ సిహెచ్.ఇందిరావతి, సిఐటియు మండల సహాయ కార్యదర్శి నాళం.శ్రీదేవి, సిఐటియు మండల నాయకులు జి. ప్రసన్నకుమార్,పిటిపి స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు సవరం.శ్రీనువాసులు,గంజి.శ్రీనివాసులు,కోశాధికారి చిలకా.శ్రీనువాసులు,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీ రాజు.శాంతి, మస్తానమ్మ, పంచాయతీ వర్కర్స్ నాయకురాలు కామాక్షమ్మ, వ్యవసాయకార్మిక సంఘం మండల నాయకులు జువ్విగుంట.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెతో మూతబడ్డ ప్రభుత్వ కార్యాలయాలు

**కొండపి, ప్రభాతవార్త**




లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం ఉద్యోగ భద్రతకై దేశవ్యాప్తంగా, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మె కారణంగా గురువారం కొండేపి మండలంలో బ్యాంకులు ప్రభుత్వ కార్యాలయాలు, పోస్ట్ ఆఫీస్, కాలేజీ, హైస్కూలు,ఎలిమెంటరీ స్కూలు ప్రభుత్వ ఆఫీసులను, స్వచ్ఛందంగా మూత వేయడం జరిగింది . జండా చెట్టు సెంటర్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు, ర్యాలీ నిర్వహించారు అనంతరం నిరసన కార్యక్రమం తాసిల్దార్ కార్యాలయం వద్ద జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేజీ మస్తాన్ మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాలు కాలం పాటు ఉపాధి హామీ పథకం జయప్రదంగా జరుగుతున్నటువంటి సందర్భంలో కేంద్రంలో ఉన్న,బిజెపి ప్రభుత్వం వి బి జి రామ్ జి గ్యారెంటీ రోజువారి స్కీమ్ తీసుకు, వచ్చి నిధులకు కోత పెట్టిందని విమర్శించారు, అంగనవాడి, మహిళా సమైక్య జిల్లా నాయకులుళి లక్ష్మి మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఫిక్స్డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ప్రవేశపెట్టరాదని, అన్నారు అన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వై కృష్ణారావు ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధం ఆపాలని అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాన్ని పునర్నిర్మాణం చేయాలని ఆయన డిమాండ్, చేశారు, చేయడం జరిగింది, పేదలను నిరుపేదలుగా మార్చే విధానాన్ని అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని కోలదయాలని రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సంక్షోభ నివారణకు వివిధ పథకాలు ఏర్పాటు చేసి ప్రజలు ఆదుకోవాలని సిపిఐ కొండపి మండల నాయకులు ఆర్ లక్ష్మి డిమాండ్ చేశారు ,

## బియ్యం గోడౌన్ ను తనిఖీ చేసిన జెసి

**చీమకుర్తి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



చీమకుర్తిలో లోని ఎల్ ఎం ఎస్ గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి గురువారంతనిఖీ చేశారు. స్థానిక ఎం. ఎల్.ఎస్. పాయింటులోని సరుకులను పరిశీలించి, వాటి నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఇక్కడి నుంచి ఐదు మండలాల పరిధిలోని 170 రేషన్ దుకాణాలకు సరుకులు సరఫరా అవుతాయని అధికారులు ఆమెకు వివరించారు. రికార్డుల నిర్వహణ నిబంధనల మేరకు ఉండాలని, ఈ కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంట పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మీ, స్థానిక అధికారులు ఉన్నారు.

## కల్తీ చేసిన వారిని ఆ వెంకటేశ్వరుడే శిక్షిస్తాడు

**ఒంగోలు, ప్రభాతవార్త**



తిరుమల కల్తీలడ్డు వివాదంపై మాజీ మంత్రి,జనసేన నాయకుల్ బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందిం చారు. ఒంగోలు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమల లడ్డును అపవిత్రం చేస్తూ కల్తీకి పాల్పడిన వారిని వెంకటేశ్వర స్వామి శిక్షిస్తాడన్నారు. హిందూ ప్రజలు ఇష్టంగా బావించే పవిత్రమైన తిరుమల లడ్డుపై దయచేసి ఆరోపణలు చేయవద్దు అని ఆయన విజ్ఞప్తి చేశారు. జనసేనలో మీకు ఎటువంటి పదవి రాబోతుందని విలేకరులు అడిగిన ప్రశ్నకు బాలినేని బదులిస్తూ తనకు పదవి కావాలని ఇప్పటివరకు పవన్ కల్యాణ్‌ను తాను అడగలేదు అని పవన్ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానని బాలినేని అన్నారు. ఒంగోలు వచ్చిన ఆయనను పలువురు జనసేన కార్పొరేటర్లు, పార్టీ నాయకులు కలిశారు.

# జిల్లాలో సార్వత్రిక సమ్మె విజయవంతం

**ఒంగోలు, ప్రభాతవార్త**



భారతదేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నేడు జరిగిన జాతీయ సార్వత్రిక సమ్మెకు అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మద్దతు మేరకు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం మేరకు ఏపీఎన్ జీజీఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కే.శరత్‌బాబు కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ప్రకాశం భవనం ఎదుట ఎన్జీవోలతో భోజన విరామ సమయం నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సంద ర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్ హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల హక్కులు కాలరాస్తు న్నాయని ప్రధానంగా కార్మికుల హక్కులను అణగదొక్కుతున్నాయని ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అధ్యక్షులు కే.శరత్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలల కాలం అవుతుంది. కానీ ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన పీఆర్సీ, డీఏలు, జీవో 57ను ఇంప్లిమెంట్ చేయడంలో మీనమేశాలు లెక్క పెడుతుందని, సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా 33 సంవత్సరాల సర్వీసు ఉంటే పదవీ విరమణ చేస్తారు అనే ప్రచారం ఎక్కువగా జరుగుతుందని ప్రభుత్వం అటు వంటి చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీని వెంటనే నియమించాలని, డీఏలను మంజూరు చేయాలని, ముఖ్యంగా సరెండర్ లీవ్‌లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఒంగలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మం జేశ్, కార్యదర్శి షేక్ మగ్దుమ్ షరీఫ్, జిల్లా కోశాధికారి కే.శివకు మార్, రాష్ట్ర మహిళా విభాగం కన్వీనర్ పి.మాధవి, జిల్లా చైర్ పర్సన్ కే.కోటేశ్వరమ్మ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి (జలవనరుల శాఖ) బి.కృష్ణ కిషోర్, ఉపాధ్యక్షులు స్టేట్ ఆడిట్ శాఖ) బి.ఏడుకొండలు, ఉపాధ్యక్షులు( వైద్యఆరోగ్యశాఖ) పి.రామాంజ నేయులు, బి.విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు (పశుసంవర్ధకశాఖ) ఆర్ దీపక్ కుమార్, సంయుక్త కార్యదర్శి(వెల్ఫేర్ శాఖ) డి.మధుసూదన్‌రెడ్డి, ఖజానా శాఖ అధ్యక్ష కార్యదర్శులు పీవీ కృష్ణ, పి.అంకబాబు, స్టేట్ కమర్షియల్ టాక్స్ డిపార్ట మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుధాకరరావు, ఎడ్యుకేషన్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు కే.లక్ష్మీ రాజ్యం, మాతా శిశు సంక్షేమ శాఖ నాయకులు శివ ప్రసాద్, సహకార శాఖ నాయకులు సాయి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు విష్ణు, ఫారెస్టు డిపార్టమెంట్ నాయకులు రాంబాబు, దేవాదాయ శాఖ నాయకులు కట్టా సునీల్, ఒంగోలు పట్టణ సహాధ్యక్షులు పి.వీరయ్య, ఉపాధ్యక్షులు డి.అంకబాబు, బి.రామకృష్ణారెడ్డి, ఎస్.నారాయ ణమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ కరిముల్లా, సంయుక్త కార్యదర్శులు పి.రవికుమార్, ఎస్‌కే జిలానీ, పి.వెంకటేశ్వర్లు, జి.లక్ష్మణ్, ఆర్.వందనా సామ్యూల్, జిల్లా కార్యవర్గ సభ్యులు షాలోమ్ రాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తెల్లమేకల శ్రీనివాసరావు, సుజాత, మహిళా విభాగం నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేపై శిక్షణా కార్యక్రమం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధి లో స్వచ్ఛ సర్వేక్షణ సర్వేకు సంబంధించిన ఒకరోజు సామర్థ్య వికాస శిక్షణ కార్యక్రమం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విడుదల చేసిన మార్గదర్శకాలు, సూచనల మేరకు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వ్యవహరించి శిక్షణ అందించింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా జయ మాధురిమ యెండ్లూరి పాల్గొని, స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాయాలు, అమలు విధానం, ఫీల్డ్ స్థాయి డేటా సేకరణ, పౌర భాగస్వామ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, శుభ్రత ప్రమాణాలు మరియు సర్వేలో అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ప్రాక్టికల్ అంశాలు, ఫీల్డ్ అమలు చర్యలు, నివేదికల సమర్పణ విధానం గురించి వివరించారు.ఒంగోలు కమిషనర్ డా. కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ సర్వేను విజయవంతం చేయడానికి ప్రతి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, పట్టణాన్ని శుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉండాలని వారు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ఈ సంవత్సరం మన ఒంగోలు నగరం మంచి ర్యాంక్ సాధించటానికి ప్రతి ఒక్కరూ కూడా పనిచేద్దాము అని పిలుపునిచ్చారు.ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో అవగాహన పెరిగి, స్వచ్ఛ సర్వేక్షణలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు దోహదపడు తుందని నిర్వాహకులు తెలిపారు. డా. ఎం. వైష్ణవి, ఎస్.ఎస్. ఎన్. పిచ్చయ్య కూడా కార్యక్రమంలో మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం, వ్యర్థాల వేరు చేయడం మరియు ఆరోగ్య పరిరక్షణ అంశాలలో సిబ్బంది చురుకుగా పనిచేయాలని సూచించారు. శిక్షణలో పొందిన మార్గదర్శకాలను ఫీల్డ్‌స్థాయిలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేమకుర్తి కమీషనర్ రామకృష్ణ, వైష్ణవి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

## దోర్నాల నుండి శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం లేకుండా సమగ్ర చర్యలు: ఎస్పీ

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, దోర్నాల నుండి శ్రీశైలం వరకు ఉన్న ఘాట్ రోడ్డులో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు, హైవే పేట్రోలింగ్ వాహనాలు, టోయింగ్ వెహికల్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.భద్రతా చర్యలు మరియు ట్రాఫిక్ నియంత్రణ కొరకు ఘాట్రోడ్లో అనుభవం ఉన్న డ్రైవర్ల మాత్రమే వాహనం నడపాలని రోడ్డుకు ఇరువైపులా వాహనం నిలిపి ట్రాఫిక్కు ఆటంకం కలిగించకుండా ఉండాలన్నారు డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయబడిందని రద్దీ సమయాల్లో అదనపు పోలీస్ సిబ్బందిని మోహరించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామన్నారు భారీ వాహనాల రాకపోకలు నియంత్రించి వాటికి నిర్దిష్ట సమయాలు కేటాయించబడతాయని పేర్కొన్నారు ప్రమాదాలు నివారించేందుకు హెచ్చరిక బోర్డులు సూచికలు రిప్లై ఏర్పాటు చేయడం జరిగిందని ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు అలాగే ప్రయాణికులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలి. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని మహాశివరాత్రి వేడుకలను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## పాకల బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు పూర్తి

- కుటుంబ సమేతంగా హాజరుకావాలి - కలెక్టర్ పి. రాజాబాబు

**సింగరాయకొండ, ఫిబ్రవరి 12, ప్రభాత వార్త**



పాకల బీచ్‌లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు అవసర మైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. గురువారం బీచ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 14, 15 తేదీలలో రెండు రోజులపాటు ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలందరూ కుటుంబ సమేతంగా హాజరై వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, 15వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఫెస్టివల్‌లో హెలికాప్టర్ రైడింగ్, ఫుడ్ కోర్టులు, ఎగ్జిబిషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణలుగా ఉంటాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, స్పెషల్ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణ, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పాకల బీచ్‌లో సందడి మొదలైంది..

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఈనెల 14, 15వ తేదీలలో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ లో భాగంగా గురువారం ఇక్కడ యోగాసనాల కార్యక్రమం జరిగింది. స్టెప్, ఆయుష్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఈ యోగాసనాల కార్యక్రమంలో రాష్ట్ర మ్యారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, డిఆర్ఓ బి.చిన ఓబులేసు పాల్గొన్నారు. దాదాపు 400 మంది విద్యార్థులు, స్థానికులు యోగాసనాలు వేశారు. పతంజలి యోగ కేంద్రం శిక్షకులు బాలసుబ్రమణ్యం పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగింది. బీచ్ ఫెస్టివల్ లో కూడా ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని అతిథులు పిలుపునిచ్చారు. స్టెప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తాం: సిఐటియు

**కొత్తపట్నం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**




దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా కొత్తపట్నం మండ లంలో సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తాసిల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ కార్యక్రమం జరిగింది బస్టాండ్ సెంటర్లో మానవహార కార్యక్రమం నిర్వహించటం జరిగింది ఈ సందర్భంగా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పోరోట్ల ప్రయోజనాల కోసం కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెస్తూ గజిట్ విడుదల చేసింది దీనితో శతాబ్ద కాలముగా కార్మిక వర్గం ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలనే రద్దయి కట్టు బానిసలుగా మారుతారు మరోవైపు రైతాంగం, వ్యవసాయ కార్మిక, దేశ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం విద్యుత్, రవాణా, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలిగ్రామ్, స్టీలు, పోర్టులు, ఎయిర్ లైన్స్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కరణ చేస్తున్నది ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ చేతుల్లోనికి వెళితే ఆర్థికంగా అసమానతలు మరింత పెరుగుతాయని అన్నారు రాబోయే రోజుల్లో ఈ విధానాన్ని తిప్పుకొట్టటానికి కార్మికులు కర్షకులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని అన్నారు సిఐటియు మండల కార్యదర్శి ఎస్ సోమిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని పీకనొక్కి 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయింపు తగ్గించి గాంధీ పేరుతో ఉన్న పేదలకు అనుకూలమైన చట్టాన్ని ఒక్కసారి తొలగిస్తే ప్రజలు తిరగబడతారని 125 రోజులు పెంచాము ఇది చాలా మంచి చట్టమని కేంద్రం నమ్మింప చేస్తున్నది అంతేకాదు మహాత్మా గాంధీ పేరును తొలగించి ఆయన్ను హత్య చేసిన గాడ్సే పేరు వచ్చేలా జి రామ్ జి పేరు పెట్టారు గాంధీని నాడు ఆర్ఎస్ఎస్ గాడ్సే హత్య చేస్తే అతను వారసులు నేడు గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని సమాధి చేశారని ఏడాదికి 200 రోజుల పని కనిపించాలని, రోజు వేతనం 600 రుఇవ్వాలని కార్మికులు కనీస వేతన చట్టం అమలు పరచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని రాబోయే రోజుల్లో కార్మికులు, కర్షకులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సోమరాజులు, నిర్మల, వెంకాయమ్మ, నాగమల్లేశ్వరి, భూలక్ష్మి, మరియమ్మ, ప్రకాశం, శ్రీను మొదలవారి పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వినతి

**వేటపాలెం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**




వేటపాలెం మండల పరిధిలోని కార్మికులు తమకు సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలను సందర్శించారు. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం, వారు ఎంతో కాలంగా పని చేస్తున్నప్పటికి జీతాలు, ఇతర హక్కుల విషయంల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల తరుపున న్యూ ఏఐఎఫ్‌టీయు సంఘం నాయకులు మాట్లాడుతూ మొత్తం సుమారు 44 మంది కార్మికులు ఈ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. కార్మికులకు రావాల్సిన వేతనాలు, చట్టపరమైన సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ విషయంపై సంబంధిత శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై కార్మిక ప్రతినిధి పి.భీమారావు సంతకం చేశారు.

6_6.qxd 2/13/2026 12:10 AM Page 1



### మద్దులూరులో యుపీఎస్ సర్వేను పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం మద్దులూరులో గురువారం నాడు జరుగుతున్న యుపీఎస్ సర్వేను డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్ ఆఫీసర్) పి.రవికుమార్ పరిశీలించారు. శానిటేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ పై ఆయన ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరు ఇళ్ల పన్నులను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి పాటుపడాలని డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్ గ్రామస్తులను కోరారు. మద్దులూరు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



ప్రముఖ శైవ క్షేత్రాలకు, పాకల బీచ్ ఫెస్టివల్ కొరకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ప్రకాశం, మార్కాపురం జిల్లాల రీజనల్ మేనేజర్ జి. సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి పండుగ సందర్భంగా శ్రీశైలం, కోటప్పకొండ, భైరవకోన, మొగిలిచెర్ల, సంగమేశ్వరం, పునుగోడు, త్రిపురాంతకం, రామతీర్థం మొదలగు ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రకాశం, మార్కాపురం జిల్లాలలోని 7 డిపోల నుండి గత సంవత్సర చార్జిలతో ప్రత్యేక సర్వీసులు నడుపుటకు ప్రణాళిక సిద్ధం చేయటమైంది. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలానికి 140, కోటప్ప కొండకు 78, మొగిలిచర్లకు 25, భైరవకోనకు 23, త్రిపురాంతకం 12, రామతీర్థం 8, సంగమేశ్వరం 5, పునుగోడుకు 2 ప్రత్యేక బస్సులు నడుపబడును. ఈ సంవత్సరం ప్రత్యేకంగా కనిగిరి, గిద్దలూరు నుండి నేరుగా శ్రీశైలానికి, పొదిలి, దర్శి నుండి కోటప్పకొండకు, పొదిలి, కనిగిరి నుండి మార్కాపురం జిల్లా త్రిపురాంతకానికి ప్రత్యేక బస్సులు నడుపబడుచున్నాయి. స్త్రీ శక్తి పథకాన్ని దృష్టిలో పెట్టుకుని గత సంవత్సరం కంటే అదనంగా 50కి పైగా బస్సులు నడుపుటకు ప్రణాళిక సిద్ధం చేయటమైంది. కావున శైవ భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఆర్టీసీని ఆదరించాల్సిందిగా విజ్ఞప్తి. అంతే కాకుండా ఉమ్మడి ప్రకాశం, మార్కాపురం జిల్లాల యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పాకల బీచ్ ఫెస్టివల్ కొరకు ప్రత్యేకంగా 12 బస్సులు(కందుకూరు-4, కనిగిరి-2, అద్దంకి-2, ఒంగోలు-2) నడుపుటకు నిర్ణయించటమైంది. రద్దీకి అనుగుణంగా మరిన్ని అదనపు సర్వీసులు నడుపుటకు చర్యలు తీసుకోబడ్డాయని తెలియజేశారు.

### నిరుద్యోగ మహిళలకు ఉచిత కంప్యూటర్ కోర్స్ శిక్షణ తరగతులు

**సంతనూతలపాడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండల పరిధిలోని ఎండ్లూరు డొంక వద్ద గల జిల్లా మహిళ ప్రాంగణంలో నిరుద్యోగ మహిళలకు ఉచితంగా కంప్యూటర్ కోర్సు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మహిళ ప్రాంగణం జిల్లా మేనేజర్ కే.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 15 నుంచి 45 ఏళ్ల లోపు గల నిరుద్యోగ మహిళలు ఈ ఉచిత శిక్షణను సద్వినియోగ పరుచుకోవాల్సిందిగా ఆమె కోరారు. మరిన్ని వివరాల కోసం 9963005209 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా మేనేజర్ మాధవి పేర్కొన్నారు.

## సమీర్ నిశ్చితార్థ వేడుకలో కదిరి పార్థసారథి

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



కోవిలంపాడు గ్రామానికి చెందిన షేక్ పాచ్చామియా కుమారుడు షేక్ సమీర్ నిశితార్థ వేడుక గురువారంపామూరులోని అనిల్ గార్డెన్‌లో జరిగింది. ఈ వేడుకలో కదిరి బాబురావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి హాజరై సమీర్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీఎంపీటీసీ మునగల నారాయణరెడ్డి, తికణం బాబురావు, నున్నా నారాయణ, షేక్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ఆకస్మిక తనిఖీ

**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి సచివాలయంను ఎంపీడీఓ రంగ సుబ్బరాయుడు గురువారం ఆకస్మిక తనిఖీ చేసి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే అలాగే అక్షరాంధ్ర సర్వే పర్యవేక్షణ చేసి, ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజలకు సర్వీస్ విషయంలో ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో విధులకు హాజరు కావాల్సిందిగా ఎంపీడీవో ఆదేశించారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత

**మార్టూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు చిన్నగంజాం మండలం చింతగుంపల గ్రామానికి చెందిన దారా పరిమళకు అత్యవసర చికిత్స కొరకు ఎల్ఓసీద్వారా రూ.3,69,432 రూపాయల చెక్కులు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు అందజేశారు.

### విజయరావు వెంకట నరసింహారావును అభినందించిన కాపు సంఘం నాయకులు

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



శ్రీ లక్ష్మి చెన్నకేశవ ఆలయ నూతన పాలకమండలి ధర్మకర్తగా ఎన్నికైన విజయరావు నరసింహారావును మార్కాపురం పట్టణ కాపు సంఘం నాయకులు బుధవారం రాత్రిఅభినందనలు తెలిపారు. ముందుగా స్థానిక కోదండ రామస్వామి దేవాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ అవకాశం కల్పించిన మార్కాపురం జనసేన మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మార్కాపురం పట్టణంలో బలిజ/కాపు సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలు కాశీనాథ్‌కు వివరించారు. దీనికి ఇమ్మడి కాశీనాథ్ స్పందిస్తూ ఈ విషయాలపై త్వరలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి మీ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇమ్మడి కాశీనాథ్, విజయరావు వెంకట నరసింహారావులను దుశ్శాలువాలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అంజి నాసరయ్య, కాపు సంఘం నాయకులు ఇనుపగోళ్ళ వెంకటేశ్వర్లు, ఇనుపగోళ్ళ నాగరాజు, సూర్య గోవింద్‌స్వామి,రఘుపతి శివ,ఇనుపగోళ్ళ మస్తాన్‌బాబు,మద్దిరాల,తిరుమలశెట్టి వీరయ్య, తాడి బాలకృష్ణ,బండి వెంకట నారాయణ (చిన్న), రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆకుల సుబ్బారావు, చలమయ్య మరియు కాపు టీచర్స్ అసోసియేషన్ సభ్యులు మల్లికార్జున, వినోద్, శ్రీరాంశెట్టి, ఇమ్మడి రవీంద్రనాథ్ లాయర్, సింగిరి శ్రీనివాసులు, బెల్లంకొండ గోపి, మిరియాల వాసవి తదితరులు పాల్గొన్నారు.

### ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్టీసీనే నిర్వహించాలి

**ఎపిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు సిహెచ్ జనార్దనరావు**

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆర్టీసీనే నిర్వహించాలని ఎపిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ మార్కాపురం జిల్లా అధ్యక్షులు సిహెచ్ జనార్దనరావు డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా మార్కాపురం పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద గురువారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీలో ప్రవేశ పెడుతున్న ప్రైవేట్ వారితో ఎలక్ట్రికల్ బస్సుల ఆపరేట్ విధానాలను ఉపసంహరించుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీలో వెంటనే 3 వేల కొత్త బస్సులు, 10 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రచారకార్యదర్శి శేఖర్ నాయుడు, జిల్లా కోశాధికారి రమణ, ఎడిసిలు జార్జి, వెంకటేశ్వర్లు, డిపో ఆర్గనైజింగ్ సెక్రటరీ అష్రఫ్, డిపో కోశాధికారి రెహమత్, అల్తాఫ్, ఎం.వి. రమణ, షేషన్ పా, శేషాలి, నాయక్, మల్లి, డ్రైవర్ వెంకటేశ్వర్లు, చలమయ్య, కాశయ్య, మిలటరీ వలి తదితరులు పాల్గొన్నారు.

### రంగారావుకు 5 వేలు ఆర్థిక సహాయం

**అద్దంకి , ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**



మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అద్దంకి వారి ఆధ్వర్యంలో నే రంగారావు బ్రెయిన్ బ్లడ్ క్లాటింగ్,ఎడమ కాలు, ఎడమ చేయి పక్షవాతంతో బాధపడుతుండగా ఆయనకు 5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పేరం సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోనుగుంట శ్రీనివాసరావు,వైస్ చార్ కౌన్సిలర్ కొమ్మలపాటి సుధీర్,కన్వీనర్ సుంకర శ్రీదేవి,జిల్లా అధ్యక్షులు వై.ఎలమందరెడ్డి,ప్రధాన కార్యదర్శి కపురం శ్రీనివాసరెడ్డి, నరసింహారెడ్డి, మహాలక్ష్మిరెడ్డి, సుద్దపల్లి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# శంకరా రెడ్డికి కరణం నివాళి

**బల్లికురవ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి దశదిన కర్మ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి చీరాల మాజీఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి,వైకాపా ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబులు హాజరయ్యారు.ఈ సందర్భంగా శంకరారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నేతలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రహదారులపై నీరు చల్లకపోతే చర్యలు తప్పవు

**- తహసీల్దార్ రవి నాయక్**

**బల్లికురవ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



మండలంలోని బల్లికురవ నాలుగు రోడ్ల కూడలి, వేమవరం నాలుగు రోడ్ల కూడలి, కొనిదేన, గ్రామాల పరిధిలో రహదారులపై ప్రతి రోజు నీరు చల్లాల్సిందేనని తహసీల్దార్ రవినాయక్ గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వాహకులకు సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని, గ్రానైట్ కర్మాగారాల నుండి వ్యర్ధాలను తరలిస్తున్న క్రమంలో రహదారులన్నీ దుమ్ము, ధూళితో నిండిపోయాయన్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రహదారులపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారన్నారు. వేసవి ఆరంభం నుండి ముగింపు వరకు రహదారులపై నీటిని చల్లే బాధ్యతను కర్మాగారాల యాజమాన్యాలు తీసుకోవాల్సిందేనన్నారు. అదేవిధంగా మల్లాయపాలెం రహదారి, కొండాయపాలెం రహదారులలో గ్రానైట్ క్వారీల యాజమాన్యాలు నిత్యం నీటిని చల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## లేబర్ కోడ్స్ చేయాలంట కథం తొక్కిన కార్మిక సంఘాలు

**పుల్లలచెరువు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని కాటివీరన్న చెరువు కట్ట దగ్గర నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కార్మిక సంఘాల సీపీఎం సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేయడం జరిగింది. ఈ ర్యాలీలో అంగన్‌వాడీ ఉద్యోగులు,ఆశావర్కర్లు,పారిశుధ్య కార్మికులు పలువురు కార్మికులు పాల్గొన్నారు. సందర్భంగా సీఐటీయు నాయకులు కొలుకులూరి కిష్టయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకొచ్చి నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేసేంత వరకు కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేస్తాయని ఆయన అన్నారు. స్వతంత్రం రాకముందు నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకురావడం కార్మిక వర్గాన్ని ఉరి తీయడమేనని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుడు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కారం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైందని అందుకు నిదర్శనం దేశ వ్యాప్తంగా ఈ రోజు జరిగిన జాతీయ సమ్మె అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల కోసం రోడ్డుకు ఇరువైపులా మరమ్మత్తులు

**- టీడీపీ నాయకులు వెంకటకృష్ణారావు**

**లింగసముద్రం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని భక్తులు రాకపోకలకు ఎలాంటి అంతరాయం జరగకుండా యర్రారెడ్డిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఉప్పుటూరి రమణయ్య కుమారుడు వెంకట కృష్ణారావు ఆధ్వర్యంలో వెంగళాపురంలోని మట్లె వెంకట సుబ్బయ్య తోట దగ్గర నుండి లింగసముద్రం ఆంజనేయస్వామి విగ్రహం వరకు వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మోకాళ్ళ లోతులో ఉన్న గుంతలకు గ్రావెల్ మట్టి తోలించి భక్తులకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు.తన సొంత ఖర్చుల తోటి రోడ్డు మరమ్మత్తులు చేసినటువంటి కృష్ణారావు ని వాహనదారులు అభినందించారు. ఆయన సహచర్లు రేవూరి తిరుమలేశు, ఉట్లపలి వెంకట సుబ్బయ్య, నారిబోయిన నారయ్య దగ్గరుండి రోడ్డు పనులను పర్యవేక్షించడం జరిగింది.

## మొగిలిచర్లలో మహాశివరాత్రికి సర్వం సిద్ధం

**- ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్**

**లింగముద్రం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



లింగసముద్రం మండలం మొగిలిచర్లలోని దత్తాత్రేయ స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకకు ముస్తాబవుతోంది. ఈ క్షేత్రంలో మహాశివరాత్రి ఎంతో వైభవంగా జరుగుతుంది. ఏటా పరిసర గ్రామాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు ఇక్కడికి తరలి రావడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వంశపారపర్య ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

### సీఐటీయు ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా యర్రగొండపాలెంలో ర్యాలీలో

**యర్రగొండపాలెం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



సార్వత్రిక సమ్మె కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసమేనని సీఐటీయు నాయకులు పిలుపునిచ్చారు. యర్రగొండపాలెం పట్టణంలో సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికులు పాల్గొని ర్యాలీ చేపట్టారు. దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో భాగంగా లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ యర్రగొండపాలెం పట్టణంలో కార్మిక ప్రదర్శనను కార్మిక సంఘాలు పాల్గొని నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు డీఎంకే రఫీ మాట్లాడుతూ ఎన్నో ఎళ్ళ నుంచి పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి 4 లేబర్ కోడ్స్‌గా తీసుకురావడం వల్ల కార్మికులు, యజమానులకు బానిసలుగా మారారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు మండల నాయకులు ఎస్‌కే అమీర్ భాష, టి.సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మల్లీశ్వరి, సుభాషిని, రామకుమారి, సునీత, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు రవణమ్మ, సివిల్స్ సప్లై ముఠా నాయకులు బాల కాశయ్య, రవి, నారాయణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజి పాల్గొన్నారు.

### కంభం వెంకట రమణారావును అభినందించిన ఎపిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్

**మార్కాపురం టౌన్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



నేషనల్ నీత్ అయోగ్ అనుబంధ సంస్థ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మార్కాపురం జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మార్కాపురం పట్టణానికి చెందిన కంభం వెంకట రమణారావును ఎపిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంకట రమణారావును దుశ్శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎపిఎస్ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ మార్కాపురం జిల్లాకార్యదర్శి సిహెచ్.జనార్దనరావు మాట్లాడుతూ నేషనల్ నీత్ అయోగ్ అనుబంధ సంస్థ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మార్కాపురం జిల్లా అధ్యక్షులుగా కంభం వెంకటరమణారావు నియమితులవ్వడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జోనల్‌సహాయ కార్యదర్శి శాస్త్రి సోమయాజుల, జిల్లా ఉపాధ్యక్షులు బాషా హుస్సేన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిశెట్టి శేఖర్‌నాయుడు, జిల్లా కోశాధికారి టి.వి. రమణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.వి. బాష, డిపో అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నాని, గ్యారేజి కార్యదర్శి ఎం.మోహన్‌రావు, ఎడిసి నాగేశ్వరరావు,సిహెచ్ కొండలు, ఎం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### శంకరరెడ్డికి పలువురు నేతల నివాళి

**అద్దంకి , ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**



పిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్ మేరదమెట్ల శంకరారెడ్డి దశదిన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. వీరిలో ఈదా శ్రీనివాసరెడ్డి, సోమా శ్రీనివాసరెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు వున్నారు.

## హైకోర్టు న్యాయమూర్తికి ఎజిపి బిఆర్‌కె శుభాకాంక్షలు

**అద్దంకి , ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**



ఎపి హైకోర్టు న్యాయమూర్తిగా మెడమల్లి బాలాజీ నియమితులు కాగ, ఆయనకు అద్దంకి ఎజిపి బత్తుల రామకోటయ్య శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయమూర్తిని దుశ్శాలువాతో బిఆర్‌కె సత్కరించి, బోకే అందజేసి శుభాకాంక్షలు అందజేశారు.

## పాకల తీరంలో సూర్య యోగా కార్యక్రమం

**సింగరాయకొండ, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**





యోగాసనాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. పాకలబీచ్‌లో నిర్వహించనున్న బీచ్‌ఫెస్టివల్ కార్యక్రమాలలో భాగంగా గురువారం ఉదయం సూర్య యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర మారిటైమ్ బోర్డుచైర్మన్ దామచర్ల సత్యనారాయణ,టూరిజం కార్పొరేషన్‌చైర్మన్ నూకసాని బాలాజీ,మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్,ఒంగోలుఅర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, జాయింట్ కలెక్టర్ కల్పనాకుమారి, డీఆర్ఓబి. చినఓబులేసు హాజరయ్యారు.స్టెప్,ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పతంజలి యోగా కేంద్రం శిక్షకులు బాలసుబ్రమణ్యం పర్యవేక్షణ లో సుమారు 400 మంది విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగ సాధన శారీరక,మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని, బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్టెప్‌సీఈవో శ్రీ మన్నారాయణ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి ఫుట్ బాల్ పోటీలో సరస్వతి విద్యార్థుల ప్రతిభ

**తాళ్లూరు, ఫిబ్రవరి12, ప్రభాతవార్త**



రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ తరపున గుంటూరులోని ఎస్.ఎస్.వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన అండర్ 16 ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో శ్రీ సరస్వతి హై స్కూల్‌కి చెందిన 9వ తరగతి విద్యార్థి మందా రాకేష్, తన్నీరు సాయి కిరణ్ కుమార్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు .వీరిద్దరూ కేరళలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. తమ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపట్ల శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఏ.వి.రమణారెడ్డి,హెచ్.ఎం. శ్రీరామమూర్తి, పిఈటి బుజ్జివికాస్ విద్యార్థులను అభినందించారు.

## అక్షరాంధ్ర కేంద్రాలకు మెటీరియల్ పంపిణీ

**తాళ్లూరు, ఫిబ్రవరి12, ప్రభాతవార్త**



స్థానిక వెలుగు కార్యాలయంలో మండలంలోని అక్షరాంధ్రకేంద్రాలకు గురువారం దర్శి నియోజక వర్గం వయోజన విద్యా పర్యవేక్షకులు వై.చౌడిరెడ్డి మెటీరియల్స్ ను పంపిణీ చేశారు. మండలంలోని 13 అక్షరాంధ్ర కేంద్రాల్లోని 3073మంది అభ్యాసకులకు ఈ మెటీరియల్స్ ను ఇవ్వనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఈ కేంద్రాలు 100 రోజుల పాటు అభ్యాసకులకు శిక్షణ ఇచ్చివారి అక్ష ్యరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. కార్యక్రమంలో ఏపీఎం దేవరాజు, సీసీలు మోహన్‌రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

### కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను సందర్శించిన రిజిస్ట్రార్ రమణ

**సీఎస్‌పురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



సీఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలను గురువారం గుంటూరు లాంలోని ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవి రమణ, డాక్టర్ జాన్సన్, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ ముని రత్నం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలోని ల్యాబ్స్, అధునాతన క్లాస్ రూమ్స్, క్రీడా ప్రాంగణం, లైబ్రరీ, హాస్టల్స్‌లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చాలా అద్భుతంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ, డాక్టర్ జాన్సన్, ఎన్వి రమణ, డాక్టర్ మునిరత్నంలను సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారథి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్న గౌడ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కోలలపూడి గ్రామంలోని హెచ్‌ఈ పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ

**మార్టూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

మండలంలోని కోవిలంపాడు గ్రామంనందున్న హెచ్‌ఈ ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిగా పాఠశాలను సందర్శించి ఒకటి,రెండు తరగతుల విద్యార్థులయొక్క విద్యాసామర్థ్యాలను, సృజనాత్మకతను, పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల యొక్క సామర్థ్యాలు, సృజనాత్మకతను గుర్తించి ఉపాధ్యాయురాలు పద్మిని అభినందించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక స్థాయి విద్యార్థులకు అమలవుతున్న జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం గురించి వివరాలు పరిశీలించి గత ప్రభుత్వంలో మంజూరై అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను,పాఠశాలకు ఇంకా అవసరమైన మౌలిక సదుపాయాల గురించి ఉన్నతాధికారులకు నివేదించి త్వరగా పూర్తి అయ్యేలా చేస్తానని హామీఇచ్చారు.రానున్న విద్యా సంవత్సరానికి విద్యార్థులఅడ్మిషన్ పెంపుదలకు తీసుకోవాల్సి నటు వంటి ప్రణాళిక చర్యల గురించి ప్రధానోపాధ్యాయులతో చర్చించి తగు సూచనలు చేశారు.

### 27న మాలకొండ ఆలయం వేలం పాటలు - డీసీ చంద్రశేఖర్

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**



మండలంలోని మాలకొండలో కొలువుతీరి ఉన్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో వేలం పాటలను అనివార్య కారణాల వలన వాయిదా జరిగిందని ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలిపారు. తల నీలాలు,కొబ్బరికాయలు,పార్కింగ్ తదితర విభాగాలకు చెందిన వేలం పాటలను ఆలయ ప్రాంగణంలో ఈనెల 27వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

### ఇరిగినేని 9వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన కోటపాటి, యారవ

**పామూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**





కనిగిరి మాజీ శాసనసభ్యులు స్వర్గీయ ఇరిగినేని తిరుపతి నాయుడు వారి తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా బొట్లగూడూరు గ్రామంలో ఇరిగినేని తిరుపతి నాయుడు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి కోటపాటి జనార్ధన్, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, కార్యక్రమాలో వారు మాట్లాడుతూ రూపం కనుమరుగైనా.. కనిగిరి నియోజకవర్గానికి వారు చేసిన అభివృద్ధి, పంచిన ప్రేమ కనిగిరి నియోజకవర్గ ప్రజల జ్ఞాపకాలు నిత్యం సజీవం అన్నారు. స్వర్గీయ ఇరిగినేని తిరుపతినాయుడు వర్ధంతి వేళ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు, కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసరావు, ఇరిగినేని తిరుపతి నాయుడు కుమారుడు రవిబాబు, పట్టణ అధ్యక్షులుసయ్యద్‌అమీర్‌బాబు, ఉపాధ్యక్షులుఇర్రికోటిరెడ్డి,ఒగూరు ఏడుకొండలు , తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇరిగినేని అభిమానులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి

**- జేసీ పి శ్రీనివాసులు ఆదేశం**

**మార్కాపురం,ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**



మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న నూతన కలెక్టరేట్ భవనం పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఆయన కలెక్టరేట్ ప్రాంగణాన్ని సందర్శించి జరుగుతున్న అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. ఒంగోలు నుంచి లారీల ద్వారా తరలివచ్చిన రికార్డులను పరిశీలించిన జేసీ వాటిని గదుల్లో సక్రమంగా భద్రపరచేందుకు ఏర్పాటు చేసిన నూతన ర్యాకులను కూడా తనిఖీ చేశారు. రికార్డుల సంరక్షణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అదేవిధంగా కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. భవనంలో జరుగుతున్న మిగతా పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, తన చాంబర్లో జరుగుతున్న పనులను పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జేసీ వెంట ఇంచార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి, తహసిల్దార్ చిరంజీవి, అలాగే జిల్లాలోని వివిధ మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

7_7.qxd 2/13/2026 12:12 AM Page 1



## ఉల్లాస్ - అక్షరాంధ్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన జేసి



మార్కాపురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో "ఉల్లాస్ - అక్షరాంధ్ర" పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మెప్మా, డ్వామా సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని వయోజన విద్య అధికారులకు ఆదేశించారు. మార్కాపురం జిల్లాలో మొత్తం 66,972 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు జిల్లా వయోజన విద్యనోడల్ అధికారి వి.ప్రభాకర్, సూపర్వైజర్ చెన్నయ్య జేసికి వివరించారు. ప్రతి పది మందికి ఒక వాలంటీర్ చొప్పున నియమించి కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

# మార్కాపురంలో భారీ సార్వత్రిక సమ్మె

### - కార్మిక హక్కులపై దాడి.. కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వం..
### - సీఐటీయూ-ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం
### - పాల్గొన్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి



మార్కాపురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం జరిగిన సార్వత్రిక సమ్మెలో భాగంగా మార్కాపురం పట్టణంలో సిఐటియు, ఏఐటియుసి సంఘాల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కోర్టు సెంటర్ నుంచి కంభం సెంటర్, గడియార స్తంభం సెంటర్, పేరు బజారు, రీడింగ్ రూముల మీదుగా సాగిన ర్యాలీ అనంతరం కంభం సెంటర్‌లో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దగ్గుపాటి సోమయ్య అధ్యక్షతన మానవహారం జరిగింది. ఈ ర్యాలీ, బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన మీగడ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఎన్నో దశాబ్దాల పోరాటాలతో సాధించుకున్న 8గంటల పని విధానం, సమ్మె హక్కు, పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాల హక్కులను లేబర్ కోడ్ల ద్వారా ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత్‌లో 12 గంటల పని విధానాన్ని చట్టబద్ధం చేయడం శ్రమదోపిడీకి పరాకాష్ట అని విమర్శించారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను చౌకగా అమ్మేస్తున్నారని, బీఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసి ఇప్పుడు ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా కార్మికుల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకులు అందే నాసరయ్య, యుటిఎఫ్ మార్కాపురం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దుల వీరారెడ్డి తదితరులు మాట్లాడారు. లేబర్ కోడ్ల రద్దు, 8గంటల పని విధానం కొనసాగింపు, 12 గంటల విధానం ఉపసంహరణ, కనీస వేతనం రూ.26వేలు అమలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేత, కాంట్రాక్ట్-ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ వంటి డిమాండ్లతో పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా మున్సిపల్, ఆటో,ముఠా, మధ్యాహ్న భోజన, మెప్మా, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, ఆర్టీసీ, పోస్టల్ ఉద్యోగ సంఘాల నాయకులు, సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఐ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, జన విజ్ఞాన వేదిక తదితర సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

# రిజిస్ట్రేషన్ లేకుంటే పిఎం కిసాన్ లేదు

### - మండల వ్యవసాయ అధికారిణి కే బుజ్జిభాయి



మార్కాపురం, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
మార్కాపురం మండలంలో రైతుల కోసం చేపట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ యూనిక్యూ ఐడి) నమోదు కార్యక్రమాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారి కే బుజ్జిబాయి ఆధ్వర్యంలో గజ్జలకొండ-1,గజ్జలకొండ-2 గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పిఎం కిసాన్ పథకం కింద డబ్బులు ఇప్పటివరకు జమకాని రైతులు తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యలో నమోదు కావాలని సూచించారు. సమీపంలోని రైతు సేవ కేంద్రం (ఆర్ఎస్కే)ను సంప్రదించి నమోదు చేసుకుంటేనే వచ్చే విడతలో పిఎం కిసాన్ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో జమవుతాయని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే బుజ్జిబాయి, గ్రామ వ్యవసాయ నాయకులు సాయి దీక్షిత్ రెడ్డి, అరుణా దేవితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు. రైతుల నుంచి మంచి స్పందన లభించిందని అధికారులు తెలిపారు.

## గుండ్రెడ్డి పల్లెలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొమరోలు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
మార్కాపురం జిల్లా కొమరోలు మండలంలోని గుండ్రెడ్డిపల్లె గ్రామంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్శాఖ ఏఈ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా తాటిచెర్ల మోటు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గుండ్రెడ్డిపల్లె గ్రామానికి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## స్త్రీ నిధి రుణాల లోనింగ్, రికవరీపై సమీక్షా సమావేశం



రాచర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
మండల కేంద్రమైన రాచర్లలోని వెలుగు కార్యాలయంలో స్త్రీ నిధి, వివో, వివోఏలకు స్త్రీ నిధి రుణాల లోనింగ్, రికవరీపై డిఆర్డిఏ స్త్రీ నిధి ఏజీఎం ఉదయ్ కుమార్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హత ఉన్న అన్ని ఎస్హెచ్జిలకు స్త్రీనిధి లోన్లు ఇవ్వాలని అన్నారు. స్త్రీ నిధి లోన్ల టార్గెట్ 8 కోట్లు ఉండగా 4 కోట్లు మాత్రమే చేశారని దానిని పెంచాలన్నారు. ఎన్పిఏ ఓవర్ డ్యూలు ఉన్న వివో రికవరీలు ఎస్హెచ్జి మెంబర్స్ నుండి వసూలు చేసి రికవరీ శాతం ఇంప్రూవ్ చేయాలన్నారు. రుణాలను మార్చి 27వ తేదీ లోపు చేయాలని, రుణాన్ని మహిళలు జీవనోపాదులకు వినియోగించుకొని ఆదాయ అభివృద్ధి పొందాలన్నారు. వివిఆర్పి సర్వే ఆలీవ్ డేటా ఎంట్రీ ఎస్హెచ్జి, విఓ సమావేశాలు పిఎం ఎస్ఎంఐ లోన్స్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కె నరేష్ స్త్రీ నిధి మేనేజర్ రాజేశ్వరి, సీసీలు కృష్ణయ్య వెంకటయ్య, సమాఖ్య ఆఫీస్ బేరర్స్, అకౌంటెంట్, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.

## గోడపత్రికల ద్వారా బడిబాట కార్యక్రమంపై అవగాహన



కంభం, ఫిబ్రవరి 12 ,ప్రభాతవార్త
ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమంపై కంభం పట్టణంలోని స్థానిక అర్బన్ ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులు గోడపత్రికల ద్వారా గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించి విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని, ఈ బడిని కాపాడుకుందాం అంటూ ప్రజలలో చైతన్యం కలిగించారు. ప్రభుత్వ పాఠశాలల విశిష్టతను వివరిస్తూ సదుపాయాలు, అంగన్వాడి కేంద్రాలు, పలుకూడళ్లలో గోడ పత్రికలను అంటించి కార్యక్రమం చేపట్టారు. సకల సౌకర్యాలతో ఉచిత విద్య ఉపకరణాలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం లాంటి ప్రత్యేకతలను ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల కుమారి, సీఆర్పి సురేష్ మురళీమోహన్, ఉపాధ్యాయులు సహారా బేగం, ఆమీనాబీ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలంటూ కంభంలో భారీ నిరసన



కంభం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణను ఆపాలని, సిఐటియు ఆధ్వర్యంలో కంభం మండలంలో గురువారం భారీగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా కార్మిక సంఘం ఇచ్చిన పిలుపుమేరకు కంభం పట్టణంలోని వై జంక్షన్ నుంచి బస్టాండ్ మీదుగా కందులాపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు అన్వర్ మాట్లాడుతూ వ్యవసాయ పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు రోశయ్య, భాజావలీ, కొత్తూరు, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో కట్టుదిట్టమైన ట్రాఫిక్ ఏర్పాట్లు

### - భక్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా సమగ్ర చర్యలు
### - జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



మార్కాపురం, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానానికి భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో దోర్నాల నుండి శ్రీశైలం వరకు ఉన్న ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఇన్చార్జి ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు తెలిపారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు పోలీస్‌శాఖ సమగ్ర ప్రణాళికతో ముందడుగు వేసిందన్నారు.

**భద్రతా చర్యలు - ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు :**
ఘాట్ రోడ్డులో రద్దీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పోలీసు బృందాలు, హైవే పేట్రోలింగ్ వాహనాలు, టోయింగ్ వాహనాలను సిద్ధంగా ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘారద్దీ సమయాల్లో అదనపు పోలీస్ సిబ్బంది మోహరింపు, భారీ వాహనాలకు నిర్దిష్ట సమయాల కేటాయింపు, ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు హెచ్చరిక బోర్డులు, సూచికలు, రిఫ్లెక్టర్ల ఏర్పాటు, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ ద్వారా తక్షణ స్పందన ఘాట్ రోడ్డులో అనుభవం ఉన్న డ్రైవర్లే వాహనాలు నడపాలని, రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించరాదని సూచించారు.

**ప్రయాణీకులకు సూచనలు :**
భక్తులు, ప్రయాణికులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు. అతి వేగం, ఓవర్‌టేకింగ్ పూర్తిగా నివారించాలని, వాహనాల బ్రేకులు, టైర్లు, ఇంజిన్ పరిస్థితి ముందుగా తనిఖీ చేసుకోవాలని, అనవసరంగా రోడ్డు పక్కన వాహనాలు నిలిపి ఉంచరాదని, నైపుణ్యం కలిగిన డ్రైవర్లతోనే ప్రయాణించాలని, పోలీసు సిబ్బంది సూచనలకు సహకరించాలని తెలిపారు.

**ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు :**
ట్రాఫిక్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పి తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో మహాశివరాత్రి వేడుకలను శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

# శివభక్తులకు ఉచిత వైద్య సేవలు

### - మెడికల్ క్యాంపు ప్రారంభానికి జేసీకి డా ఏలూరి ఆహ్వానం



మార్కాపురం, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త
మహాశివరాత్రి సందర్భంగా కాలినడకన శ్రీశైలం వెళ్లే శివభక్తులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఈ నెల 14 నుంచి 16 వరకు దోర్నాలలో ఏర్పాటు చేస్తున్న మెడికల్ క్యాంపును ప్రారంభించాల్సిందిగా జిల్లా జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులును డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. లీ ఫార్మా మరియు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపును భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అల్లూరి సీతారామరాజు జాతీయ పురస్కారం అందుకున్న డాక్టర్ బోనేని



కొమరోలు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్‌కు అరుదైన గౌరవం దక్కింది విజయవాడలో గిద్దలూరు నియోజకవర్గంలో అమ్మఫౌండేషన్ స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో సభ్యులు, దాతల సహకారంతో పోలీస్ అధికారులకు, జర్నలిస్టులకు హెల్మెంట్స్, క్యాప్, మాస్క్ అందచేయుట, అనాథలకు యాచకులకు వసతి కల్పించటం, వికలాంగులకు విల్ చైర్స్ పంపిణీ, నిరుపేద విద్యార్థులు భవిష్యత్తు కొరకు వారు చదువులకు ఆర్థికంగా సహాయం చేయటం, అలాగే మెడికల్ క్యాంపులు పెట్టి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించటం, బడుగు బలహీన వర్గాలకు వైద్యఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయటం, తదితర సేవాకార్యక్రమాలకు గాను మధర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు ఎం ప్రసాదరావ్ హనుమంతరాయ గ్రంధాలయం గాంధీనగర్ విజయవాడ నందు పేరం శివనాగేశ్వరరావు మల్లాడిప్రసాదరావు హీరోయిన్ ఉప్పలపాటి సంధ్య, సత్తెనపల్లి బుల్లి బాబు, దొడ్డపాటి దాస్ ప్రముఖుల చేతులమీదుగా స్వాతంత్ర్య సమరయోధులు పేరున అల్లూరి సీతారామరాజు జాతీయ అవార్డ్ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ అందుకున్నారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ ఇంతటి గౌరవ పురస్కారానికి ఎంపిక కావటం పట్ల సంతోషం వెలిబుచ్చారు. తనకు చిన్ననాటి నుంచి మదర్ థెరిస్సా, మహాత్మ గాంధీ, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి అన్నారు. అటువంటి మహాత్ముల పేరిట అవార్డు అందుకోవటం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మల్లాడి ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మ ఫౌండేషన్ సెక్రటరీ భూపాల్ మాట్లాడుతూ మేము చేస్తున్న సేవా కార్యక్రమాలే మాకు అవార్డు రావడానికి ప్రధాన కారణమన్నారు. అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కు ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్న ఈ గౌరవ పురస్కారాన్ని ప్రతి ఒక్కరికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. పురస్కారం అందుకున్న బోనేని వెంకటేశ్వర్లు యాదవ్‌ను సంస్థ సభ్యులు, గ్రామస్తులు, పలు రాజకీయ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.

## రామాపురం సొసైటీ కేంద్రం ద్వారా త్వరలో కందుల కొనుగోలు

రాచర్ల, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త
మండలంలోని రామాపురం సొసైటీ కేంద్రం ద్వారా త్వరలో కందుల కొనుగోలు కార్యక్రమం జరుగుతుందని సొసైటీ బ్యాంక్ చైర్మన్ భవనం పుల్లారెడ్డి తెలిపారు. పంట నమోదు చేయించుకున్న రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలా చేయించుకున్న వారికి ప్రభుత్వం తేదీ, సమయం కేటాయిస్తుందని, దానిప్రకారం కందుల కొనుగోలు జరుగుతుందన్నారు, ప్రభుత్వ మద్దతు ధర కింటా రూ.8వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ విషయంలో రైతులు నిర్లక్ష్య వహించవద్దని, ప్రభుత్వ పథకాలు అందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు.

# బాధితులకు వైసీపీ ఇన్‌చార్జ్ బుర్రా పరామర్శ



కందుకూరు పిబ్రవరి 12,ప్రభాతవార్త
గుడ్లూరు మండలంలోని పలు గ్రామాలలోని వైసీపీకి చెందిన పలువురు బాధితులును కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ మాజీశాసనసభ్యులు బుర్రామధుసూదన్‌యాదవ్ గురువారం పరామర్శించారు. నేనున్నాంటూ భరోసా కల్పించారు. ఇందులో బాగంగా దారకానిపాడులో ఇటీవల మృతిచెందిన స్వర్గీయ గొర్ల వరుణ్ కుటుంబాన్ని, జానకంపేటలో మరణించిన మండల కార్యవర్గసభ్యులు స్వర్గీయ గుండ్లపల్లి నాగరాజుల కుటుంబాన్ని పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతులు లేని లోటు తీర్చలేమన్నారు. కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. అదేవిధంగా చేవూరు మాజీ డీలర్ ఎందిటి వెంకటశేషయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇంటికే పరిమితమైన ఆయనను సైతం వైసీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఒంగోలులో జరిగిన ప్రకాశం జిల్లా పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకర రెడ్డి దశదినకర్మకు హాజరైనారు. మృతుడు శంకరరెడ్డికి శ్రద్ధాంజలిఘటించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రికి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

### - ప్రతి 15నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం
### - అదనపు చార్జీలు లేవు-మహిళలకు ఫ్రీ



కందుకూరు పిబ్రవరి 12,ప్రభాతవార్త
ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా సంగమేశ్వరం, మొగిలిచర్ల శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కందుకూరు ఆర్డీసీ డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో మీడియాతో సమావేశమైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటితోపాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న శింగరాయకొండ పాకల బీచ్‌పెస్టివల్‌కు 14,15 తేదీలలో ప్రత్యేక బస్సుసౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. కందుకూరు డిపో నుంచి లింగసముద్రం మీదుగా మొగిలిచర్లకు 30బస్సులు,సంగమేశ్వరంకు 5 బస్సులు, శింగరాయకొండ పాకలబీచ్‌కు మరో 5బస్సులు నిర్విరామంగా రాకపోకలు చేస్తాయన్నారు. మొగిలిచర్లకు ప్రతి 15నిమిషాలకు ఒక బస్సు సౌకర్యం ఉంటుందన్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎటువంటి అదనపు చార్జీలు ఉండవన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా సుమారు 30వేల మందికి పైగా భక్తులకు ఈ సౌకర్యం ఒనగూరనుందని మేనేజర్ అభిప్రాయపడ్డారు. సీఐ శ్యాంప్రసాద్, ఎంఎఫ్‌తో పాటు పలువురు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా బస్సుల నిర్వహణను పర్యవేక్షించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్యాంప్రసాద్‌తోపాటు పలువురు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తాం

### - సిఐటియు జిల్లా కార్యదర్శి టి.ఆవులయ్య





గిద్దలూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
గిద్దలూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం నుండి పట్టణంలోని పురవీధుల గుండా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి టి.ఆవులయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకొచ్చి నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేసేంతవరకు కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటం చేస్తాయని అన్నారు. స్వతంత్రం రాక ముందు నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా తీసుకురావడం కార్మిక వర్గాన్ని ఉరి తీయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌లను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క కార్మిక వర్గానికి వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా చాలామంది స్కీం వర్కర్లు రోడ్లపై కొచ్చి ఆందోళన చేశారని ఇప్పటికైనా కూటమీ ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల సందర్భంగా అయినా కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రకటన చేయాలని అన్నారు. లేనిపక్షంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా ఛలో అసెంబ్లీ నిర్వహిస్తామని అన్నారు. యుటిఎఫ్, ఏపీటీఎఫ్ టీచర్ సంఘాల నాయకులు ఎం సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఉద్యోగులకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఈ నిర్ణయాలను రిటైర్డ్ ఎంప్లాయిస్ ఉద్యోగులు, టీచర్స్ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. ఎన్నికల అప్పుడు సిపిఎస్ రద్దు చేస్తానని అధికారంలోకి వచ్చిన తర్వాత సిపిఎస్ రద్దు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, పిఆర్సి కమిషన్ వేయకుండా ఉద్యోగుల కార్మికులను అవమాన పరుస్తున్నారని అన్నారు. ఉద్యోగ కార్మిక సమస్యలు పరిష్కారం చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని అందుకు నిదర్శనం దేశవ్యాప్తంగా ఈరోజు జరిగిన జాతీయ సమ్మె అని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి నరసింహులు డి శ్రీనివాసులు వివిధ సంఘాల నాయకులు డి రుతమ్మ, డి స్వర్ణ, జి ఆనంద్ రావ్ ,నాగలక్ష్మి, జి విశ్రాంతమ్మ , ఏ మునెమ్మ, సాయి లక్ష్మి, నూర్జహాన్, మురళి, ఎం సరోజ, ఏ వెంకటేశ్వర్లు, ఎం పిచ్చిరెడ్డి, ఏ కుమారి, ఎస్‌కె మోలాబి, కార్మిక సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు, టీచర్స్ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు పోరాటాన్ని కొనసాగిందాం

### - సిఐటియు జిల్లా నాయకులు బి రఘురామ్ పిలుపు



త్రిపురాంతకం, ఫిబ్రవరి 12,ప్రభాతావార్త
దేశావ్యాప్తంగా గురువారం జరిగిన సార్వత్రికసమ్మె సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వై లాభను అధ్యక్షతన త్రిపురాంతకం మండలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బి.రఘురామ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికుల హక్కులు తీవ్రంగా కాలరాయబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం, గ్రాట్యూటీ,పెన్షన్, ఉద్యోగ భద్రత వంటి మౌలిక హక్కులను సాధించుకునేందుకు కార్మికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు వైటి ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో మనువాద భావజాలంతో ఉన్న బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులకు రక్షణే కరువైందన్నారు. సంఘాలు ఏర్పాటు చేసుకునే హక్కు, రాజ్యాంగం ఇచ్చిన సమ్మె హక్కు కూడా లేకుండా చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సమ్మె సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆశా,అంగన్వాడీ,మధ్యాహ్న భోజన కార్మికులు,వీఆర్ఏలు, 108 ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ సభ్యులు, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎట్టకేలకు వలేటివారిపాలెంకు రెగ్యులర్ తహసిల్దార్

వార్త ప్రభావం



కందుకూరు పిబ్రవరి 12, ప్రభాతవార్త
కందుకూరు నియోజకవర్గంలో గతకొంతకాలంగా కందుకూరు,లింగసముద్రం,వలేటివారిపాలెం మండలాలకు రెగ్యులర్ తహసిల్దార్‌లు లేకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు, అసౌకార్యనికి గురవుతున్నారు. అయితే కందుకూరు, లింగసముద్రం మండలాలకు డిప్యూటీ తహసిల్దార్‌లకు ఇన్‌చార్జ్ అప్పగించారు. వలేటివారిపాలెంకు మాత్రం గుడ్లూరు తహసిల్దార్‌కు అదనపు బాద్యతలు అప్పగించారు. ఈయన ఇప్పటికే ఎల్‌ఏగా అదనపు బాధ్యతల్లో ఉన్నారు. రామాయపట్నం పోర్టు పనులలో బిజీగా ఉన్నారు. దీంతో కనీసం ఒకసారి గూడా మండలానికి రాలేదు. తపాలా చూసిన దాఖలాలు కూడాలేవు. అర్జీదారులు కార్యాలయం చుట్టూ తిరిగిపోతున్నారు. పలు సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపద్యంలో "కందుకూరు నియోజకవర్గంలో తహసిల్దార్‌ల కొరత" అను శీర్షికన ఈ నెల 8న వార్త దినపత్రిక ప్రకాశం మినీలో వార్తాకధనం ప్రచురితమైంది. దీంతో పాలకులుతోపాటు ఉన్నతాధికారులుస్పందించారు. మార్కాపురం జిల్లాసీఎస్‌పురం మండలం తహసిల్దార్‌గా పనిచేస్తున్నఎస్,ఎండి.హుస్సేన్‌ను వలేటివారిపాలెం మండలానికి రెగ్యులర్ తహసిల్దార్‌గా నియమించారు. దీంతో ఆయన బుధవారం విధుల్లో చేరారు. డిప్యూటీ తహసిల్దార్ మధుసూధనరావు, ఆర్ఐప్రసాద్, వీఆర్వోమస్తాన్, సిబ్బందిశింగయ్య, శివ, నాగార్జున తదితరులు తహసిల్దార్‌ను ఘనంగా స్వాగతించారు.

# పోస్టాపీసులో ఆధార్‌సేవలు

కందుకూరు పిబ్రవరి 12,ప్రభాతవార్త
కందుకూరు పట్టణంలోని హెడ్ పోస్టాపీసులో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయిని పోస్ట్ మాస్టర్ టి.కళ్యాణి గురువారం తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాలు చిన్నారులకు ఉచితంగా ఆధార్ తీస్తామని ఆమె పేర్కొన్నారు. పేరు, చిరునామా, పుట్టిన తేదీ మార్పులకు రూ.75లు, బయోమెట్రిక్‌నకు రూ.125లను చెల్లించాల్సి ఉందని ఆమె తెలిపారు. కందుకూరు పరిసర ప్రాంతాలు ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## సంగమేశ్వరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ సమీక్ష



పొన్నలూరు , ఫిబ్రవరి 12 ,ప్రభాతవార్త
మహాశివరాత్రి సందర్భముగా మండలంలోని సంగమేశ్వరం ఆలయంవద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ పుల్లారావు ఆధ్వర్యంలో వివిధశాఖల అధికారులతో గురువారం ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా సంగమేశ్వరంలో భక్తులసంఖ్య అధికంగా ఉంటుందని వారికి తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా భక్తుల రద్దీ దృష్ట్యా బందోబస్తు, వైద్య శిబిరాలు,సదుపాయాల ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, వైద్య, వెలుగు, విద్యుత్ తదితర శాఖల ఉద్యోగులతో టీమ్‌లు ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఎస్ఐ సత్యనారాయణ,మెడికల్ ఆఫీసర్స్,ఏపీఎం,ఏపీవో , చెన్నిపాడు పంచాయతీ కార్యదర్శి, విఆర్ఓ ,చెన్నిపాడు సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలి



పొన్నలూరు , ఫిబ్రవరి 12 ,ప్రభాతవార్త
కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మికచట్టాలను రద్దుచేసి తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి అన్నారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన పొన్నలూరులో అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ కార్మికులకు రక్షణగా కార్మికచట్టాలను రద్దుచేసి తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్ల వల్ల కార్మిక వర్గం అశేష ప్రాణ త్యాగాలతో సాధించుకున్న కార్మికుల రక్షణ చట్టాలన్నీ రద్దు అయి కట్టు బానిసలుగా మారుతారన్నారు. అదేవిధంగా కార్మికులందరికి కనీసవేతనం 26000 ఇవ్వాలి. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులందరిని రెగ్యులర్ చేయాలి. సమానపనికి సమానవేతనం ఇవ్వాలి. స్కీం వర్కర్లందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస ఫెన్షన్ 10వేలు ఇవ్వాలని ఇతర డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలని ఆమె కోరారు. ముందుగా వారు స్థానిక బస్టాండ్ సెంటర్ లో మానవహారం నిర్వహించి వారి డిమాడ్లతో నినాదాలు చేశారు.

## శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు

### - సొసైటీ అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డికి ఆహ్వానం



కొమరోలు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త
శ్రీశైలం దేవస్థానంలో జరిగే బ్రహ్మోత్సవాలకు కొమరోలు సొసైటీ అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డిని శ్రీశైలం దేవస్థానం కార్యవర్గ సభ్యులు బొనేని రమణమ్మ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనకు స్వామి వారి ఆహ్వాన పత్రిక, స్వామి వారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8_8.qxd 2/13/2026 12:13 AM Page 1



# నయనానందకరం శ్రీశైల మహా పుణ్యక్షేత్రం







**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

దేవతల పాదస్పర్శతో పునీతమైన చోటును పుణ్యక్షేత్రమని,జలము వలన పవిత్రత పొందిన స్థలాన్ని పుణ్యతీర్థముగా కొలుస్తారు. అటువంటి పరమ పవిత్రతకు ప్రతీకగానిలిచే భూలోక కైలాసం శ్రీశైలం నయనానందకరంగా విరాజిల్లు తుంది. శైవ క్షేత్రంగా శ్రీశైలం క్షేత్రం విశిష్టత పొందింది.ఇక్కడ స్వయంభులింగముగా మల్లిఖార్జునుడు వెలిశాడు. కొలిచిన వారికి కొంగుబంగారమై నిలిచాడు. ఇంతటి ప్రసిద్ది చెందిన శ్రీశైలంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు భక్తుల హృదయాలను పరవశింపచేస్తున్నాయి. శ్రీభ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వార్ల దివ్య కళ్యాణము, ప్రతి రోజు నిర్వహించే వాహన సేవలు, శోభాయమానమైన అలంకరణలు భక్తులకు అపూర్వ ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు వేద మంత్రోచ్ఛరణలు, ఓం నమఃశివాయ, హర హర మహాదేవ శంభో వంటి నామస్మరణలతో మారుమోగుతుంది. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణలతో దేవాలయ ప్రాంగణం, ప్రధాన ద్వారాలు, ఆలయ గోపుర శిఖరాలు, వెలుగులతో మెరిసిపోతూ కన్నుల పండుగగా మెరిసిపోతుంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. పాతాళ గంగలో పుణ్యస్నానాలు, కైలాస ద్వారం దర్శనం, భక్తుల విశేష ఆకర్షణగా నిలుస్తున్నాయి. శివ పార్వతుల దివ్య సన్నిధిలో జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాలు భక్తులకు భక్తి, శాంతి, ఆనందమును ప్రసాదిస్తూ, శ్రీశైలాన్ని మరోసారి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలబెట్టాయి.

## సోపిరాల, కొత్తపాలెం గ్రామాలలో దేవాలయాలను సందర్శించిన జిల్లా ఎస్పీ





**చీరాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకుని బాపట్ల జిల్లా చిన్నగంజాం మండలం సోపిరాలలోని రామకోటేశ్వరస్వామి దేవాలయం, కొత్తపాలెం గ్రామ పంచాయతీలోని బాల కోటేశ్వరస్వామి దేవాలయాలను గురువారం జిల్లా ఎస్పీ సందర్శించారు. రెండు ఆలయ కమిటీల సభ్యులు జిల్లా ఎస్పీ కి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల పరిసర ప్రాంతాలను, క్యూలైన్ల ఏర్పాటును, సాంస్కృతిక కళా ప్రదర్శనలు జరిగే ప్రదేశాలను, విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసే స్థలాలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. అనంతరం రెండు ఆలయ కమిటీల ప్రతినిధులతో సంబంధిత శాఖల అధికారులతో స్థానిక శ్రీ వెంకటేశ్వర కళ్యాణ, మండపంలో ఎస్పీ సమన్వయ సమావేశం నిర్వహించి, మహాశివరాత్రి తిరునాళ్ల విజయవతంగా జరిగేలా అధికారులకు తగిన సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రసిద్ది గాంచిన ఈ దేవాలయాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు పోలీసు శాఖతో పాటు రెవెన్యూ, దేవాదాయ ఆర్టీసీ వైద్య ఆరోగ్యశాఖ, విద్యుత్ శాఖ, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, ఆలయ కమిటీలతో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత ఏడాది మహాశివరాత్రి రోజున సుమారు 30 వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు అంచనాలు ఉన్నాయని, ఈ ఏడాది భక్తులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున తగిన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూ లైన్లు, బ్యారికేడ్లు, పార్కింగ్ ప్రదేశాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఉంచుతామని వెల్లడించారు. ఆలయ ప్రాంగణంలో వృద్ధులకు, చిన్న పిల్లలకు, వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ముఖ్యంగా రెండు ఆలయాలకు వచ్చే భక్తులతో 80 శాతం మంది రైల్వే ట్రాక్‌లు దాటుకుని వస్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్అధికారుల సమన్వయంతో తగినంత మంది సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తామని, భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరికైనా తప్పిపోయిన పక్షంలో అనౌన్సింగ్ ద్వారా వారిని గుర్తించే ఏర్పాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. నేరాలు జరగకుండా నిరోధించేందుకు మఫ్టీలో కూడా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని,మహిళా భక్తులు తమ ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. భక్తులందరూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా పండుగను జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు, డీఎస్పీ మొయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఆలయ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఆలయ ప్రతినిధులు, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీ

**- పాతాళ గంగలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు పూర్తి**

**- నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి**



**పెద్దదోర్నాల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీ పెరిగిందని, తదనుగుణంగా సౌకర్యాలు పూర్తి చేసినట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రెండు లక్షల 50 వేలకు పైగా స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా పాతాళగంగలో పుణ్యస్నానాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. పాతాళగంగ ఘాటు వద్ద తగినంత మంది సిబ్బందిని నియమించడంతో పాటు తాగునీరు, వైద్య సదుపాయాలు, కల్పించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మూడు లక్షల మంది సెల్ ఫోన్లు వినియోగించే విధంగా శ్రీశైలంలో ఎయిర్టెల్, జియో ఫోన్ల సిగ్నల్ పెంపు చేసినట్లు తెలిపారు. 13,14,15వ తేదీల్లో ఎటువంటి టోల్ రుసుము లేకుండా శ్రీశైలంలోకి వాహనాలకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. అదే క్రమంలో 13,14,15 వ తేదీల్లో శ్రీశైలానికి 24 గంటలు ఫారెస్టు చెక్ పోస్టుల ద్వారా వాహనాలను అనుమతించినట్లు కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరన్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రెండు వేల మంది పోలీసు అధికారులు సిబ్బందితో విస్తృ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ ప్లాన్ అమలు చేస్తున్నామని తెలిపారు. లక్షలాది మంది భక్తులు వస్తున్నందున ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, ఘాట్ రోడ్లు, క్యూ లైన్ల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



**హనుమంతునిపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

దేశ వ్యాప్త సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు పిలుపునిచ్చిన సందర్భంగా గురువారం మండల కేంద్రంలో జిల్లా సీఐటీయు నాయకులు ఎస్‌డీ హనీఫ్ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించి అనంతరం స్థానిక సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా కార్మికులు వెళ్లి లేబర్ కోడ్ రద్దు చేయాలని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, జీతాలు పెంపు, స్కీం వర్కర్లందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస పెన్షన్ రూ.10000 ఇవ్వాలని, వీబీజీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి పాత ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్స్‌పై తహసీల్దార్ నాగుల్ మీరాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయు కన్వీనర్ లక్ష్మీదేవి, కత్తిఏబు, అంగన్‌వాడీ వర్కర్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎక్కంటి రాధమ్మ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుధారాణి, సీతారాములు, రాధా, ఆశా వర్కర్, చెన్నమ్మ, ఈవోఏ నాయకులు రాణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్, రాముడు, కొండయ్య, ఇతర స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంకు సత్కారం - వెలిగండ్ల సాయిబాబా ఆలయానికి ఫ్రిజ్ అందజేత



**వెలిగండ్ల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఒంగోలు రీజనల్ ఆఫీస్ ఏజీఎం శ్రీభీమరాఘవేంద్రం మార్గదర్శకత్వం, డీఎంశ్రీ రమేష్ సహకారంతో కెనరా బ్యాంకు వెలిగండ్ల బ్రాంచ్ సాయిబాబా ఆలయానికి ఫ్రిజ్‌ను అందించింది. బ్రాంచ్ మేనేజర్ డి.లోకేష్‌రావు సిబ్బందితో కలిసి ఆలయంలో ఫ్రిజ్‌ను ప్రారంభించారు. ఈ సత్కారానికి ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు కెనరా బ్యాంకుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పొదిలి నూతన ఎస్సైగా రాజేష్



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

పొదిలి పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా ఎస్.రాజేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రామాయపట్నం మెరెన్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తూ పొదిలికి బదిలీపై వచ్చారు. గత రెండు నెలలుగా ఎస్సై లేకపోవడంతో పట్టణంలో ప్రజలు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇన్‌చార్జి ఎస్సైగా కొనకనమిట్ల ఎస్సై శ్రీకాంత్ విధులు నిర్వహించారు. శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని నూతన ఎస్సై రాజేష్ తెలిపారు.

# దర్శిలో కార్మిక సమ్మె జయప్రదం

**- దర్శిలో భారీ ర్యాలీ - మూతపడిన బ్యాంకులు, ఎల్ఐసీ కేంద్ర సంస్థలు**

**- డిప్యూటీ తహసీల్దార్‌కి డిమాండ్స్‌తో వినతి**



**దర్శి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

దర్శి పట్టణంలో సీఐటీయు, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో అన్ని బ్యాంకులు, ఎల్ఐసీ, పోస్టల్ ఆఫీసులను మూయించి పట్టణంలో కార్మిక, ఉద్యోగ ప్రదర్శన నిర్వహించి, గడియారం స్తంభం సెంటర్‌లో మానవహారం తహసీల్దార్ ఆఫీసువద్ద ధర్నా నిర్వహించి డిమాండ్స్ తో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు తాండవ రంగారావు, కోటంశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం బ్రిటీష్ వాడిని మించిపోయి కార్మిక, ఉద్యోగులకు నష్టం చేసే లేబర్స్ కోడ్స్ అమలు చేస్తున్నారని, దీని వలన కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్ హక్కులు లేకుండా పోతాయని,పని గంటలు 8 నుంచి 12గంటలకుపెంచుతున్నారని,అన్ని రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా, అంగన్‌వాడీ, ఆటో మధ్యాహ్న భోజనం, పంచాయతీ, మున్సిపల్, ఎన్‌పీపీ, ఎల్ఐసీ ఏజెంట్లు, డీవైఎఫ్ఐ సంఘాల నాయకులు జాలా సుశీలా, బాల మరియమ్మ, శ్రీదేవి, తిరుపతమ్మ, కే.కరుణానిధి, శింగరకొండ శ్రీనివాసరావు, జయమ్మ, మల్లేశ్వరి, అంజమ్మ, సుజాత, శ్రీనివాసరావు,అలూరి ఇస్మాయిల్,గంగయ్య, గుంటు బాల గురవయ్య, ఇత్తడి కోటయ్య, యోహోషువ, నాగేశ్వరరావు, షేక్ కాలే భాషా, కేవీ పిచ్చయ్య పాల్గొన్నారు.

# ముండ్లమూరులో సమ్మె జయప్రదం



**ముండ్లమూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

సీఐటీయు రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రైవేటీకరణను ఆపాలని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపాలని 10గంటల పని విధానాన్ని రద్దు చేయాని ముండ్లమూరులో అంగన్‌వాడీ ఆశా ఈవోప స్వచ్ఛ భారత్ కార్మికులు గోపాలమిత్రాలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని జాతీయ సమ్మెను జయప్రదం చేసినందుకు సీఐటీయు నాయకులు బి.హనుమంతరావు, కే.తిరుపతమ్మ,రైతు సంఘం నాయకులు పి.కొండలు, జి.వెంకటేశ్వర్లు, జి.సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వి.ఆంజనేయులు, రామాంజనేయులు, ఆశా, తిరుపతమ్మ, రాజ్యం అంగన్‌వాడీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

## గొట్టిపాటి లక్ష్మీ ఆదేశాలతో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మారెళ్ళ



**దర్శి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

దర్శి మండలం రామచంద్రపురం గ్రామంలో పోలేరమ్మ గుడి వద్ద బోరు మరమ్మత్తులకు రాగా వెంటనే స్పందించి బోరు రిపేరు చేయించిన దర్శి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మారెళ్ళ వెంకటేశ్వర్లు అలాగే శానిటేషన్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మండల ఈఓఆర్డీ సుధాకర్‌తో కలిసి రామచంద్రాపురం గ్రామంలో పారిశుధ్య కార్మికులకు రేడియో జాకెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిత, మెకానిక్ వెంకటరావు, కృష్ణ, నాగిరెడ్డి, వెంకట్రామయ్య, గ్రీన్ అంబాసిడర్స్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన జాయింట్ కలెక్టర్‌ని కలిసిన బూచేపల్లి



**దర్శి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. అనంతరం పలు విషయాలపై చర్చించుకున్నారు.

# నేడు ప్రసన్నాంజనేయ స్వామి హుండీ లెక్కింపు

**అద్దంకి , ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా అద్దంకి మండలం సింగరకొండ శ్రీప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో 13వ తేది శుక్రవారం ఉదయం 9 గంటలకు హుండీ లెక్కింపు జరుగుతుందని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, పాలక మండల అధ్యక్షులు మురళీ సుధాకర్ రావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

# నాలుడు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయలని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరుతూ దేశ వ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు జే.జయంతిబాబు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. వాటి అమలు చేసేందుకు నవంబర్ 21వ తేదీ 2025లో ఉత్తర్వులు జారీ చేసిందని వాటిని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువస్తుందన్నారు. పాత కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం నిర్ణయించే అధికారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది, కానీ ప్రస్తుతం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌ల వలన ఆ అధికారాలను ఎత్తివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అవి అమలైతే పది సంవత్సరాలు వరకు జీతాలు పెరిగే అవకాశం లేదన్నారు. అదే విధంగా వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా కార్పొరేట్‌లకు అనుకూలంగా తెచ్చిన నల్లచట్టాలను వెనక్కి తీసుకునే వరకు రైతాంగం ఉద్యమం ఫలితంగా వెనక్కి తగ్గినప్పటికి తిరిగి మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత మోడీ విర్రవీగుతూ తిరిగి ఆ చట్టాలను అమలు చేసేందుకు పూనుకున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రమీల, పద్మ, వెంకట సుబ్బయ్య, రజని తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో కంటి వైద్య శిబిరం



**జరుగుమల్లి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అని జరుగుతుమల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ క్యావశ్రీ అన్నారు. కే.బిట్రగుంటలో ని కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ అంథత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా 17 మంది అర్హులైన విద్యార్థినులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి చూపు భాగున్నప్పుడే విద్యార్థులలో మానసిక స్థైర్యం, పోటీతత్వం మెరుగుపడతాయని అన్నారు. అతి ముఖ్యమైన కంటి చూపు పట్ల అత్యంత జాగ్రత్త వహించాలని మండల విద్యాశాఖ అధికారి నాగేంద్ర వదన్ అన్నారు. ఈ సందర్భంగా పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతో పాటు బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 మందికి జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5గురికి, చిర్రికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 16 మందికి, ప్రాథమిక పాఠశాలలో ఒకరికి ఈ ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వైద్యాధికారిణి కావ్యశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్రవంతి, సూపర్ వైజర్స్ తిరుపతమ్మ, చంద్రశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ శ్రీనాథ్, ఏఎన్ఎం ఫెబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొదిలి ఆర్టీసీ డిపోను తనిఖీ చేసిన ఆర్ఎం సత్యనారాయణ



**కొనకనమిట్ల, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

పొదిలి ఆర్టీసీ బస్ స్టేషన్ ను ఒంగోలు ఆర్టీసీ ఆర్ఎం జి.సత్యనారాయణ శుక్రవారం తనిఖీ చేశారు. బస్ స్టేషన్‌లో ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా పరిశీలించారు. బస్టాండ్ భవ్యిత్తులో ఏర్పాటు చేయాల్సిన మౌలిక వసతులపై ప్రయాణికుల నుండి సూచనలు తీసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. శ్రీశక్తి పథకం విజయవంతంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా పొదిలి డిపో నుండి శ్రీశైలం, త్రిపురాంతకం, రామతీర్థం, కోటప్పకొండలకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారని, అలాగే పాకల బీచ్ ఫెస్టివల్ సందర్భంగా 14,15వ తేదీల్లో స్పెషల్ బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆర్టీసీ కల్పిస్తున్న సౌకర్యాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వి.శంకరరవు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# 14న శ్రీరంగనాయక స్వామివారి మాస కళ్యాణం



**రాచర్ల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**

మండలంలోని జెపి చెరువు సమీపంలోగల శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీన (శనివారం) శ్రీ స్వామివారి మాస కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో మల్లవరపు నాగయ్య, చైర్మన్ సిద్ధం నరసింహులు గురువారం తెలిపారు. కల్యాణంలో పాల్గొనదలచిన దంపతులు రూ.1,516లు కళ్యాణ కట్టడి చెల్లించి రశీదు పొందాలని, సంప్రదాయ దుస్తుల్లో కళ్యాణంలో పాల్గొనాలని వారు కోరారు.

## కష్టించి పనిచేసే ఉద్యోగుల,కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దు



**అద్దంకి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి తీసుకొచ్చిన నాలుగు లేబరు కోడ్స్ అమలులోకి తెస్తూ విడుదల చేసిన గెజిట్ కు నిరసనగా గురువారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా అద్దంకి ఎల్ఐసి బ్రాంచ్ నందు బిఎం సంఘీభావం మేరకు బ్రాంచ్ మూసివేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కేవలం కార్పొరేటర్లకు అనుకూలంగా తయారుచేసిన 4 లేబర్ కోడ్ బిల్లులను రద్దుచేసి పాత 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని, కార్మికులందరికీ కనీసం 26 వేలు వేతనం ఇవ్వాలని, ఎల్ఐసి తోపాటు విశాఖ స్టీల్, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ A.అమర్నాథ్, సెక్రటరీ శివనాయక్, కృష్ణమోహన్ డివియం సత్యనారాయణ, రవి, మల్లిక్,జోష్నా, సహన, ఏసుబాబు, DO లు హరీష్ రాంబాబు, రాజశేఖర్‌రెడ్డి, లియాఫీ అధ్యక్ష కార్యదర్శులు కోట శ్రీనివాసరావు, డి సుబ్బారావు, మన్నం త్రిమూర్తులు, మురళి, నాగేశ్వరరావు మొదలగువారు పాల్గొన్నారు .

# అద్దంకిలో బంద్ సందర్భంగా భారీ ర్యాలీ

**- లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలి ఉపాధి హామీ పాత పద్ధతితో కొనసాగించారు**

**- రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి - సభలో సి.ఐ.టి.యు. నేతల డిమాండ్**





**అద్దంకి, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**

లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకం యధావిధిగా పాత పద్ధతిలో కొనసాగించాలని, రైతులకు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం దేశవ్యాప్తంగా కార్మిక, రైతు, కర్షక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మె అద్దంకిలో జయప్రదంగా జరిగింది. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు. ఆధ్వర్యంలో స్థానిక భవాని సెంటర్ నుండి 12రంగాలకు చెందిన కార్మికులు ఎర్ర జెండా చేతపట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆర్ డి ఓ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీఐటీయు నాయకులు పి తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే విధంగా అవలంబిస్తున్నాయని లేబర్ కోడ్ బిల్లును వెంటనే రద్దు చేయాలని కార్మికచట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల గొంతు నొక్కే విధానాలను ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయని ఈ విధానాలను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. 1886లో అమెరికా చికాగోలో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల ఆధారంగా ఏర్పడిన కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయి అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో కార్మికుల ది కీలక పాత్రగా ఉందని కష్టజీవులు, రైతులు, కార్మికులు, శ్రమ ఫలితంగానే సంపదను సృష్టిస్తున్నారని అలాంటి శ్రమజీవులు పైన ఉక్కు పాదం మోపి కార్పొరేటు శక్తులకు వూడిగం చేసే విధానాలను దేశంలో అమలు చేయటం దుర్మార్గం అన్నారు. వెంటనే లేబర్ కోడ్ బిల్లును రద్దు చేయాలని లేని పక్షంలో కార్మిక ఉద్యమాలు ఉదృతం చేయనున్నట్లు హెచ్చరించారు. దేశంలోనే కేరళ రాష్ట్రం కార్మిక వర్గ వామపక్ష ప్రభుత్వం అయిన కేరళ రాష్ట్రంలో లేబర్ కోడ్ బిల్లును అమలు పరచమని చెప్పటం జరిగిందని ఆ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని ఆంధ్ర రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా లేబరు కోడ్ బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చడంతో పాటు వ్యవసాయ కార్మికులకు పని హక్కు లేకుండా చేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 13 నెలలు పోరాడి రైతు చట్టాలను వెనక్కి కొట్టిన రైతులకు ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్మిక వర్గం ఐక్యమై పోరాటాలకి సిద్ధం కావాలని సందర్భంగా కార్మికులకు పిలుపునిచ్చారు. యు.టీ ఎఫ్ నాయకులు బి వి రత్నం, ఏపీ ఎన్ జి ఓ నాయకులు కిరణ్, ఎల్ ఐ సి నాయకులు తదితరులు మాట్లాడి సమ్మె కు సంగిభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ తంగిరాల వెంకటేశ్వర్లు, పంగులూరు సిఐటియు నాయకులు ఎస్ మల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు టి రామారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి ఆదాం, ఉసిరిపాటి శామ్యూల్,వివో ఏ యూనియన్ నాయకులు కృష్ణకుమారి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు జి.శారద, కొరిశపాడు అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు వరలక్ష్మి, మనోలత, రావమ్మ, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ సంతమాగులూరు ప్రాజెక్టు నాయకులు జంగం చిన్నమ్మాయి, కోటేశ్వరమ్మ,ఎస్తేరురాణి,శ్రీదేవి,ఆశావర్కర్ నాయకులు, బల్లికురవ వరలక్ష్మీ, వెంకటలక్ష్మి, మరియమ్మ, కమల, మధ్యాహ్న భోజన పథకం నాయకులు కోటేశ్వరమ్మ, వీఆర్ఏ యూనియన్ నాయకులు స్వాములు, నరసింహారావు,ముఠా వర్కర్ నాయకులు నరసింహారావు,ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆర్టిసి నాయకులు డిఎ సుబ్బారావు, ఫ్రూట్స్ వండర్స్ యూనియన్ నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, తదితర కార్మిక యూనియన్ నాయకులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వెల్లలచెరువు యువకుడు గుంటూరులో దుర్మరణం



**సంతమాగులూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**

మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన దూదేకుల మదార్ వలి (39)జిల్లా కేంద్ర మైన గుంటూరులో కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు బైక్ పై నుండి పడి దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం దూదేకుల మదార్ వలి కరోనా కాలంలో బ్రతుకు దెరువు కోసం పనుల నిమిత్తం జిల్లా కేంద్రమైన గుంటూరు లో జీవనం సాగిస్తున్నాడు.గత ఆదివారం రోజు మాదిరిగానే పని నిమిత్తం బైక్ పై వెళ్తున్న క్రమంలో కుక్క ను తప్పించబోయి కింద పడటంతో తలకు బలమైన గాయలైనాయి. సమీపంలో వున్న వారు వెంటనే గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మదార్ వలికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె వున్నారు. మదార్ వలి మృతి చెందటం పట్ల వెల్లలచెరువు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## సచివాలయం ఉద్యోగులకు ప్రమోషన్

**- గ్రేడ్1 వీఆర్వోలుగా శామ్యూల్, చైతన్య**



**సంతమాగులూరు, ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**

మండలంలో సచివాలయం వీఆర్వోలుగా పనిచేస్తున్న బయ్యవరపు శామ్యూల్, ఏలూరు చైతన్యలు గ్రేడ్ 1 వీఆర్వోలుగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా తహశీల్దార్ కే రవిబాబు ఇరువురికి గురువారం నియామక పత్రాలు అందించారు. పదోన్నతి పొందిన ఇరువురు బి సామ్యూల్‌ను సజ్జాపురం గ్రామానికి, ఏలూరు చైతన్య ను ఏల్చూరు గ్రామానికి నియమించినట్లు తహశీల్దార్ రవిబాబు తెలిపారు.ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆయన సూచించారు. మండలంలోని 21 మంది వీఆర్వోలలో వీరిరువురికీ పదోన్నతి లభించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా పదోన్నతి పొందిన విఆర్వోలు రవి బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ తేలప్రోలు రమేష్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యాలయంలో వీఆర్వోల సంఘం అధ్యక్షులు సయ్యద్ కరీం, ఉపాధ్యక్షులు రామబ్రహ్మం వారికి ప్రత్యేక అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరెంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం రెవిన్యూ సిబ్బందికి మిఠాయిలు పంచి పెట్టారు.

## బాలికకు ధృవీకరణ పత్రాలు అందజేసిన తహశీల్దార్



**అద్దంకి , ఫిబ్రవరి 12,ప్రభాతవార్త**

మండలంలోని మణికేశ్వర గ్రామం లో అల్లడి ప్రణీతి సునైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతుండగా వారి కుటుంబసభ్యుల రేషన్ కార్డులో బాలిక పేరు లేకపోవడంతో ఈ విషయం మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన మంత్రి వెంటనే ఆ విషయమై తగుచర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను అదేశించారు. ఆమేరకు తహశీల్దార్ శ్రీచరణ్ గురువారం తల్లిదండ్రుల రేషన్‌కార్డులో బాలికను పొందుపరచి సంబంధిత సర్టిఫికేట్‌ను బాలిక తండ్రి అల్లడి ఏడుకొండలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకులు కరిముల్లా, బడావలి, తదితరులు పాల్గొన్నారు.

13-2Pg 9_13-2Pg5.qxd 12/Feb/26 10:09 PM Page 1



# రంగంలోకి కొత్త 'రాఫెల్' విమానాలు!



### రూ.3.25 లక్షల కోట్లతో 114 జెట్ ఫైటర్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### 17న ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ రాక

### 8 డోర్నియర్ విమానాల కోసం హెచ్ఎఎల్‌తో ఎంఒయు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత వైమానిక దళం కోసం ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలనే రూ.3.25 లక్షల కోట్ల ప్రతిపాదనకు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నిర్వహించిన రక్షణ సముపార్జన మండలి (డిఎసి) రాఫెల్ జెట్ విమానాల కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ రాబోయే ఢిల్లీ అధికారిక పర్యటనకు ముందు ఈ అనుమతి లభించింది. మెక్రాన్ ఈ నెల 17న భారత పర్యటనకు వస్తున్న విషయం తెలిసిందే. రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన తర్వాత, ఈ ఒప్పందానికి చివరికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగే భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ నుండి అనుమతి అవసరం. ప్రతిపాదన ప్రకారం, భారత్, ఫ్రెంచ్ రక్షణ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ నుండి 18 ఆఫ్‌దిషెల్ఫ్ రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేస్తుంది. మిగిలిన 96 యుద్ధ విమానాలు భారతదేశంలో తయారు చేయబడతాయి. ఇంకా, ఈ జెట్‌లలో కొన్ని శిక్షణ కోసం ఉపయోగించబడే జంటసీట్ల విమానాలు. ఈ ఒప్పందంలో అత్యాధునిక యుద్ధ జెట్ సాంకేతికతను బదిలీ చేయడం, 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి పూరకంగా వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంటుంది.

భారత వైమానిక దళం ఇప్పటికే రెండు స్క్వాడ్రన్‌లను కలిగి ఉన్న 36 రాఫెల్‌లను కలిగి ఉంది, 'సి' వేరియంట్ చివరి డెలివరీ డిసెంబర్ 2024లో జరిగింది. అయితే, 'ఎం' వెర్షన్ మరో 26 రాఫెల్ జెట్‌లను కూడా భారత నౌకాదళం కోసం రూ. 63,000 కోట్ల విలువైన ఒప్పందంలో ఆర్డర్ చేశారు. నావికా వేరియంట్‌లను విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్. ఐఎన్ఎస్ విక్రమాదిత్య నుండి నిర్వహిస్తారు. ఆ ఒప్పందంలో ఎంఆర్ఓ (నిర్వహణ, మరమ్మత్తు, సమగ్ర పరిశీలన) ఒప్పందం కింద విమానాల నిర్వహణ, లాజిస్టిక్స్ మద్దతు, సిబ్బంది శిక్షణను సులభతరం చేయనుంది.

**ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌ల వినియోగం**

మే 2025లో పహల్గామ్ ఉగ్రవాద దాడికి భారత్ సైనికచర్యలో భాగంగా పాకిస్తాన్‌లోని ఖచ్చితమైన లక్ష్యాలను ఛేదించడానికి ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ జెట్‌లను విజయవంతంగా ఉపయోగించారు. 250 కి.మీ కంటే ఎక్కువ దూరంలోని నిర్దేశిత లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో ఛేదించగల ఎస్‌సిఎఎల్‌పి అనే వాయుప్రయోగ క్రూయిజ్ క్షిపణిని ప్రయోగించడానికి వీటిని ఉపయోగించారు. అత్యాధునిక యుద్ధ విమానం, రాఫెల్, మెటియోర్ లాంగ్‌రేంజ్ గగనతలం నుంచి గగనతలం క్షిపణులు, స్టాండ్‌ఆఫ్ స్ట్రైక్ ఆయుధం హామర్, అధునాతన ఇవార్‌ఫేర్ సూట్ అయిన స్పెక్ట్రా, అలాగే అధునాతన రాడార్, లక్ష్య వ్యవస్థలను కూడా మోసుకెళ్లగలదు.

**8 డోర్నియర్ 228 విమానాల కోసం కేంద్రం హెచ్ఎఎల్‌తో ఒప్పందం**

ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కోసం ఎనిమిది డోర్నియర్ 228 విమానాలను, ఆపరేషనల్ రోల్ పరికరాలను రూ.2,312 కోట్లకు కొనుగోలు చేయడానికి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్)తో ఒప్పందంపై సంతకం చేసినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. ఈ ఆర్డర్ హెచ్ఎఎల్ ఉత్పత్తి పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఇలు, అనుబంధ పరిశ్రమల విస్తృత నెట్‌వర్క్‌కు మద్దతు ఇవ్వడం ద్వారా గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని సృష్టిస్తుందని భావిస్తున్నారు. ఇది నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్‌హాల్, లైఫ్ సైకిల్ సాంకేతిక మద్దతులో స్థిరమైన అవకాశాలను కూడా సృష్టిస్తుందని అధికారిక ప్రకటన తెలిపింది. రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో బై (ఇండియన్) కేటగిరీ కింద ఒప్పందంపై సంతకం చేశారు.



## బంగ్లా ఎన్నికల్లో బిఎన్పీ కూటమి క్లీన్‌స్వీప్!

# ప్రధాని రేసులో తారిక్ రెహమాన్

**ఢాకా, ఫిబ్రవరి 12:** బంగ్లాదేశ్‌లో అత్యంత కీలక ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ దేశ దశ దిశను మార్చే ఎన్నికలుగా ఇవి ఉండబోతున్నాయి. షేక్ హసీనా 2024లో జరిగిన హింసాత్మక ఘర్షణల తర్వాత, తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మరోవైపు, తాత్కాలిక పాలకుడిగా వచ్చిన మహ్మద్ యూనస్ పచ్చి భారత వ్యతిరేక వైఖరిని అవలంభించాడు. భారత్‌ను వ్యతిరేకిస్తూ, పాకిస్తాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకున్నాడు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బంగ్లా వ్యాప్తంగా ఇస్లామిస్టులు రాజ్యమేలుతున్నారు. మతోన్మాద దాడులు, హిందువులపై అకృత్యాలు నిత్యకృత్యంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ ఎన్నికలకు చాలా ప్రధాన్యత ఏర్పడింది. ఈసారి ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ కూటమికి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. ఇక షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను యూనస్ సర్కార్ నిషేధించింది. జమాత్ నేతృత్వంలో 11 పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. 17 ఏళ్ల ప్రవాసం తర్వాత బంగ్లాదేశ్ వచ్చిన మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు తారిక్ రెహ్మాన్ బంగ్లాదేశ్ ప్రధాని రేసులో ముందు వరసలో ఉన్నాడు. ఈసారి డబుల్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగనున్నాయి. దీంట్లో ఒక ఓటు ఎంపీకి, మరో ఓటు జులై చార్టర్ రిఫరెండం కోసం. ఈ రిఫరెండం ద్వారా ప్రధాని అధికారాలపై ఆంక్షలు, జ్యుడీషియరీ స్వాతంత్రంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతారు. బంగ్లాదేశ్‌లో 350 సీట్లు ఉండగా, ఇందులో 299 స్థానాలకు పోలింగ్ జరిగింది. 50 స్థానాలు మహిళలకు కేటాయించారు. వీటికి పరోక్షంగా ఎన్నికలు జరుగుతాయి. ఢాకా ట్రిబ్యూన్ రిపోర్ట్ ప్రకారం బీఎన్‌పీ అలయన్స్ 208 సీట్లు సాధించి, క్లీన్ స్వీప్ చేస్తుందని చెబుతోంది. జమాత్ అలయన్స్‌కు 46 సీట్లు, జాతియా పార్టీకి 3 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఓట్ షేర్ ప్రకారం చూస్తే బీఎన్‌పీకి 66.3 శాతం, జమాత్‌కు 11.9 శాతం ఓట్లు సాధించే ఛాన్స్ ఉందని చెప్పింది. ఎన్ఆర్‌సీ సర్వే ప్రకారం బీఎన్‌పీ 77 శాతం ఓట్ షేర్‌తో 220 సీట్లు గెలుస్తుందని, జమాత్ 57 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని వెల్లడించింది. ప్రోథోం ఆలో రిపోర్ట్ మాత్రం బీఎన్‌పీ, జమాత్ మధ్య తీవ్రమైన పోటీ ఉంటుందని చెప్పింది. జమాత్ అలయన్స్ 105 సీట్లు, బీఎన్‌పీ అలయన్స్ 101 సీట్లు గెలుస్తుందని చెప్పింది. ఓట్ షేర్ బీఎన్‌పీకి 44.1 శాతం, జమాత్ అలయన్స్ 43.9 శాతం వస్తుందని అంచనా వేసింది. 77 సీట్లలో ఇద్దరి మధ్య టఫ్ ఫైట్ ఉంటుందని చెప్పింది.



## టర్కీ పార్లమెంట్‌లో ఫైటింగ్..

# కొట్టుకున్న అధికార-విపక్ష ఎంపిలు

**అంకారా, ఫిబ్రవరి 12:** టర్కీ పార్లమెంట్ రణరంగంగా మారింది. ప్రజాప్రతినిధులు వీధి రౌడీల్లా కొట్టుకున్నారు. పిడిగుద్దులు గుద్దుకుంటూ.. తన్నుకుంటూ నానా రభస చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విడియో వైరల్ అవుతోంది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్ అకిన్ గుర్లెక్ పార్లమెంట్‌లో న్యాయ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతుండగా ప్రతిపక్ష ఎంపీలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అధికార-ప్రతిపక్ష ఎంపీలు ఒకరినొకరు కొట్టుకోవడం.. తన్నుకుంటూ కనిపించారు. చాలాసేపు ముష్టి యుద్ధం జరిగింది. ఇస్తాంబుల్ చీఫ్ ప్రాసిక్యూటర్‌గా గుర్లెక్.. ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీకి చెందిన అనేకమంది సభ్యులపై ఉన్నతస్థాయి విచారణలకు అధ్యక్షు వహించారు. ప్రతిపక్షం చాలాకాలంగా ఈ విచారణలను రాజకీయంగా ప్రేరేపించబడ్డాయని విమర్శిస్తోంది. ఇప్పుడు టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్.. అకిన్ గుర్లెక్‌ను న్యాయమంత్రిగా నియమించింది. బుధవారం ఆయన ప్రమాణస్వీకారం చేస్తుండగా ప్రతిపక్షాలకు ఆగ్రహం తెప్పించింది. ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ నియంత్రణలో ఉన్న మునిసిపాలిటీలకు చెందిన వందలాది మంది అధికారులను అవినీతి దర్యాప్తులో అరెస్టు చేశారు. వీరిలో ఇస్తాంబులక్ష మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లు కూడా ఉన్నారు. ఆయనను గత సంవత్సరం అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలకు కోపం తెప్పించింది.

# ట్రంప్-నెతన్యాహు కీలక భేటీ

## ఇరాన్ అణు ఒప్పందంపై రహస్య చర్చలు

**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అగ్రరాజ్యంలో పర్యటన ఆసక్తి రేపుతోంది. బుధవారం వైట్‌హౌస్‌లో మూడు గంటలపాటు ట్రంప్- నెతన్యాహు రహస్యంగా సమావేశం అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇక ఇద్దరి సమావేశం తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియాలో కీలక వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్‌తో చర్చలు జరుగు తున్నాయని.. దౌత్యం అనిశ్చితంగానే ఉందని తెలిపారు. చర్చలు విఫలమైతే సమన్వయం కొనసాగుతుందని సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌తో నిరంతర చర్చలకు ఒత్తిడి తెచ్చానని.. ఇప్పటికీ చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తానికి వార్నింగ్‌ల దగ్గర నుంచి చర్చలకు ట్రంప్ తెరలేపారు. డిసెంబరు 28 నుంచి ఇరాన్‌లో ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తిరుగుబాటు చేశారు. పెద్ద ఎత్తున హింస చెలరేగింది. ఇక భద్రతా దళాల కాల్పుల్లో 30 వేల మంది చనిపోయారు. దీంతో ట్రంప్ రంగంలోకి దిగి.. నిరసన కారులను చంపితే సైనిక చర్యకు దిగుతామని హెచ్చరించారు. అన్నట్టుగానే యుఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌక అరేబియా సముద్రానికి వచ్చి మోహరించింది. తక్షణమే అణు ఒప్పందం చేసుకోవాలని ఇరాన్‌పై ట్రంప్ తీవ్ర ఒత్తిడి చేశారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రంప్-నెతన్యాహు



భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలా ఉంటే అమెరికా నేతృత్వంలో ఏర్పడిన బోర్డ్ ఆఫ్ పీస్‌లో ఇజ్రాయెల్ చేరింది. చాలా రోజుల తర్జన భర్జన తర్వాత నెతన్యాహు సంతకం చేశారు. ఈ ఫోరమ్‌లో పాశ్చాత్య భాగస్వాములతో పాటు టర్కీ, ఖతార్ కూడా ఉన్నాయి. గతంలో గాజాలో వారి పాత్రపై ఇజ్రాయెల్ విమర్శలు చేసింది. మొత్తానికి శాంతి మండలిలో ఇజ్రాయెల్ చేరింది.

# రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేయాలి

## బిజెపి ఎంపి నిశికాంత్ దూబె




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె డిమాండ్ చేశారు. ఈ మేరకు అతని సభ్యత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ నోటీసు ఇచ్చారు. ఇంకా ప్రచురితం కాని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎంఎం నరవణె పుస్తకం సహా పలు వివాదాస్పద అంశాలపైనా రాహుల్‌గాంధీ, బిజెపి ఎంపిల మధ్య తీవ్ర వాగ్వాదం నడిచిన సంగతి తెలిసిందే. రాహుల్ గాంధీకి ఎవరు నిధులు ఇస్తున్నారు? ఆయన చేతికి ప్రచురితం కాని పుస్తకం ఎలా వచ్చింది? భారత వ్యతిరేక శక్తులతో ఆయన సంబంధాల గురించి ఆ నోటీసులో ప్రస్తావించారు. లోక్‌సభలో రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి అని దూబె అన్నారు. అయితే ఆయనపై సభా హక్కుల తీర్మానం తీసుకురావడం లేదని చెప్పారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రస్తావన తీసుకువచ్చారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను అధికారపక్షం నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ పదాలను తొలగించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆయన చేసిన ఆరోపణలకు ఎలాంటి ధృవీకరణ లేదని పేర్కొన్నాయి.

# సేవాతీర్థ్ కాంప్లెక్స్‌కు మారుతున్న నార్త్,సౌత్ బ్లాక్‌లు!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** దేశ రాజధాని ఢిల్లీలోని బ్రిటీష్ కాలం నాటి ఆఫీసు బిల్డింగ్‌లు ఉన్న నార్త్, సౌత్ బ్లాకులను శుక్రవారం పూర్తిగా ఖాళీ చేయనున్నారు. ప్రధానమంత్రి కార్యాలయం కూడా కొత్తగా నిర్మించిన సేవా తీర్థ్ కాంప్లెక్స్‌కు మారనున్నది. ఆఫీసును మార్చడానికి ముందు శుక్రవారం ప్రధాని మోదీ చివరిసారి క్యాబినెట్ భేటీ ఏర్పాటు చేయనున్నారు. రేపు సాయంత్రం 4 గంటలకు పాత ఆఫీసులో ఆ భేటీ ఉండనున్నది. ఢిల్లీలోని ల్యూటెన్స్ రైసినా హిల్స్‌లో ఉన్న సౌత్ బ్లాకులో చివరిసారి కేంద్ర క్యాబినెట్ భేటీ జరగనున్నది. నార్త్ బ్లాక్ నుంచి కేంద్ర హోంశాఖ కార్యాలయాన్ని పూర్తిగా షిఫ్ట్ చేశారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియేట్‌లోని 347 రూమ్ కాంప్లెక్స్‌కు హోంశాఖను తరలించారు. ఒక్క పీఎంవో మినహా ఆ కాంప్లెక్స్‌లో అన్ని ప్రభుత్వ మంత్రులు, శాఖల ఆఫీసులు ఉన్నాయి. సెంట్రల్ ఢిల్లీలోని ప్రత్యేక కాంప్లెక్స్‌లో పీఎంవోను నిర్మించారు. పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్ అని పిలవనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 13వ తేదీన జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ సేవాతీర్థ్, కర్తవ్యభవన్1,2లను ఆవిష్కరిస్తారని ప్రభుత్వం గురువారం ఓ ప్రకటన రిలీజ్ చేసింది. కొత్త ఆఫీసు బిల్డింగ్‌ను ప్రారంభించడంతో భారతీయ అధికార పరిపాలనా విభాగంలో కొత్త మైలురాయి చేరు కున్నట్లు అవుతుంది. ఆధునిక, పటిష్టమైన, సౌకర్యవంతమైన పరి పాలనా వ్యవస్థను అందిచే ఉద్దేశంతో కొత్త బిల్డింగ్ లను నిర్మించినట్లు అధి కారులు పేర్కొన్నారు. గతంలో దూరం దూరం గా ఉన్న వివిధ శాఖల ఆఫీసులను ఇప్పుడు ఒకే దగ్గరికి తీసుకువచ్చారు. పరిపాలనను మరింత సులభం చేయాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సేవా తీర్థ్‌లో ప్రధానమంత్రి కార్యాలయం, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటేరియేట్, క్యాబినెట్ సెక్రటేరియేట్ ఉంటాయి. గతంలో ఇవన్నీ వేర్వేరు ప్రాంతాలను నుంచి ఆపరేట్ అయ్యేవి. ఇక కర్తవ్య్ భవన్ 1,2లో కీలక మంత్రిత్వశాఖల ఆఫీసులు ఉంటాయి. ఆర్థిక, రక్షణ, ఆరోగ్య, కార్పొరేట్ సర్వీసెస్, విద్య, సంస్కృతి, న్యాయ, సమాచార ప్రసార, వ్యవసాయ, రసాయనిక, గిరిజన శాఖ ఆఫీసులు ఉంటాయి. అన్ని ఆఫీసుల మధ్య డిజిటల్ ఇంటిగ్రేషన్ ఉంటుంది. ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాకుల వద్ద ప్రపంచ స్థాయి మ్యూజియంను నిర్మించనున్నారు. యుగే యుగే భారత్ మ్యూజియంలో భారతీయ నాగరికత ప్రయాణాన్ని చిత్రీకరించనున్నారు. అయితే ఇప్పటికే నార్త్ బ్లాక్ వద్ద మ్యూజియం పనులు ప్రారంభమైనట్లు తెలుస్తున్నది.

## భూమి దిశగా దూసుకొచ్చిన స్విఫ్ట్ అబ్జర్వేటరీని ఆపిన నాసా



**వాషింగ్టన్, ఫిబ్రవరి 12:** నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడి వల్ల ఇది తన కక్ష్య నుంచి భూమి వైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తు నుంచి ఇది 400 కి.మీ. కిందికి చేరింది. దీంతో అట్మాస్ఫెరిక్ డ్రాగ్ (స్పేస్‌క్రాఫ్ట్ శక్తిని కోల్పోయేలా చేస్తుంది)ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో దీన్ని ప్రయోగించింది. సోలార్ యాక్టివిటీ వల్ల భూ ఎగువ వాతావరణం వేడెక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్య నుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరి నాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టే వరకు ఆ టెలిస్కోప్‌ను 300 కి.మీ. ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్ఫెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది. కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం ఆరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌తో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్‌క్రాఫ్ట్ (కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థ)ను పంపించనుంది. ఇది స్విఫ్ట్‌ను 600 కి.మీ. ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్ల సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సంగ్రహించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.

# ఎర్రకోట దాడి వెనుక జైషే హస్తం

## ఐక్యరాజ్యసమితి సంచలన నివేదిక



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై ఐక్యరాజ్యసమితి కీలక నివేదిక ఇచ్చింది. ఈ పేలుడుకు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న జైషే మహ్మద్ ఉగ్ర ముఠాతో సంబంధం ఉందని పేర్కొంది. ఆర్థిక ఆంక్షలు, అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ జైషే సహా పలు ఉగ్ర ముఠాలు దక్షిణాసియాలో క్రియాశీలకంగా తమ నేర కార్యకలాపాలు సాగిస్తున్నాయని వెల్లడించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన నివేదికలో ఈ విషయాలు ప్రస్తావించింది. ఆంక్షలు ఉన్నప్పటికీ జైషేముఠా పలు ఉగ్రదాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. అందులో ఒకటి 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన దాడి అని ఐక్య రాజ్యసమితి సభ్య దేశం ఒకటి ఆరోపించింది. ఇక అంతర్జాతీయ నిఘా నుంచి తప్పించుకునేందుకు జైషే కొత్త పన్నాగాలు పన్నుతోంది. గతేడాది జమాత్ ఉల్ ముమినత్ పేరుతో మహిళా వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. ఇలా చాలా ఆందోళనకర పరిణామం అని ఐక్యరాజ్య సమితి తమ నివేదికలో పేర్కొంది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో జరిగిన పహల్గాం ఘటనను కూడా ఐక్యరాజ్య సమితి తన నివేదికలో ప్రస్తావించింది. ఆ దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులు హతమైనట్లు తెలిపింది. జైషే, లష్కరే తోయిబా వంటి ఉగ్ర ముఠాలు ఉనికిలో లేవని గత కొంతకాలంగా పాకిస్తాన్ పదే పదే వాదిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నివేదికతో దాయాది పాక్ వక్రబుద్ధి మరోసారి బయటపడినట్లయింది. ఎర్ర కోట వద్ద పేలుడు ఘటనపై ఎన్ఐఎ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులో వచ్చాయి.

## సంక్షిప్తంగా..

### 3వ తరగతి నుంచే విద్యార్థులకు ఎఐ యాక్సెస్: కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12 :** ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో మాదిరి విద్యారంగంలోను కృత్రిమ మేధ విస్తరిస్తుంది. ఈ కొత్త ఎఐ విధానాన్ని భారత్‌లోని విద్యార్థులందరికీ చేరువ చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశంలో 30 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారని, 3వ తరగతి నుంచి అధునాతన పరిశోధనలు నిర్వహించే విద్యార్థుల వరకు ఈ కృత్రిమ మేధ అందుబాటులో ఉంటుందన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఎఐ కాంక్లేవ్ - 2026 సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎఐ రంగంలో భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. ఇక్కడ మేధో సామర్థ్యానికి లోటు లేదని, కృత్రిమ మేధకు సంబంధించి పలు పరిశోధనలు జరుగుతున్నాయని వెల్లడించారు. భారత్‌లో గణనీయమైన యువశక్తి ఉందన్నారు.

### తొలితరం న్యూస్ యాంకర్ సరళామహేశ్వరి కన్నుమూత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** భారత టెలివిజన్ రంగంలో సుపరిచితురాలు, దూరదర్శన్ సీనియర్ న్యూస్ యాంకర్ సరళా మహేశ్వరి (71) కన్నుమూశారు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ నేషనల్ చానల్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆమె సౌమ్యమైన స్వరం, స్పష్టమైన ఉచ్చారణ, వార్తలను హుందాగా అందించే తీరుతో భారతీయ వార్తా ప్రపంచంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని నివాళి అర్పించింది. దూరదర్శన్ కుటుంబం తరఫున సరళా మహేశ్వ రికి హృదయపూర్వక నివాళులు. ఆమె తన సరళత, హుందాతనంతో వీక్షకులలో చెరగని ముద్ర వేశారు" అని డీడీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. సరళాతో కలిసి పనిచేసిన సీనియర్ యాంకర్ షమ్మీ నారంగ్ కూడా ఆమె మృతిపై విచారం వ్యక్తం చేశారు.

### డికె సిఎం కావాలంటున్న 90 మంది ఎమ్మెల్యేలు!



**బెంగళూరు, ఫిబ్రవరి 12:** డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావాలని 80 నుంచి 90 మంది ఎమ్మెల్యేలు కోరుకుంటు న్నారని కర్ణాటక కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ పునరుద్ఘాటించారు. కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ముఖ్యమంత్రి మార్పు అంశంపై చర్చ సాగుతోంది. ఈరోజు ఇక్బాల్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కోసం శివకుమార్ చేసిన కృషికి ఆయన ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోవాలని చాలామంది ఎమ్మెల్యేలు ఆశిస్తున్నారని అన్నారు. కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శివకుమార్‌కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. 140 మంది ఎమ్మెల్యేలు మార్పును ఆశిస్తున్నారని, 80 నుంచి 90 వరకు ఎమ్మెల్యేలు ఈ అంశంపై చర్చించుకుంటున్నారని, తామంతా మద్దతిస్తున్నామని అన్నారు.

### వారసురాలిగా కూతురు కిమ్‌జ్యూయే!



**ప్యాంగ్యాంగ్, ఫిబ్రవరి 12:** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ వారసురాలిగా ఆయన కూతురు కిమ్ జు యే ను ఎంపిక చేసినట్లు దక్షిణ కొరియా వెల్లడించింది. ఈ విషయాన్ని కిమ్ ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, కిమ్ తన కుమార్తెనే దేశాధినేతగా నిర్ణయించారని దక్షిణ కొరియాకు చెందిన నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రకటించింది. ఈ అంశాన్ని దక్షిణ కొరియా తన దేశంలోని చట్టసభల నేతలకు తెలిపింది. ఉత్తర కొరియాలో ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే కాంగ్రెస్ సమావేశం ఈ నెల చివరిలో జరగనుంది. ఈ నేపథ్యంలో దేశానికి కొత్త నాయకత్వం ఎవరూ అనే అంశంపై చర్చ జరుగుతుండగా అనేక పేర్లను పరిశీలించిన కిమ్ తన కూతురును భవిష్యత్ నాయకురాలిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆమెకు ఈ అంశంపై తగిన శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం.

# సైబర్ మాఫియా గుట్టురట్టు చేసిన కాంబోడియా

**నాంఫే, (కాంబోడియా), ఫిబ్రవరి12:** సినిమా తెరపై కనిపించే భయానక సామ్రాజ్యాలను తలపించేలా కంబోడియా సరిహద్దుల్లో సాగుతున్న ఒక భారీ సైబర్ నేర సామ్రాజ్యాన్ని థాయ్‌లాండ్ పోలీసులు రట్టు చేశారు. కేజీఎఫ్ సినిమాలోని గనుల మాదిరిగా, వందల మంది యువతను బంధించి, ప్రైవేటు సైన్యంతో కాపలా పెట్టి, రోజుకు 18 గంటల పాటు బలవంతంగా పని చేయిస్తున్న తీరు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తోంది. ఒస్మాచ్ పట్టణంపై థాయ్ సైన్యం చేపట్టిన వ్యూహాత్మక దాడిలో ఆరు అంతస్తుల భారీ భవన సముదాయం బయటపడింది. బయటకు ఐటీ కంపెనీలా కనిపించే ఈ భవనం లోపల అసలు సిసలు సైబర్ మోసాల కర్మాగారం నడుస్తోందని అధికారులు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో మానవ అక్రమ రవాణా ముఠాల ద్వారా వివిధ దేశాల యువతను అక్కడికి రప్పించి, వారి పాస్‌పోర్టులను లాక్కుని బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచేశారు. వారిని నిర్బంధించి డిజిటల్ అరెస్టులు, బ్యాంకు మోసాలు, ఫేక్ పోలీసు కాల్స్ వంటి ఆన్లైన్ స్కామ్‌లు చేయించేవారు. ఈ బందీల్లో భారతీయులు, ముఖ్యంగా తెలుగు వారు కూడా ఉన్నట్లు సమాచారం. నిర్దేశించిన టార్గెట్ పూర్తి చేయకపోతే తీవ్రమైన హింసకు గురిచేసేవారని, కనీసం సూర్యుడిని చూసే అవకాశం కూడా లేని గదుల్లో వారిని బంధించేవారని బాధితులు వాపోతున్నారు. ఆ భవనంలో భారత్, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాల పోలీస్ స్టేషన్లను తలపించే సెట్లు, ఆయా దేశాల పోలీసు దుస్తులు, జాతీయ జెండాలను ఏర్పాటు చేసి మరీ ఈ మోసాలకు పాల్పడేవారు. ఈ గదుల్లో వందలాది కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, వేల సంఖ్యలో సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పనిచేస్తున్న వారు ఎదురు తిరిగితే శిక్షించేందుకు ప్రత్యేక రక్షణ సిబ్బందిని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి సైబర్ నేరాల ద్వారా ఏటా సుమారు 12.5 బిలియన్ డాలర్లు కంబోడియాకు చేరుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అయితే ఈ అంతర్జాతీయ ముఠాల ప్రభావం భారతీయ పల్లెలకు కూడా పాకి ప్రాణాలు తీస్తోంది. ములుగు జిల్లాకు చెందిన ఒక కూలీ, సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు భయపడి ఆత్మహత్యకు పాల్పడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్, పోలీసుల పేరుతో వచ్చే బెదిరింపుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

13-2Pg6exHMNWJQE 10_13-2Pg6exHMNWJQE.qxd 12/Feb/26 11:15 PM Page 1





సూర్యప్రభపై స్వామి, చప్పరం వాహనంలో అమ్మవారు

## సూర్యప్రభ వాహనంపై శివయ్య

### చప్పరంలో జ్ఞాన ప్రసూనాంబ దివ్యదర్శనం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో రాజేష్, సూరి గురుకుల్స్ ముస్తాబు చేసారు. ఇక్కడ స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు ఆలయ చైర్మన్ కొట్టెస సాయిప్రసాద్, ఇఓ డి.బాపిరెడ్డి పూజలు జరపగా సంప్రదాయ బద్ధంగా అర్చకులు హారతులిచ్చి స్వామి అమ్మవార్లను గ్రామోత్సవాలకు తరలించారు. పంచమూర్తులను శివయ్య గోపురం, రాజగోపురం గుండా అలంకార మండపం వద్దకు చేర్చారు. అక్కడ సోమస్కందమూర్తి శ్రీకాళహస్తీశ్వరుని సూర్యప్రభ వాహనంపై, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని సప్పర వాహనంలో ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్లకు దిష్టి తీసి గ్రామోత్సవానికి శ్రీకారం చుట్టారు. కోలాటాల కళాకారులు సంప్రదాయ బద్ధంగా కోలాటాల నృత్యాలు చేస్తుండగా మేళ తాళాలు మంగళవాయిద్యాలతో ఉభయదారులు వెంటరాగా ఉత్సవం నాలుగుమాఢ వీధులతో పాటు బాబూఅగ్రహారం కోనేరు చుట్టూ ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంతో ఆలయ ఇన్‌స్పెక్టర్, ఉత్సవాల ఇన్‌చార్జిలు వెంకటస్వామి, నాగభూషణం యాదవ్ వెంటరాగా వైభవంగా ఉత్సవం సాగింది. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఎఎస్ఐ గోవిందు, ప్రత్యేక విధులపై వచ్చిన సిబ్బంది ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.

## సిఎం చంద్రబాబుతో బండ్ల గణేష్ భేటీ



విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో బండ్ల గణేష్ గురువారం కలిశారు. వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై 2023లో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపింది. సిఎం చంద్రబాబు జైలు నుంచి విడుదలై ముఖ్యమంత్రి అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు 4వసారి సిఎం అయ్యారు. సంకల్ప యాత్ర పేరుతో షాద్‌నగర్ ఇంటి నుంచి జనవరి 19న పాదయాత్ర చేపట్టి ఈ నెల 10వ తేదీన తిరుమలకు చేరుకున్నారు. 23 రోజుల పాటు 535 కి.మీ మేర బండ్ల గణేష్ పాదయాత్ర సాగింది. రెండ్రోజుల క్రితం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని బండ్ల గణేష్ తన మొక్కును చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. తిరుమల నుండి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. బండ్ల గణేష్‌ను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు.



## నిరూపయోగంగా ప్రభుత్వ భవనం

నెల్లూరు అగ్రికల్చర్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నెల్లూరు రూరల్ మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ రెండంతస్తుల భవనం నిరూపయోగంగా మారింది. నెల్లూరు చెరువు దర్గా ప్రాంతంలో ఉన్న పినాకిని గెస్ట్ హౌస్‌కు సంబంధించిన ఈ ప్రభుత్వ భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపయోగంలో లేకుండాపోయింది. నగరంలో అనేక కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నప్పటికి ప్రభుత్వ భవనంగా ఉన్న ఈ కార్యాలయం గత కొంతకాలంగా నిరూపయోగంగా దర్శనమిస్తోంది. 2019కి ముందు కొంత మంది ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లకు ఆశ్రయం కల్పించిన ఈ భవనం ఆ తర్వాత ఉపయోగంలో లేకుండా పోయింది. అద్దె భవనాల్లో నడుస్తున్న ఏదో ఒక కార్యాలయాన్ని ఈ భవనంలోకి తరలించే సదుపాయం ఉన్నప్పటికీ, ఆ దిశగా ఉపయోగించుకునే సూచనలు కనిపిస్తున్న దాఖలాలు లేవు. ఇది ఖాళీగా ఉండడంతో రాత్రి వేళల్లో కొంత మంది తలుపు గొళ్ళెం పగలగొట్టి లోపలకు ప్రవేశిస్తున్న సందర్భాలు ఉన్నాయి. కొంత మంది ప్రైవేటు వ్యక్తులు చీకటి కార్యకలాపాలకు కూడా వాడుకుంటున్నట్లు సమాచారం. ఏది ఏమైనా అద్దె చెల్లిస్తున్న బీసీ కార్పొరేషన్ లాంటి ప్రభుత్వ శాఖలు ఇలాంటి నిరూపయోగ భవనాలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ భవనం ఉపయోగంలోకి వస్తే అద్దె చెల్లింపుల్లో కొంత వరకైనా ప్రభుత్వానికి ఊరట లభిస్తుందన్నది ప్రజల అభిప్రాయం.

# గోవిందా గోవిందా! గోవింద

## గరుడ వాహనంపై శ్రీనివాసుడి స్వైరవిహారం

### పోటెత్తిన భక్తజన సందోహం... పోలీసుల పటిష్ట భద్రత



చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ఏడుకొండలవాడా వెంకటరమణా గోవిందా గోవిందా గోవింద అంటూ భక్తజనుల గోవింద నామస్మరణల నడుమ శ్రీనివాసుడి నిత్య వాహనమైన గరుడ వాహన సేవ గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి వేంచేపు చేశారు. శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవలో స్వామివారిని వీక్షించడం ద్వారా మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. శ్రీవారి నిత్యవాహనమైన గరుడుడిని వాహనంగా చేసుకుని శ్రీనివాసుడు తిరుమాడవీధులలో విహరిస్తుండగా దర్శించుకోవడం ద్వారా సకల పాపహరణ, మోక్షప్రాప్తి లభిస్తుందని శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్స్ వల్లంశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుం బట్టు ధనశేఖర్, ఆలయ కంకణ భట్టార్ బాలాజీ రంగకుమార్, ప్రధాన అర్చకులు పార్థసారధి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

**మోహినీ అవతారంలో కళ్యాణ వెంకన్న**

శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరించగా, తిరుచ్చిపై చిన్నికృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మోహినీ అవతారంలో స్వామివారిని దర్శించుకోవడం ద్వారా మోహాలు తొలగి సర్వం శ్రీహరి మయం కాగలదని పురాణాలు తెలియజేస్తున్నాయి.

**వైభవంగా ఆండాళ్ అమ్మవారి మాలలు ఊరేగింపు**

కళ్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం తిరుపతి గోవిందరాజస్వామి వారి ఆలయం నుండి ఆండాళ్ అమ్మవారి మాలలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా అశేష భక్తులతో ప్రారంభమైన గోదా కళ్యాణయాత్ర అంబారీపై మాలలను తీసుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు జరిపించి అలంకరించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజియ్యర్ స్వామి, చిన్న జియ్యర్ స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**అంగరంగ వైభవంగా శోభాయాత్ర**

కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సంప్రదాయానుసారం లక్ష్మీకాసుల హారం టిటిడి అదనపు ఈఓ సిహెచ్ వెంకయ్య చౌదరి ఆలయ అర్చకులకు అందజేశారు.

# నేటి నుండి మహాశివరాత్రి ఉత్సవాలు

### - కలశ స్థాపన, ధ్వజారోహణం



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నేటి నుండి శివరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం కలశ స్థాపన, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్టాపనలతో ప్రారంభం అవుతాయి. శుక్రవారం ఉదయం శ్రీ గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామివార్లకు మంగళస్నానములు నిర్వహించి నూతన వధూవరులుగా అలంకరిస్తారని, మూల హవనములు, బలిహరణ, హారతి మంత్రపుష్పం, జరిపి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఉత్సవాలకు శాస్త్రోక్తంగా గణపతి పూజ, మండపారాధన, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనములు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం జరుగుతాయన్నారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళాలు:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన వి సుబ్బలక్ష్మి, వి గున్నేశ్వరరావు కుటుంబసభ్యులు రూ.1లక్షను విరాళంగా అందించారు.

అలాగే పశ్చిమగోదావరి జిల్లా బీమవరంకు చెందిన గుప్త దాతలు (వారిపేర్లు నమోదు చెయ్యలేదు) రు. 1,01,116ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. దాతలకు దుర్గమ్మవారి ఏర్పాటు చేసి, దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, మెమొంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

## గాంధీ ఆశయాలకు మోడీ తూట్లు

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



కావలి (నెల్లూరు), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : గాంధీజీని గాడ్సే ఖూనీ చేస్తే ప్రధాని నరేంద్రమోడీ గాంధీజీ పేరు మీద ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి ఆయన ఆశయాలను ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిలరెడ్డి తెలియజేశారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా కావలి రూరల్ మడలం అముదాలదిన్నె గ్రామంలో కావలి నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్ పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధిహామీ కూలీలతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో షర్మిలకు మహిళల చేత సారెను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. పనికి ఆహార పథకానికి వందరోజులు పని దినాలుగా కేటాయించడం జరిగిందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో 52 పనిదినాలను కల్పించి 125రోజులు పనిదినాలను కల్పిస్తామని చెప్పడం పచ్చి బూటకం అని తెలిపారు. రానున్న రోజుల్లో 12గంటలు పనిచేయాల్సి వస్తుందని తెలిపారు. అందరిలో చైతన్యం వచ్చి నిలదీయాలన్నారు. నూతన చట్టం ద్వారా ఆహార పథకానికి కేంద్ర ప్రభుత్వం 60శాతం నిదులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయించాలని అన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులు కేటాయించే పరిస్థితిలో లేనందున కేంద్రం ఇచ్చే 60శాతం నిదులు కూడా ఇవ్వరనితెలిపారు. రాష్ట్రంలో 18లక్షల జాబ్‌కార్డులను తొలగించడం జరిగిందన్నారు. కేంద్రంలోని బిజెపి పార్టీకి కూటమి పార్టీలు,వైఎస్ఆర్ సిపి పార్టీ అమ్ముడు పోయిబానిసలుగా తయారైనెరన్నారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కూడా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి మోడీకి వ్యతిరేకంగా మాట్లాడడం లేదంటే ప్రజల పక్షాన ఉన్నట్టా లేనట్టా ఆలోచించుకోవాలన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిగా చేసుకుటే రాష్ట్ర విభజన హామీలన్నింటిని నెరవేర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఓబిసి ఉపాధ్యక్షులు కలవకూరి శ్రీనివాసులుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రి నిర్వహణ శ్రీకాళహస్తి దేవస్థానంకు అప్పగించండి

**● 22ఏ చట్టాన్ని సడలించండి ● ట్రాఫిక్ స్టేషన్ మంజూరు చేయండి ● అసెంబ్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అభ్యర్థన**



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: శాసనసభ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలపై గళం విప్పారు. తన అభ్యర్థనను స్పీకర్ దృష్టికి అలాగే సంబంధిత మంత్రులకు మొరబెట్టుకున్నారు. గురువారం సమావేశంలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో 1999లో ముఖ్యమంత్రి చంద్రబాబు 11 ఎకరాల విస్తీర్ణంలో ఏరియా ఆస్పత్రిని నిర్మింపజేసి ప్రారంభించారు. తిరుమల, శ్రీశైలం దేవాలయాలు ఆస్పత్రులను నిర్వహిస్తున్నాయి. కాబట్టి ఆస్పత్రిని దేవాలయంలో అనుసంధానం చేయాలని కోరారు. ఈ ఆసుపత్రిలో గత ప్రభుత్వ హయాంలో రూ.12 కోట్లతో రెండవ అంతస్తును నిర్మించారు. ప్రారంభించనే లేదు. ఉరుస్తుంది. పూర్తి స్థాయిలో పని చేయలేదని అసెంబ్లీలో ప్రస్తావించారు. అందుకే ఆలయ ఆదాయంతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తే సామాన్య రోగులకు మెరుగైన సేవలందించుటకు అవకాశం ఉంటుందని సభ దృష్టికి తెచ్చారు. కాగా 22ఏ చట్టం కారణంగా శ్రీకాళహస్తి నియోజరకవర్గంలోని పేదలు, రైతులు, పట్టాదారులు తమ సొంత భూములపై హక్కులు వినియోగించుకోలేక పోతున్నారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. ఈ చట్టాన్ని సడలించి రైతులను ఆదుకోవాలని కోరారు. 22ఏ చట్టాన్ని సవరించి అర్హులైన వారికి ఇంటినివేశన స్థలాలు,పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత రెవెన్యూశాఖ మంత్రిని కోరారు.

**టెంపుల్ సిటిగా అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి నిత్యం తిరుమలకు వచ్చేభక్తులు 75శాతం వస్తున్నారు. ఈ ప్రాంతాన్ని టెంపుల్ సిటిగా అభివృద్ధి చేయటానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి కోరారు. అయితే రాజుల కాలం నాటి పట్టణం కాబట్టి ఆనాటి అవసరాలకు తగ్గట్లు పట్టణాన్ని రూపకల్పన చేసారు. నేడు జనాభా పెరిగింది. పట్టణ స్వరూపం మారింది. వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆలయానికి వచ్చే భక్తులు పెరిగారు. కానీ ట్రాఫిక్ సమస్య జటిలంగా ఉంది. నిత్యం ట్రాఫిక్ చిత్తడిలో పట్టణ ప్రజలే కాకుండా దూరం నుంచి వచ్చే భక్తులు ఽకూడా ట్రాఫిక్ సమస్యతో సతమతమౌతున్నారు. ఇక్కడ 'ట్రాఫిక్ పోలీసు' స్టేషన్‌తో పాటు సిబ్బందిని ఇవ్వాలని సంబంధిత హోంశాఖ మంత్రిని కోరారు. గతంలో కూడా మూడు సార్లు ఈ సమస్యను విన్నవించాను.

**కాంటాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందికి న్యాయం చేయండి:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో సుమారు 1100 మంది కాంటాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది చాలా మంది పని చేస్తున్నారని వారికి చాలీ చాలనీ వేతనాలతో కుటుంబాలు గడుపులేక తల్లడిల్లుతున్నారు. వారికి న్యాయం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సభలో ప్రస్తావించారు. ఆయన అభ్యర్థనలకు సంబంధిత మంత్రులు సానుకూలంగా స్పందించారు.

## వైసిపికి ప్రతిపక్ష హోదా రాదు

### జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్‌కుమార్

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిపక్ష నాయకుడుగా జగన్‌ను చూడాలంటే ప్లకార్డులు ప్రదర్శించి, ఆందోళనలు చేసినా ప్రయోజనం లేదని జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి ఇంట్లోనే అసెంబ్లీ సెట్ వేసుకోండి... బొత్సను స్పీకర్‌గా పెట్టుకోండి అంటూ మండిపడ్డారు. జీతాల కోసమే వైసిపి నాయకులు సభకు వచ్చారు. 10 నిమిషాల్లో హాజరు వేసుకొని 11వ నిమిషంలో వెళ్లిపోయారన్నారు. వాళ్లకు ప్రజా సమస్యలు కంటే ప్రతిపక్ష హోదానే ముఖ్యమన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో జనసేన ఎమ్మెల్యేలు లోకం మాధవి, సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ, "జగన్ అండ్ కోకి చట్టసభలు అన్నా, మన సంప్రదాయాలు అన్నా కనీస గౌరవం లేదు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా ఆందోళనలు చేపట్టి సభా మర్యాదను మంటగలిపారు. కాసులకు కక్కుర్తిపడి శ్రీవారి దివ్య ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో తయారు చేసి కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని చెబుతున్న జగన్, ఇంట్లోనే అసెంబ్లీ సెట్ వేసుకొని బొత్స సత్యనారాయణని స్పీకర్‌గా పెట్టుకోవాలని హితవు పలికారు.

### మంత్రి ఫ్లెక్సీ సాక్షిగా అర్థరాత్రి దాటిన తరువాత

# మట్టి దోపిడి గ్యాంగ్ దందా



సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: సాలూరు పట్టణంలో మట్టి మాఫీయా దోపిడి రోజు రోజుకి మితిమీరిపోతోంది. ఇంత జరుగుతున్నా రెవిన్యూ, మైనింగ్, పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్న వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవంతో అమ్ముడై పోయారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇది ఇలా ఉంచితే రూరల్‌లో ఉన్న సర్కార్ భూముల్లో నుంచి గత నాలుగు రోజులుగా అర్ధరాత్రి 12 గంటల తరువాత లారీలలో మట్టిని దొంగతనంగా ఎమ్మార్వో ఆఫీస్, జాతీయ రహదారి మీదుగా మంత్రి ఫ్లెక్సీ సాక్షిగా తీసుకెళ్లడం హైలెట్ అనే చెప్పకోవచ్చు. అలాగే గుట్టుగా సాగుతున్న మట్టి మాఫీయా గ్యాంగ్ దోపిడీ ఫోటోస్, వీడియోస్ సాలూరు పలు చరవాణి గ్రూపుల్లో హల్ చల్ చేస్తున్నా ఆఫీసర్స్ ఇంతవరకు యాక్షన్ లోకి దిగకపోవడం గమనార్హం. ఈ మట్టి దోపిడీ చేస్తున్న వారిని పర్మిషన్ ఉన్నదా అని ప్రశ్నిస్తే ఉన్నాయని చెపుతున్నారని వినికిడి. అయితే అర్ధరాత్రి ఎందుకు దొంగతనంగా తీసుకెళ్లడం అనే ప్రశ్న అందరిలో వ్యక్తమవుతోంది.

**మట్టి మాఫియాకి ఎమ్మార్వో వార్నింగ్ :**

విలేజీల్లో గవర్నమెంట్ కు సంబంధించిన చెరువులు, చెరువు పోరంబోకు, అలాగే గెడ్డ పోరంబోకు నుండి మట్టిని అక్రమంగా తరలించడం నేరమని తాసిల్దార్ నీలకంతరావు మట్టిదోపిడి గ్యాంగ్ ను హెచ్చరించారు. అలాగే ప్రైవేట్ జిరాయితీ ల్యాండ్ మట్టిని అనుమతి లేకుండా తరలిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. ఎవరికి ఇంతవరకు ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని అర్ధరాత్రి మట్టిలోడు తీసుకువెళ్లే లారీలపై చర్యలు తీసుకోవాలని టౌన్ పోలీస్ వారికి ఇన్ఫర్మేషన్ ఇచ్చామని విలేకరులు అడిగిన ప్రశ్నకు గురువారం ఉదయం క్లారిటీ ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో టీచర్

అమలాపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నా నిత్యం ఎక్కడో చోట సైబర్ నేరగాళ్లలో చిక్కుతూనే ఉన్నారు. తాజాగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మగటపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో టీచర్ కొనుకు శ్రీనివాస్ నేరగాళ్లకు చిక్కి రూ.24.50లక్షలు పోగొట్టుకున్నారు. ఫేస్‌బుక్‌లో లింకును క్లిక్ చేయడంతో కేంద్ర ప్రభుత్వ స్కీం పేరుతో సైబర్ వలవిసిరారు. రూ.10 లక్షల విలువైన ఎరువులు పంపిస్తున్నామని లాభాలు పొందవచ్చునని సైబర్ నేరగాళ్లు నమ్మించారు. లారీ ద్వారా సరుకు వస్తుందని అది అమ్మితే భారీ మొత్తంలో లాభాలు వస్తాయని సొల్లు కబుర్లు చెప్పారు. అది నమ్మిన శ్రీనివాస్ ఫోన్ పే ద్వారా పలుమార్లు నేరగాళ్లకు రూ.24.50 లక్షలు బదిలీ చేశారు.అయినా ఇంకా డబ్బులు పంపించమనడంతో అప్పటికి శ్రీనివాస్ అనుమానంతో సైబర్ క్రైం1930 నెంబర్‌కి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన బ్యాంక్ అధికారులు రూ.9 లక్షలు ఫ్రీజ్ చేశారు. దీనిపై నగరం ఎస్ఐ చైతన్యకుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై సిఐ రుద్రరాజు దర్యాప్తు చేపట్టారు



## పాతకారులో మృతదేహం

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని గుణదలలో ఓ పాత కారులో వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. గుణదల రామవరప్పాడు రింగ్ నుంచి విజయవాడ వైపునకు వచ్చే రహదారి వెంబడి నిలిపి ఉంచిన పాత కారులో ఓ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మంగళగిరి ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. గుణదల మేరీ మాత తిరునాళ్లకు వచ్చి కారులో నిద్రలోనే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భర్త గొంతు కోసిన భార్య



మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మద్యం తాగి ఇంటికి వచ్చాడనే కోపంతో ఓ భార్య తన భర్తపై కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లిలో చోటుచేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామ పంచాయతీ నాయుని వారిపల్లికి చెందిన మల్లూరి సుబ్రహ్మణ్యం రెడ్డి(43), భార్య శ్యామల వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం సుబ్రహ్మణ్యం రెడ్డి మద్యం తాగి ఇంటికి వచ్చి భోజనం సరిగ్గా లేదని భార్యను మందలించడంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో శ్యామల, ఇంట్లో ఉన్న కొడవలిని తీసుకుని సుబ్రహ్మణ్యం రెడ్డి మెడపై బలంగా నరికింది. తీవ్ర రక్తస్రావమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 వాహనం ద్వారా మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మదనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దొంగతనం నింద తట్టుకోలేక పదో తరగతి విద్యార్థి బలవన్మరణం



తోటపల్లి గూడూరు (నెల్లూరు), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి సుదీప్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పెదూరు పంచాయతీకి చెందిన సుదీప్, తనపై వచ్చిన దొంగతనం ఆరోపణలను తట్టుకోలేక ఇంట్లో ఉరివేసుకున్నట్లు సమాచారం. పాఠశాలలో ఓ విద్యార్థికి చెందిన నగదు పోవడంతో, ఆ దొంగతనం సుదీప్ చేశాడని తోటి విద్యార్థులు, కొందరు సిబ్బంది ఆరోపించినట్లు తెలుస్తోంది. అందరి ముందూ తనను దొంగగా ముద్రవేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుదీప్ పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుదీప్ మృతితో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని ఆరోపిస్తూ గేటు ముందు బైఠాయించారు. విద్యార్థి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీర య్యారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఘటనపై సమాచారం అందుకున్న రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# మహిళా టీచర్‌పై దాడి, దోపిడీ

### మూడు గంటల్లో ముద్దాయిని పట్టుకున్న పోలీసులు



గూడూరు (నెల్లూరు), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: గూడూరు రూరల్ మండల పరిధిలో సంచలనం రేపిన మహిళా ఉపాధ్యాయురాలిపై దాడి చేసి దోపిడీ చేసిన ఘటనలో పోలీసులు సత్వరమే స్పందించి మూడు గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పి సిహెచ్ సౌజన్య తెలిపారు. దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న టీచర్‌ను ఏ.ఎస్.పి గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాడి సమాచారం అందిన ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతో వెంటనే క్రైమ్ టీమ్స్ స్పందించడం, ఎస్పి సమన్వయం చేసుకుంటూ సూచనలు చేయడం వంటి చర్యలతో ముద్దయిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. బాలాయపల్లిలో టీచర్‌గా పనిచేస్తున్న మహిళ గూడూరు టౌన్‌లో ఆటో ఎక్కి వెళుతుండగా, గూడూరు రూరల్ పరిధిలోని చీమర్తి దగ్గర మహిళపై ఆటో డ్రైవర్ దాడి చేసి మెడలోని బంగారు సరుడును లాక్కొని వెళ్లాడని పేర్కొన్నారు. బాధిత మహిళ కూడా నిందితున్ని ధైర్యంగా ఎదుర్కొని గాయపరిచిందని చెప్పారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, జిల్లా యస్.పి. ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంటల వ్యవధిలో ముద్దాయిని, ఆటోను గూడూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం బాధిత మహిళను మెరుగైన చికిత్స కోసం నెల్లూరు కిమ్స్ హాస్పిటల్లో చేర్చామని, చికిత్స జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.

13-2P□g7exHMNWJQE 11_13-2P□g7exHMNWJQE.qxd 13/Feb/26 12:07 AM Page 1



# బ్రాహ్మణ కుటుంబాలకు అండగా 'గరుడ'

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్తప్రతినిధి: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం " గరుడ" పథకం ద్వారా చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఈ గరుడ పథకాన్ని అమలు చేస్తోంది. కుటుంబ సభ్యులె వరైనా మరణించిన తరుణంలో, వారి అంత్య క్రియల ఖర్చుల కోసం ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అంది స్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు.

అర్హతలు ఇవే: మరణించిన వ్యక్తి అలానే దరఖాస్తుదారుడు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు అయి ఉండాలి. అలానే కుటుంబ వార్షిక ఆదాయం రూ.75,000 మించి ఉండకూడదు. దరఖాస్తుదారుడు మరణించిన వ్యక్తికి భార్య/భర్త, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులు, సోదరుడు లేదా మనవడు అయి ఉండాలి. ఇంక ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ఇలాంటి సాయం పొంది ఉండకూడదు.

కావలసిన పత్రాలు: దరఖాస్తు సమయంలో దరఖాస్తుదారుని ఫొటో, ఆధార్ కార్డు, మరణించిన వ్యక్తి ఆధార్, మరణ ధృవీకరణ పత్రం , మీసేవ ద్వారా పొందిన కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి. వీటితో పాటు ఆంధ్ర బ్యాంక్ లేదా ఎస్బీఐ ఖాతా పుస్తకం నకలును జత చేయాలి. బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌పై క్లిక్ చేయాలి. వ్యక్తిగత, బ్యాంకు వివరాలను నమోదు చేసి, పైన పేర్కొన్న పత్రాలను అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు పూర్తయ్యాక వచ్చే రిఫరెన్స్ నంబర్‌ను భద్రపరుచుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారు సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాకే జమ అవుతుందని కార్పొరేషన్ వర్గాలు స్పష్టం చేశాయి. మరణించిన వ్యక్తి యొక్క జీవిత భాగస్వామి, పిల్లలు లేదా కుటుంబ సభ్యులు ఈ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు అందుబాటులో ఉంటాయి. ఏదైనా సహాయం కోసం బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ హెల్ప్‌లైన్ నంబర్లు 0866 6650345, 0866 6650300 సంప్రదించవచ్చు.

# బెంగళూరు- కడప కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయండి

- కేంద్ర మంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి
- సానుకూలంగా స్పందించిన అశ్విని వైష్ణవ్
- కడప నుంచి విమాన సేవలు పెంపొందించండి
- రామ్మోహన్‌నాయుడుకు మంత్రి మండిపల్లి విజ్ఞప్తి
- మంత్రి వెంట ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్



విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: బెంగళూరు నుంచి కడప వరకు కొత్త రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఢిల్లీలో సమావేశమై కోరారు. ఈ భేటీలో ఎంపి పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెంగళూరు-కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలోనే సాధ్యం అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రాంత ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు.

**విమాన సేవల విస్తరణపైనా**

కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంపొందించాలని కోరుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకుసాగుతున్న క్రమంలో, కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడుతుందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు.

**ఎపిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాదనల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎంపి పురందేశ్వరి, సాయి లోకేష్ పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్టియర్ పరీక్షా విధానంలో మార్పులు

- 32 పేజీల బుక్‌లెట్‌లోనే రాయాలి
- అదనపు పేపర్లు ఇవ్వరు
- మార్కుల విధానంలో మార్పులు చేర్పులు
- ఇంటర్ బోర్డు మార్గదర్శకాలు విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఈనెల 23 నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఆరంభమవుతున్నాయి. ఇందుకుగానూ ఇంటర్మీడియట్ విద్యా మండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంటర్మీడియట్ విద్యార్థులు మొత్తం 10,57,899 మంది ఉండగా వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,31,275, ద్వితీయ సంవత్సరం వారు 5,26,624 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది సిలబస్‌తో పాటు ప్రశ్నపత్రాల విధానంలోనూ కొన్ని మార్పులు, చేర్పులు తీసుకు వచ్చారు. ఈసారి ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్‌కు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు.

**అదనంగా పేజీలు ఇవ్వరు:** ఇప్పటివరకు సమాధానాలు రాయడానికి 24 పేజీల బుక్‌లెట్ ఇస్తుండేవారు. ఈసారి మాత్రం 32 పేజీల బుక్ లెట్ ఇవ్వాలని నిర్ణయించారు. అన్ని ప్రశ్నలకు అందులోనే సమానాధాలు రాయాల్సి ఉంటుంది. అదనంగా ఎలాంటి పేజీలు ఇవ్వరు. పార్ట్‌ఏలో బోటనీ నుంచి 43, పార్ట్‌బిలో జువాలజీ నుంచి 42 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. వీటికి జవాబులు రాసేందుకు విడివిడిగా 24 పేజీల 2 బుక్‌లెట్లు ఇస్తారు. బుక్‌లెట్లపై వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం అని ప్రత్యేకంగా పేర్కొంటారు. ఈ ఏడాది నుంచి ఫస్ట్ ఇయర్ వారికి ఒక్క మార్కు ప్రశ్నలు ఉంటాయి. సెకండ్ ఇయర్ ప్రశ్నపత్రాల్లో ఎలాంటి మార్పు ఉండదు. అదే విధంగా ఆర్థిక శాస్త్రం, పౌరశాస్త్రం, చరిత్ర సబ్జెక్టుల మార్కుల్లో ఎలాంటి మార్పు లేదు. అయినా ప్రశ్నల సంఖ్య పెరగడంతో వీటికి సైతం 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి ఏడాదిలో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. ఈ సబ్జెక్టుల్లో 35 శాతం మార్కులు వస్తే పాసయినట్లే. ఆ లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉండగా, 29 మార్కులు వచ్చిన కూడా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు. ద్వితీయ సంవత్సరంలో 85 మార్కులకు గానూ 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధనను పెట్టారు. రెండు సంవత్సరాలకు కలిపి 35 శాతం కింద 59.5 మార్కులు సాధించాల్సి ఉండగా, 59 మార్కులను ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఈ అర్ధ మార్కును సర్దుబాటు చేస్తున్నారు. రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉత్తీర్ణత మార్కులను 10.5 నుంచి 11కు పెంచారు. గణితం 12, రసాయనశాస్త్రం 9, భౌతికశాస్త్రం 9, వృక్షశాస్త్రం 5, జంతుశాస్త్రంలో 4 ప్రశ్నలుగానూ సబ్జెక్టుల వారీగా ఒక్క మార్కు ప్రశ్నలనూ ఉండనున్నాయి. అన్ని కేంద్రాల్లోను కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానం చేయనున్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో జిల్లాను ఒక్కో అధికారి పర్యవేక్షి ంచనున్నారు. ఆయా కళాశాలలు సీసీ కెమెరా ఫుటేజ్ హార్డ్‌డిస్క్‌ను ఆర్ఐఓలకు ఇస్తాయి. అక్కడ వాటిని భద్రపరచనున్నారు.



# నోరులేని మూగజీవాలకు వరంగా గరివిడి పశువైద్య కళాశాల

- అద్భుత వైద్యం... అత్యాధునిక పరికరాలు... నామమాత్రపు ఫీజు

గరివిడి (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: నోరులేని మూగజీవాలకు గరివిడి పశువైద్య కళాశాల వరంలా నిలుస్తోంది. అత్యాధునిక పరికరాలు, నిష్ణాతులైన వైద్యులతో అద్భుతమైన చికిత్సలు అందిస్తూ మూగ జీవాలకు ప్రాణం పోస్తోంది. ఉత్తరాంధ్రకే తలమానికంగా నిలిచే గరివిడి పశువైద్య కళాశాల వేలాది జీవులకు ఊపిరిపోస్తూ ప్రాణవాయువుగా నిలుస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాలు నుండి ఇక్కడ తమ పశువులు, పక్షులు ఇతర నోరులేని మూగజీవాలకు పశుపోషకులు తీసుకువచ్చి వైద్యాన్ని అందిస్తూ ఉన్నారు. వేరేప్రాంతాల్లో వేల రూపాయలు వ్యయం అయ్యే శస్త్ర చికిత్సలు గరివిడి పశువైద్య కళాశాలలో నామమాత్రపు రుసుముతో శస్త్ర చికిత్సలు అందిస్తూ మూగజీవాల పాలిట కల్పతరువుగా ఈ వైద్య కళాశాల నిలుస్తోంది. తమ పశువులకు, పెంపుడు జంతువులకు వైద్యంతో పునర్జన్మ ను అందించే ఇక్కడ వైద్యులకు పశుపోషకులు నిత్యం కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉన్నారు.

ఉత్తరాంధ్రలో మరెక్కడా లేని వైద్య పరికరాలతో వైద్యాన్ని జీవాలకు అందిస్తూ ఉండటం ఈ కళాశాల ఎంతో ఖ్యాతి గడిస్తూ ఉందని చెప్పక తప్పదు. గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను పర్యవేక్షణలో గరివిడి పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, పశువైద్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ సర్జన్ డాక్టర్ పి.రవి కుమార్ పశువులకు శస్త్రచికిత్సలు అందిస్తూ మూగజీవాలకు ఊపిరిపోస్తున్నారు. రోజుకి అరడజనుకి పైగా శస్త్ర చికిత్సలు చేస్తున్న డాక్టర్ రవికుమార్,తన జూనియర్ డాక్టర్ లతో కలసి అనేక జీవాలకు మెరుగైన వైద్యాన్ని అందిస్తూ పశుపోషకులు నుండి ప్రశంసలు అందుకుంటున్నారు. ఉత్తరాంధ్ర లో చౌకైన వైద్యం, మెరుగైన సేవలతో పశువులకి జీవనాన్ని అందిస్తున్న గరివిడి పశువైద్య కళాశాల ఈ ప్రాంత పశుపోషకులు కల్పతరువుగా, మూగ జీవాలకు వరంగా నిలుస్తుందని పేర్కొనక తప్పదు. తమ రోగం చెప్పుకోలేని జీవాలకు వైద్యం అందించే పశువైద్యులు దైవంతో సమానులుగా పశుపోషకులు నుండి కీర్తి గడిస్తున్నారు. మెరుగైన, మేలైన సేవలను అందించే గరివిడి పశువైద్య కళాశాలను పశుపోషకులు సద్వినియోగ పరచుకొని పశు సంపదను కాపాడుకోవాల్సిన అవశ్యం అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా పశుపోషకులు అడుగులు వేస్తారని అభిలషిద్దాం.

# ప్రజా సమస్యలు ప్రతిబింబించేలా చర్చలు జరగాలి

- మండలిలో సమయపాలన..ఉదయం 10నుంచి 1.30వరకు సభ
- శాసనమండలి బిఏసి నిర్ణయం
- మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు

సచివాలయం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు ప్రతిబింబించేలా చర్చలు జరగాలని చైర్మన్ కొయ్యే మోషేను రాజు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అధ్యక్షతన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఏసి) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వం తరపున మంత్రులు,విపక్ష నేతలు అన్నీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.సభను అర్థవంతంగా, క్రమశిక్షణతో నిర్వహించడమే లక్ష్యంగా పలు కీలక మార్గదర్శకాలను చైర్మన్ ఖరారు చేశారు.సమావేశాల షెడ్యూల్‌పై చర్చించిన బిఏసి, ప్రతిరోజూ ఉదయం 10.00గంటలకు సభను ప్రారంభించి,మధ్యాహ్నం 1.30గంటల వరకు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలకు సంబంధించిన కీలక బిల్లులు, బడ్జెట్ అంశాలపై చర్చించేందుకు తగిన సమయం కేటాయించడమే కాకుండా, సభా సమయాన్ని వృధా చేయకూడదని చైర్మన్ స్పష్టంచేశారు. సాధారణంగా సభలో ప్రశ్నోత్తరాల సమయం సుదీర్ఘంగా సాగుతుంటుంది. దీన్ని క్రమబద్దీకరించేందుకు బిఏసి ఈ క్రింది నిర్ణయాలు తీసుకుంది. ప్రశ్నోత్తరాల సమయాన్ని గరిష్టంగా 90నిమిషాలకు పరిమితం చేశారు. తద్వారా ఇతర సభా వ్యవహారాలకు, బిల్లులపై చర్చకు ఆటంకం కలగకుండా చూడవచ్చని భావించారు. సభ్యులు అడిగే ప్రశ్నలు సుదీర్ఘ ప్రసంగాల మాదిరిగా ఉండకూడదని, నేరుగా సమస్యను ప్రస్తావించాలని చైర్మన్ సూచించారు. అదేవిధంగా మంత్రులు కూడా తమ సమాధానాలను సాగదీయకుండా, గణాంకాలు మరియు వివరాలతో క్లుప్తంగా వివరించాలని కోరారు. ప్రశ్నలు క్లుప్తంగా ఉంటేనే ఎక్కువ మంది సభ్యులకు అవకాశం లభిస్తుందని గుర్తుచేశారు. సభ సజావుగా సాగేలా అధికార, ప్రతిపక్ష పార్టీలు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. బిఏసిలో తీసుకున్న నిర్ణయాలను తూచా తప్పకుండా పాటించాలని, సభా గౌరవాన్ని కాపాడలని సూచించారు. ఈ సమావేశంలో శాసనసభ వ్యవహారాల మంత్రి,ప్రతిపక్ష నేత ఇతర పార్టీల ముఖ్యనేతలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. బడ్జెట్ కేటాయింపులు, సంక్షేమ పథకాలు రాష్ట్రాభివృద్ధిపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగే అవకాశం ఉంది.

# హజ్ యాత్రికుల ఆరోగ్య భద్రతే ముఖ్యం

గుంటూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ జనాబ్ షేక్ హసన్ బాషా పేర్కొన్నారు. గురువారం గుంటూరు జిజిహెచ్‌లో హజ్ యాత్రికుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెడికల్ స్క్రీనింగ్, వ్యాక్సినేషన్ క్యాంపును చైర్మన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ హసన్ బాషా మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం అవసరమైన మెనింజైటిస్, పోలియో, సీజనల్ ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. యాత్రికులు సౌదీ అరేబియాలో ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా, క్షేమంగా యాత్రను ముగించుకుని తిరిగి రావాలన్నదే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, హజ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని అన్నారు.




యాత్రికులు ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ, యాత్రను విజయవంతం చేసుకోవాలని కోరారు.

# తిరుపతిలో డ్రగ్స్ కలకలం

- 8 మంది అరెస్ట్...
- మాదకద్రవ్యాలు, సిరప్ బాటిళ్లు స్వాధీనం

తిరుపతి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా కేంద్రం లో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత మందులను అక్రమంగా విక్రయిస్తున్న ముఠాపై పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి, 33 బ్యాగులు డ్రగ్స్‌ను, సిరప్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు. తిరుపతి నగరంలో నిషేధిత, మత్తు మందుల అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. యువతను, కార్మిక వర్గాలను లక్ష్యంగా చేసుకుని అక్రమంగా మందులు విక్రయించే వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఫార్మసీలు, మెడికల్ డిస్ట్రిబ్యూటర్లపై కూడా నిరంతర తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

**నేరం జరిగిన విధానం:**

ప్రధాన ముద్దాయి లక్కిసెట్టి నాగార్జున అనంతపురం ప్రాంతంలో మెడికల్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా నిషేధిత మందులను సరఫరా చేస్తుండగా, పాతకమూరి నాగేశ్వరరావు వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మధ్యవర్తుల ద్వారా విక్రయించేవాడు. అలతూరు రాజ్ కుమార్ ఈ మందులను భారీ మొత్తంలో కొనుగోలు చేసి తిరుపతి ప్రాంతంలో ఆటో డ్రైవర్లు, వలస కూలీలకు అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నాడు. ఇతర ముద్దాయిలను కూడా ఈ వ్యాపారంలో భాగస్వామ్యం చేసి మందులను సరఫరా చేయించగా, పోలీసులు సమాచారంపై దాడి చేసి మందులను పంచుకుంటున్న సమయంలో ఎనిమిది మందిని పట్టుకొని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కి లక్కిసెట్టి నాగార్జున, కుదుముల జనార్ధన్, పాతకమూరి నాగేశ్వరరావు, మేదూరి గౌతమ్, అలతూరు రాజ్ కుమార్, కోనేటి జగదీష్ బాబు, దిగవిండ్ల ఆంజనేయులు, వెంకటేష్లను అరెస్ట్ చేశారు ధనమ్మ, పద్మ, చందు, ప్రతాప్, విష్ణు, ప్రదీప్ పరారీలో ఉన్నారు.

# ఉద్యోగుల తప్పిదం... ఓ తల్లికి మిగిల్చిన ఆవేదన



దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), ఫిబ్రవరి 12, ప్రభాతవార్త: ఉద్యోగులు చేసిన తప్పిదం కారణంగా ఓ తల్లి ఆవేదనకు గురి అయింది. ఓ విద్యార్థికి తల్లికి వందనం మంజూరు విషయంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా ఉద్యోగులు చేసిన ఆన్లైన్ అప్ లోడ్ తప్పిదం వల్ల ఆ తల్లికి ఆవేదన మిగిల్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం చిన్న కాద గ్రామానికి చెందిన మన్యాల జానకి, చంద్రరావు దంపతులకు ధనశ్రీ, హర్షవర్ధన్ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య భర్తల మధ్య మనస్పర్థలు కారణంగా గత ఎనిమిది సంవత్సరాలుగా ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పిల్లలు సంరక్షణ బాధ్యత మాత్రం తల్లి జానకి చూసుకుంటున్నది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకం ఇద్దరు పిల్లలకు వర్తిస్తుందని ఆశగా ఎదురు చూసింది. అయితే తల్లికి వందనం సొమ్ము కేవలం కూతురు ధనశ్రీకి మాత్రమే జమ అయిందని, కొడుకు హర్షవర్ధన్ పేరిట రావలసిన తల్లికి వందనం సొమ్ము ఇంతవరకు జమ కాలేదని ఆ తల్లి ఆవేదన చెందుతుంది. అటు గ్రామ సచివాలయానికి, ఇటు ప్రాథమిక పాఠశాలకు ఎన్నిసార్లు తిరిగి మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కాలేదని జానకి విలేకరులకు వివరించింది. అయితే తన సంరక్షణలో ఉన్న కుమారుడు హర్షవర్ధన్ పేరును తండ్రి చంద్ర రావు పేరుతో లింక్ అవ్వడం వల్లనే తనకు సమస్య ఎదురయిందని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ లో మొరపెట్టుకున్న తనకు న్యాయం జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తన సంరక్షణలో ఉన్న కొడుకు పేరును తండ్రి ఆధార్ కార్డుకు ఎలా లింక్ చేశారని ఆమె ప్రశ్నిస్తున్నది. ఆ తప్పిదానికి పాల్పడిన సచివాలయ ఉద్యోగులపై చర్యలు చేపట్టాలని జానకి కోరుతున్నది.



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: లోక్‌సభ స్పీకర్ చాంబర్‌లోకి దూసుకెళ్లి విపక్ష ఎంపీలు దుర్భాషలాడారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో విడుదల చేశారు.

# స్పీకర్ చాంబర్‌లోకి వెళ్లి బెదరించారు.. ఇదిగో ఆధారం!

- విపక్ష ఎంపీలపై కేంద్రమంత్రి రిజిజు ఆరోపణలు
- స్పీకర్ చాంబర్‌లో ఘటనపై విడియో విడుదల

స్పీకర్ ఛాంబర్ లోపల అనేక మంది మహిళా కాంగ్రెస్ ఎంపీలు బిజెపి మంత్రులతో తీవ్ర వాగ్వాదానికి దిగిన దృశ్యాలను ఈ ఫుటేజ్‌లో కనిపిస్తుంది. ఫిబ్రవరి 4న జరిగిన పార్లమెంటరీ ప్రతిష్టంభన సమయంలో కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఓం బిర్లాపై దూషణలు చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు జారీ చేశారని ఆరోపించారు. 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు లోక్ సభ స్పీకర్‌ను దుర్భాషలాడి, ప్రధానిని బెదిరించారని ఆరోపించారు. బిజెపి, ఎన్డీఏ ఎంపీలకు 'పూర్తి స్వేచ్ఛ' ఇచ్చి ఉంటే పరిస్థితి గందరగోళంగా మారేదని, కానీ అధికార కూటమి అసహ్యకరమైన దృశ్యాన్ని నివారించడానికి సంయమనం పాటించిందని అన్నారు. 'దాదాపు 20-25 మంది ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి బలవంతంగా ప్రవేశించారు. అప్పుడు ఏమి జరిగిందో, వారు ఎలాంటి దుర్వినియోగం చేస్తున్నారో చూడటానికి తాను పరిగెత్తాను. వారు దుర్భాషలాడుతున్నారు. ప్రియాంక గాంధీ కూడా అక్కడే ఉన్నారు. వారు స్పీకర్, ప్రధాన మంత్రిని ఆమె ముందు దుర్భాషలాడారు' అని రిజిజు అన్నారు. కాంగ్రెస్ నాయకులు కె.సి. వేణుగోపాల్, ప్రియాంక గాంధీ వాద్రా ఎవరినీ దుర్భాషలాడలేదని, అయితే అనేక మంది కాంగ్రెస్ ఎంపీలు వారి సమక్షంలో అభ్యంతరకర వ్యాఖ్యలతో దూషించారని ఆయన ఆరోపించారు.

**అవన్నీ అబద్ధాలు: ప్రియాంకగాంధీ**

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన ఆరోపణలన్నీ 'అబద్ధం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. 'తాము ఎవరినీ దుర్భాషలాడలేదు. పరుష పదజాలం ఉపయోగించలేదు. ఒకరు లేదా ఇద్దరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రోత్సహించాననడం శుద్ధ అబద్ధం. తాను మౌనంగా కూర్చున్నా. చివరికి, తాను స్పీకర్‌కు శాంతియుతంగా కొన్ని విషయాలు చెప్పాను.' అని ప్రియాంక గాంధీ వివరించారు.

# రాజ్ కెసిరెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

**బెయిల్ పిటిషన్ విచారించేందుకు నిరాకరణ**

విజయవాడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం కుంభకోణం కేసులో రాజ్ కెసిరెడ్డికి రెగ్యూలర్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి ధర్మాసనం అనుమతించింది. ఈ క్రమంలో ఏపీ మద్యం కుంభకోణం కేసులో కసిరెడ్డి పాత్రపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మొత్తం వ్యవహారానికి ఆర్కిటెక్ట్ రాజ్ కెసిరెడ్డి అని సుప్రీంకోర్టు పేర్కొంది. ఏపీ మద్యం కుంభకోణం చాలా పెద్దదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇలాంటి పెద్ద స్కామ్‌లు జరగవని, కుమ్మక్కైన అధికారులను అరెస్టు చేయకపోవడం దురదృష్టకరమని సీజేఐ అన్నారు. కెసిరెడ్డి తరఫు న్యాయవాది వాదిస్తూ కెసిరెడ్డి ప్రభుత్వానికి సలహాదారు మాత్రనేనని అన్నారు. ఈ వాదనలను సీజేఐ ధర్మాసనం తోసిపుచ్చింది. కెసిరెడ్డిసలహాదారు కాదని, మొత్తం స్కామ్‌కు ఆయనే ఆర్కిటెక్ట్ అని ధర్మాసనం పేర్కొంది. పదవిలో ఉన్నవారి అండ లేకుంటే అధికారులు ఇలా చేయలేదని, ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రదారుడు రాజ్ కెసిరెడ్డేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇప్పటికే 10 నెలలుగా కెసిరెడ్డి జైలులో ఉన్నారని, సప్లిమెంటరీ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేశామని ఆయన తరఫు న్యాయవాది తెలపగా, ఏం కాదు మరికొంతకాలం జైలులో ఉండనీయండని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కెసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేది లేదంటూ రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను డిస్మిస్ చేసేందుకు సీజేఐ ధర్మాసనం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని రాజ్ కెసిరెడ్డి తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో రాజ్ కెసిరెడ్డి పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి ధర్మాసనం అనుమతించింది.

# విడాకుల తర్వాత భర్త ఇంట్లోకి వెళ్లే హక్కు భార్యకు లేదు!

**ఢిల్లీ హైకోర్టు స్పష్టమైన తీర్పు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** గృహహింస నిరోధక చట్టం కింద మహిళలకు కల్పించిన హక్కులపై ఢిల్లీ హైకోర్టు స్పష్టమైనవివరణ ఇచ్చింది. ఒక మహిళ భర్తతో విడాకులు తీసుకుని స్వచ్ఛందంగా అత్తారింటిన విడిచి పెట్టి ఆ తర్వాత తిరిగి అతడి ఇంట్లోకి ప్రవేశం కల్పించాలని కోరే హక్కు ఉండదని స్పష్టం చేసింది. అలాగే నివసించడానికి ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు అత్తా రింటిపై పట్టుబట్టడం చట్ట విరుద్ధమని కూడా కోర్టు పేర్కొంది. ముఖ్యంగా 81 ఏళ్ల వయసు కల్గిన ఓ వృద్ధురాలు మాజీ భర్త ఇంట్లో ఉండడానికి అవకాశం కల్పించాలంటూ వేసిన పిటిషన్‌ను నిర్మొహమాటంగా కొట్టేసింది. 81 ఏళ్ల వయసున్న ఒక మహిళ గతంలోనే తన భర్తతో విడాకులు తీసుకుంది. అయినప్పటికీ అతడి ఇంట్లోనే ఉంటూ వచ్చింది. అతడికి వేరే ఇళ్లు ఉండగా అతనక్కడికి వెళ్లిపోయాడు. అయితే దాదాపు 60 ఏళ్లుగా ఆ ఇంట్లోనే ఉన్న వృద్ధురాలు 2023 ఏప్రిల్‌లో కేవలం వైద్య చికిత్స కోసం తన కుమార్తె ఇంటికి వెళ్లింది. మళ్లీ ఇప్పుడు తిరిగి తన ఇంటికి రాగా భర్త లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నాడు. దీనివల్ల తాను ఆశ్రయం లేనిదాన్ని అయ్యానని చెబుతూ ఆమె ట్రయల్ కోర్టుకు వెళ్లారు. విచారణ జరిపిన సదరు న్యాయస్థానం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలోనే విచారణ జరిపిన న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సదరు మహిళ తన ఇష్ట పూర్వకంగానే ఏప్రిల్ 2023లో రెండో ఇంటికి మారారని కోర్టు గుర్తించింది. ఇంటి బయట ఆమె పేరుతో ఉన్న నేమ్ ప్లేట్ కూడా ఉందని, ఇది తాత్కాలిక మార్పు కాదని, శాశ్వత నివాసమేనని కోర్టు ధృవీకరించింది. అయితే ఇప్పుడు ఆమె వెళ్లాలనుకుంటున్న ఇంటికి భర్త రానివ్వకపోవడం వల్ల ఆమె ఏమీ రోడ్డున పడలేదని చెప్పింది. మొన్నటి వరకు కుమార్తెతో కలిసి ఉన్న ఇళ్లు కూడా ఆమె భర్తదే అని గుర్తించింది. అక్కడితో ఆగకుండా న్యాయస్థానం.. ఈ పిటిషన్ వెనుక ఆస్తి వివాదం దాగి ఉందని చెప్పింది. కుమార్తెకు ఆస్తిలో వాటా ఇప్పించడానికే వృద్ధురాలు ఈ చట్టాన్ని వాడుకుంటున్నట్లు భర్త తరఫు లాయర్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఒకసారి స్వచ్ఛందంగా నివాసం మార్చిన తర్వాత ప్రస్తుతం ఆ ఇంట్లో ఉంటున్న వారిని ఇబ్బంది పెడుతూ రీఎంట్రీ ఇవ్వడం చట్టం పరిధి దాటడమే అవుతుందని స్పష్టం చేసింది. అలాగే గృహహింస చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ఒక మహిళ నిరాశ్రయురాలు కాకుండా చూడటమే మెజిస్ట్రేట్ బాధ్యత అని తేల్చి చెప్పింది. ఇది విచక్షణాధికారం మీద ఆధారపడి ఉంటుందని బాధితురాలికి సమాన స్థాయి కలిగిన ప్రత్యామ్నాయ వసతి ఉన్నప్పుడు, ఒక నిర్దిష్ట ఆస్తిలోనే ఉండాలని కోరే హక్కు ఆమెకు ఉండదని జస్టిస్ దుదేజా స్పష్టం చేశారు. గృహహింస చట్టం అనేది నిజమైన బాధితుల కోస మాత్రమే అని.. దుర్వినియోగం చేసే వారి కోసం కాదని స్పష్టం చేసింది.




# టి20 వరల్డ్ కప్‌లో శ్రీలంక జోరు

## ఒమెన్‌పై 105 రన్స్ తేడాతో సూపర్ విక్టరీ

**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో శ్రీలంక జోరు కొనసాగుతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధించింది. గ్రూప్ బీ లో భాగంగా పల్లెకెలె వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఒమన్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో శ్రీలంక పూర్తి ఆధిపత్యం చెలాయించగా, ఒమన్ తేలిపోయి కనీస పోటీనివ్వలేకపోయింది. ఈ విజయంతో గ్రూప్ బీ నుంచి సూపర్ 8 అవకాశాలను మెరుగుపర్చుకోగా, ఒమన్ ఇంటిబాట పట్టేందుకు సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 225 పరుగులు చేసింది. కుశాల్ మెండీస్(45 బంతుల్లో 7 ఫోర్లతో 61), పవన్ రత్నాయక(28 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 60), దసన్ షనక(20 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఒమన్ బౌలర్లలో జితెన్ రమణంది(2/41) రెండు వికెట్లు తీయగా, జయ్ ఒడెద్రా, సుఫ్యాన్ మెహ్మూద్ చెరో వికెట్ తీసారు. అనంతరం ఒమన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 120 పరుగులు చేయగలిగింది. మహమ్మద్ నదీమ్(56 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 53 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో దుష్మంత్ చమీరా(2/19), మహీష్ తీక్షణ(2/11) రెండేసి వికెట్లు తీయగా, దునిత్ వెల్లలేగే, దుషన్ హేమంత, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. ఈ గెలుపుతో శ్రీలంక గ్రూప్‌బీలో టాపర్‌గా కొనసాగుతోంది.




# వరల్డ్‌కప్ అరంగేట్రంలో సంచలనం..

## అనామక ఇటలీ చేతిలో చిత్తైన నేపాల్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్ 2026లో పసికూన ఇటలీ సంచలనం సృష్టించింది. ముంబయి వేదికగా గురువారం నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చిన్న జట్టు ఇటలీ అరంగేట్రంలోనే మాతో జాగ్రత్త అనే హెచ్చరికలు పంపుతూ బోణీ కొట్టింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన నేపాల్‌ను గడగడ వణికిస్తూ జయభేరి మోగించింది. ఓపెనర్ల విధ్వంసంతో 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మని ఊదేసి. మేము చెలరేగితే ఇలా ఉంటది అని చాటింది. ఊహించని ఓటమితో నేపాల్ షాక్‌లో కూరుకుపోయింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని ఇటలీ 12.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు జస్టిన్ మోస్కా (60 పరుగులు), ఆంథని మోస్కా (62 పరుగులు) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. దీంతో 44 బంతులు మిగిలుండగానే ఇటలీ విజయం సాధించింది. అంతకుముందు బ్యాటింగ్ చేసిన నేపాల్ 19.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఆరిఫ్ షేక్ (27 పరుగులు), రోహిత్ పౌడెల్ (23 పరుగులు), ఆసిఫ్ షేక్ (20 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ 2, అలీ హసన్, జస్ప్రిత్ సింగ్, సమ్స్‌తలో 1 వికెట్ దక్కించుకున్నారు. కాగా, ఇదే టోర్నీలో రీసెంట్‌గా తొలి మ్యాచ్‌లో పటిష్ఠమైన ఇంగ్లాండ్‌ను ఓడించినంతపని చేసిన నేపాల్ ఈ మ్యాచ్‌లో కనీసం పోటీ ఇవ్వకపోవడం గమనార్హం. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన ఇటలీ రెండో మ్యాచ్‌తో టోర్నీలో బోణీ కొట్టింది.

### షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# ఐశ్వరీ ప్రపంచ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ 2026లో భారత్‌కు చెందిన షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ ప్రపంచ రికార్డు సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పి ఈవెంట్‌లో స్వర్ణం గెలుచుకున్నాడు. గురువారం ఢిల్లీలో జరిగిన షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో ఐశ్వర్య అద్భుత ప్రదర్శన కనపరిచాడు. రెండుసార్లు ఒలింపియన్ అయిన తోమర్, నీరజ్ కుమార్‌ను కేవలం 0.2 పాయింట్ల తేడాతో ఓడించి ఆసియా ఛాంపియన్‌గా నిలిచాడు. పోటీలో చివరి షాట్ కంటే 0.2 పాయింట్లు వెనుకబడి, తోమర్ అద్భుతమైన 10.7 పాయింట్లు సాధించి తన మొత్తం 362 పాయింట్లను ప్రపంచ రికార్డుగా నమోదు చేశాడు. నీరజ్ తన చివరి షాట్‌లో 10.3 పాయింట్లు మాత్రమే సాధించి రజతంతో సరిపెట్టుకున్నాడు. అనుభవజ్ఞుడైన అఖిల్ షెరాన్ కాంస్య పతకం కోసం మూడవ స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో అతను 343.5 స్కోరుతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అంతకుముందు నీరాజ్ 593 స్కోరుతో క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే ఈ ఖండాంతర పోటీలో పాల్గొనలేదు.

### ఆసియా ఫుట్‌బాల్ కప్‌లో

# భారత్ మహిళల, పురుషుల జట్లు డ్రా

**న్యూఢిల్లీ:** ఎఎఫ్‌సి అండర్17 ఆసియాకప్-2026లో భారత ఫుట్‌బాల్ జట్లు కఠినమైన పోటీలో మ్యాచ్‌లను డ్రా గా ముగించాయి. కౌలాలంపూర్‌లో గురువారం జరిగిన ఫైనల్ డ్రాలో ఎఎఫ్‌సి అండర్ 17 మహిళల ఆసియా కప్ గ్రూప్ బి లో జపాన్, ఆస్ట్రేలియా, లెబనాన్‌లతో కలిసి భారత్ జట్టు డ్రాగా ముగించింది. ఇదే సమయంలో ఎఫ్‌సి అండర్ 17 పురుషుల ఆసియా కప్ గ్రూప్ డి లో ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా మరియు డిపిఆర్ కొరియాతో కలిసి ఉంది. క్వాలిఫయర్స్‌లో ఇరాన్, లెబనాన్, పాలస్తీనా, చైనీస్ తైపీలను అధిగమించి భారత్ చరిత్రలో 10వ సారి ఎఎఫ్‌సి అండర్17 ఆసియా కప్‌కు అర్హత సాధించింది. బ్లూ కోల్ట్స్ జట్టు ఆస్ట్రేలియాతో తమ ప్రచారాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ఉజ్బెకిస్తాన్ మరియు డిపిఆర్ కొరియాతో తలపడుతుంది. ఉజ్బెకిస్తాన్ డిఫెండింగ్ ఛాంపియన్ కావడంతో ఈ టోర్నమెంట్‌కు స్వయంచాలకంగా అర్హత సాధించింది. గత 2025 ఎడిషన్‌లో ఆస్ట్రేలియా గ్రూప్ దశలోనే ఓడిపోయింది మరియు జోర్డాన్, భూటాన్, ఫిలిప్పీన్స్‌పై విజయాల తర్వాత 2026 టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. రెండుసార్లు మాజీ ఛాంపియన్లు అయిన డిపిఆర్ కొరియా 2025లో సెమీఫైనలిస్టులుగా నిలిచింది. తద్వారా ప్రస్తుత ఎడిషన్‌కు ఇప్పటికే అర్హత సాధించింది. గ్రూప్ ఎ లో ఆతిథ్య సౌదీ అరేబియా తజికిస్తాన్, థాయిలాండ్, మయన్మార్‌లతో డ్రా చేసుకుంది.

### టి20 వరల్డ్ కప్‌లో..

# గ్రూప్ ఆఫ్ డెత్‌లో అఫ్ఘానిస్థాన్

## సూపర్ 8 నుండి ఒమెన్, ఐర్లాండ్ ఔట్



**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచ కప్-2026లో ఆఫ్ఘనిస్తాన్ వరుసగా రెండు పరాజయాలను చవిచూసింది. దీంతో వారు సూపర్ 8 దశకు అర్హత సాధించే విషయం కష్టక్లిష్టంగా మారింది. ఇక రెండు మ్యాచ్‌లకు రెండు ఓడిన ఐర్లాండ్, ఒమన్ సూపర్ 8 రేసు నుంచి తప్పుకున్నాయి. కాగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో సూపర్ ఓవర్‌లో ఉత్కంఠభరితమైన ఓటమి తర్వాత ఆఫ్ఘనిస్తాన్ ప్రపంచ కప్‌కు వెళ్లే మార్గం మరింత కష్టతరంగా మారింది. కానీ సూపర్ 8 రౌండ్‌కు చేరుకోవాలనే వారి ఆశలు ఇంకా పూర్తిగా ముగియలేదు. దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయిన తర్వాత ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడవలసి ఉంటుంది. ఆఫ్ఘన్ ఇప్పుడు వారి నికర రన్ రేట్‌ను మెరుగుపరచుకోవడానికి యుఎఇ, కెనడాతో జరిగే మిగిలిన రెండు గ్రూప్ మ్యాచ్‌లను పెద్ద తేడాతో గెలవాల్సిన పరిస్థితి తప్పనిసరి అయింది. ఆఫ్ఘనిస్తాన్ జట్టు సూపర్ 8 కి అర్హత సాధించడానికి రెండు కీలక పరిస్థితులు కనిపిస్తున్నాయి.

మొదటి సందర్భంలో, న్యూజిలాండ్ దక్షిణాఫ్రికాను ఓడిస్తే, యుఎఇ దక్షిణాఫ్రికాను ఓడించి, కెనడా యుఎఇని ఓడిస్తే ఆఫ్ఘనిస్తాన్‌కు ఒకింత సూపర్ 8కి అవకాశాలు ఉంటాయి. ఈ సందర్భంలో న్యూజిలాండ్ గ్రూప్ డిలో అగ్రస్థానంలో ఉంటుంది. అయితే ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా 4 పాయింట్లతో సమానంగా ఉంటాయి. ఇక్కడ నిర్ణయం నికర రన్ రేట్ ఆధారంగా ఉంటుంది. దీంతో పెద్ద తేడాతో గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ తదుపరి రౌండ్‌కు టికెట్ పొందవచ్చు. రెండవ సమీకరణం న్యూజిలాండ్‌ను ఓడిస్తే, దక్షిణాఫ్రికా 8 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంటుంది. ఈ సందర్భంలో, కెనడా న్యూజిలాండ్‌ను ఓడించి, ఆపై యుఎఇ కెనడాపై గెలిస్తే ఆఫ్ఘనిస్తాన్ మరియు న్యూజిలాండ్ రెండూ చెరో 4 పాయింట్లు కలిగి ఉంటాయి.

మరోసారి, సూపర్ 8కి చేరుకున్న రెండవ జట్టు నికర రన్ రేట్ ద్వారా నిర్ణయించబడుతుంది. దీనిలో ఆఫ్ఘనిస్తాన్ న్యూజిలాండ్ కంటే మెరుగైన స్థితిలో ఉండాలి. ఇక ఈ టోర్నమెంట్‌లో మూడు బలమైన జట్లను కలపడంతో దీన్ని గ్రూప్ ఆఫ్ డెత్ గా పరిగణించారు. ఈ గ్రూప్‌లో బలమైన ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ మరియు దక్షిణాఫ్రికా ఒకదానిపై ఒకటి పోటీపడుతున్నాయి. గత టీ20 ప్రపంచ కప్‌లో సెమీ ఫైనలిస్ట్ అయిన ఆఫ్ఘనిస్తాన్ ప్రస్తుతం కీలకమైన క్లిష్టపరిస్థితిని ఎదుర్కొంటోంది. రషీద్ ఖాన్, అతని బృందం తదుపరి ఈ నె 16న యుఎఇతో మరియు ఫిబ్రవరి 19న కెనడాతో తలపడనుంది.




### పురుషుల ప్రో లీగ్..

# భారత్ ఓటమి

## 3-1తో బెల్జియం విక్టరీ


**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025-26లో బెల్జియం చేతిలో భారత్ ఓటమిపాలయింది. పురుషుల ప్రో లీగ్ రూర్కెలా లెగ్‌లో బెల్జియం భారత్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. బెల్జియం తరపున నెల్సన్ ఓనానా (23వ నిముషం), థామస్ క్రోల్స్ (53), ఆర్నో వాన్ డెస్సెల్ (57) గోల్స్ సాధించగా, భారత్ తరపున శిలానంద్ లక్రా (29) గోల్స్ చేశాడు. బెల్జియంకు 4వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే, అలెగ్జాండర్ హెండ్రిక్స్ డ్రాగ్‌ఫ్లిక్‌ను భారత తొలి రషర్ వివేక్ సాగర్ ప్రసాద్ ఆపాడు. బెల్జియం (14) మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ ఈసారి టామ్ బూన్ అడ్డుకోవడంతో లక్ష్యం నుండి తృటిలో దూరమైంది. రెండవ క్వార్టర్‌లో (21) బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించినా భారత గోల్ కీపర్ పవన్ అలెగ్జాండర్ హెండ్రిక్స్ గోల్ చేయకుండా నిరోధించాడు. బెల్జియంకు చెందిన థామస్ క్రోల్స్ గోల్ సాధించాడు. కానీ పవన్ తన గోల్‌ను కాపాడుకోవడానికి మరో కీలకమైన సేవ్ చేశాడు. ఈ సమయంలో థామస్ బంతిని నెల్సన్ ఓనానా (23)కి పాస్ చేయడంతో అతను గోల్ చేశాడు. ఆతిథ్య జట్టు (29) మరో అద్భుతమైన దాడి చేసి పెనాల్టీ కార్నర్‌ను గెలుచు కుంది. మూడవ క్వార్టర్‌లో (38) బెల్జియం మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. జర్మన్‌ప్రీత్ సింగ్ గోల్ లైన్‌లో సేవ్ చేసి స్కోర్‌లను సమంగా ఉంచాడు. నీలకంఠ శర్మ (53) కార్తీ సెల్వమ్‌కు అద్భుతమైన పాస్ అందించినా ఫార్వర్డ్ గోల్‌పై షాట్ తీసుకోలేకపోయాడు. లూకాస్ బాల్తాజార్ బేస్‌లైన్ నుండి సర్కిల్‌లోకి సరైన పాస్‌ను ఆడాగా, థామస్ క్రోల్స్ (53) ఆధిక్యాన్ని అందించాడు. థామస్ మళ్లీ (57) బంతిని సెట్ చేసి బెల్జియంకు విజయాన్ని అందించాడు.

# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## నిఫ్టీ, ఐటి సూచీల్లోనే 1.62 లక్షలకోట్లు ఆవిరి




**ముంబయి, ఫిబ్రవరి 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా ఐటీ రంగ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. కొన్ని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు కనిపించినా, టెక్నాలజీ రంగంలో బలహీన సెంటిమెంట్‌ను అధిగమించలేకపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 558.72 పాయింట్లు నష్టపోయి 83,674.92 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 146.65 పాయింట్లు క్షీణించి 25,807.2 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ ఏకంగా 5.51 శాతం కుప్పకూలింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురై నష్టాలు చవిచూసిన కంపెనీలుగా నిలిచాయి. ఆటో దిగ్గజం మహీంద్రా మహీంద్రా కూడా నష్టాల్లోనే ముగిసింది. మరోవైపు, మార్కెట్ బలహీనంగా ఉన్నప్పటికీ బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్ (తీనిలి), ట్రెంట్ వంటివి లాభపడి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. నిఫ్టీ 25,840-25,900 స్థాయిని దాటనంత వరకు స్వల్పకాలికంగా మార్కెట్ బలహీనంగానే కొనసాగిందని అంచనావేసారు. ఐటీతో పాటు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు కూడా ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి. ప్రత్యేకించి నిఫ్టీలో ఐటి సూచీ 5.51శాతం దిగజారింది. నిఫ్టీ ఐటి కంపెనీ మొత్తం మార్కెట్ విలువలు రూ.27,32,579 కోట్లకు చేరింది. సూరుగా 1.6 లక్షలకోట్లు కంపెనీల షేర్లరూపంలో నష్టం వచ్చినట్లు తెలుస్తోంది. టిసిఎస్ 5.48శాతం 52 వారాల కనిష్టం రూ.2750కి చేరింది. ఇన్ఫోసిస్ 5.48, టెక్‌మహీంద్ర 6.40శాతం, హెచ్‌సిఎల్ టెక్, ఎంఫసిస్, విప్రో కంపెనీలు 4.5 నుంచి ఐదుశాతం చొప్పున దిగజారాయి. మొత్తం ఐటి సూచీని డేంజర్‌జోన్‌లోకి గురువారం నెట్టివేసినట్లయింది. ఒక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.46శాతం క్షీణించింది. స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.86శాతంమేర దిగజారింది. బిఎస్ఇలో 1676 కంపెనీలు పెరిగితే 2530 కంపెనీలుక్షీణించాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 96.82గా కొనసాగి రూపాయి క్షీణతను కొనసాగించారు. కమోడిటీ మార్కెట్‌లో బ్రెంట్ ముడిచమురు ఏప్రిల్ సెటిల్‌మెంట్లకుగాను 39 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 69.01 డాలర్లుగా మారాయి.



# వేతన పెంపును ప్రకటించిన 'విప్రో'

**బెంగళూరు, ఫిబ్రవరి 12:** సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విప్రో తన ఉద్యోగులకు మార్చి ఒకటవ తేదీనుంచి జీతాలను పెంచుతున్నట్లుప్రకటిం చడంతో ఉద్యోగులకు కొండంత ఊరట లభించింది. వేతన పెంపు ఎంతమేర ఉంటుం దన్నది ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు. భారతీయ ఐటి సేవల కంపెనీలు వేతనాల పెంపుపై ఫోకస్ పెంచాయి. అలాగే వేరియబుల్ వేతనాలపెంపును కూడా పరిశీలిస్తున్నాయి. అనిశ్చిత వాణిజ్య పరిస్థితుల్లో వేరియబుల్ పే మంచిదన్న భావనతో ఉన్నారు. సుంకాల యుద్ధం, భౌగోళిక ఉద్రిక్తతలు ఇందుకు కీలకంగా భావించాలి. టిసిఎస్ ఏప్రిల్‌ఋంచి పెంచాలని చూసినా గత సెప్టెంబరునుంచే పెంచుతున్నట్లు ప్రకటించింది.

# హిందాల్కో నికరలాభం రూ.2049 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 12:** హిందాల్కో ఇం డస్ట్రీస్ నికరలాభం మూడో త్రైమాసికంలో రూ.2049 కోట్లు ఆర్జించినట్లు ప్రకటిం చింది. అయితే గత ఏడాది ఇదే కాలంలో 4741 కోట్లు ఆర్జించిన సంస్థ 56.8శాతం నికరలాభాలు క్షీణించినట్లు ప్రక టించింది. రాబడులపరంగా 0.7 శాతం పెరిగాయి. రూ. 66,521గా నమోదయింది. గతత్రైమాసి కంలో 66,058 కోట్లనుంచి స్వల్పంగా పెరిగింది. ఎబిడిటా కూడా 10.8శాతం క్షీణించి రూ.7994 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 8996 కోట్లుగా ఉంది. ఎబిడిటా మార్జిన్ 13.6శాతంనుంచి 12శాతానికి తగ్గింది. కంపెనీ న్యూయార్క్ లోని ఓస్వేగో ప్లాం ట్‌లో అగ్నిప్రమాదం కారణంగా రూ. 2610 కోట్లు భారం పడింది. ఇదే త్రైమా సిక ఫలితాలపై ప్రభావంచూపించిందని కంపెనీ చెపుతోంది. ఇక అల్యూమినియం విభాగం త్రైమాసిక ఎబిడిటా రూ.4832 కోట్లుగా ఉంది. 14శాతంపెరిగింది. ఆదిత్య ఎఫ్ఆర్‌పి, బ్యాటరీ ఫాయిల్, ఎసి ఫిన్ కోటింగ్; కాపర్ ట్యూబ్స్ వంటివాటిలో మంచి బిజినెస్ చేసుకోగలిగామని హిం దాల్కో ఎండి సతీష్‌పాయ్ అన్నారు. త్రైమా సిక పలితాలప్రకటనకు ముందు హిం దాల్కో షేర్లు 0.65శాతం దిగువన అంటే రూ.964.40వద్ద ఎన్ఎస్ఇలో కొనసా గాయి. బెంచ్‌మార్క్ నిఫ్టీ 0.57శాతం పత నం అయితే షేహిందాల్కో షేర్లు మరింత క్షీణించాయి.

# జనవరి రిటైల్ ద్రవ్యోల్బణం 2.75%



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12:** వినియోగదారుల ధరలసూచీ ఆధారంగా నిర్ధారించే ద్రవ్యోల్బణాన్ని జనవరి నెలకుగాను 2.75శాతంగా ఉందని కేంద్ర అర్థగణాంకశాఖ పథక అమలుశాఖ వెల్లడించింది. అఖిలభారత వినియోగదారుల ఆహార ధరల సూచీ ఆధారంగా జనవరిలో 2.13శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ఉత్పత్తులధరలు 1.96శాతంపెరిగాయి. పట్టణప్రాంతాల్లో 2.44శాతంగా ఉన్నట్లు మోస్పీ వెల్లడించింది. ఏటికేడాది హౌసింగ్ ద్రవ్యోల్బణం రేటు జనవరిలో 2.05శాతంగా ఉంది. హౌసింగ్ దరలు కూడా 2.39శాతం గ్రామీణప్రాంతాల్లోను 1.92శాతం పట్టణప్రాంతాల్లోను పెరుగుదలనమోదుచేసాయి. జనవరి సిపిఐ ద్రవ్యోల్బణ డేటాను 2024 బేస్ ఇయర్‌గా చేసుకుని నిర్ధారించారు. గడచిన 12 ఏళ్లుగా వ్యయం తీరు ఎలా మార్పులు చెందిందీ కూడా ఈ బేస్ ఇయర్ మార్పువల్ల తెలుస్తుందని మోస్పీ వెల్లడించింది. కొత్త వ్యవస్థలో సేవలరంగానికి కొంత ఒత్తిడిపెరుగుతుంది. ఆహార ఉత్పత్తుల వాటా మాత్రం కొంతమేర తగ్గుతుంది. ఇక గ్రామీణ హౌసింగ్, ఆన్‌లైన్ మీడియా సర్వీస్ ప్రొవైడర్లు లేదా స్ట్రీమింగ్ సేవలసంస్థలు, విలువలు జోడింపు ఉన్న డైయిరీ ఉత్పత్తులు, బార్లే, ఇతర ఉప ఉత్పత్తులు, పెన్‌డ్రైవ్ బాహ్య హార్డ్ డిస్క్, అటెండెంట్, బేబి సిట్టర్, కసరత్తుల సామనరగి వంటి వాటిని కూడా ఈసారి ద్రవ్యోల్బణంలో మదింపుకోసం ఎంచుకున్నారు. విసిఆర్, డివిడి ప్లేయర్లు, రేడియో టేప్‌రికార్డరు, సెకండ్‌హ్యాండ్ దుస్తులు, పీచు లేదా పీచుతో రూపొందించిన తాడు వంటిఉత్పత్తులను మాత్రం మదింపునుంచి మినహాయించారు. 2012 వరకూ వచ్చిన బేస్ ఇయర్‌సాయంతో రిటైల్‌ద్రవ్యోల్బణాన్ని గణించారు. ఈసూచీలో ఆహారం, శీతలపానీయాలకు ఎక్కువ వాటా ఉంది. ఆ తర్వాత హౌసింగ్, ఇంధనం, సేవలరంగం అంటే రవాణా, ఆరోగ్యం, విద్యారంగాలు కూడా నిలిచాయి. ప్రతి కేటగిరికి ఇచ్చిన ప్రాధాన్యం కుటుంబీకుల వ్యయ సర్వేల ఆధారంగా ఉంటుందని సగటు వ్యయం ఆధారంగా మదింపుచేసి నిర్ధారించడం జరుగుతుందని మోస్పీ వెల్లడించింది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps